



రామాయణం


విచారణ

మద్రామాయణ కిష్కింద కాండ-గేయ కవిత









సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2020120001756


గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్థం **ఉచితంగా eBook** రూపంలో భారత ప్రభుత్వపు సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు, కనుక వారిని సంప్రదించగలరని మనవి చేసుకొంటున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ మద్రామాయణ

కిష్కింధకాండము

(గేయకవిత)

శ్రీ రామచంద్ర పాదాంకితము

కూజంతం రామరామేతి
మధురం మధురాక్షరం
ఆరుహ్యకవితా శాఖామ్
వందే వాల్మీకి కోకిలం.

శ్రీ వాల్మీకికి ముందుగ మ్రొక్కి
మందర కర్తకు వందనముంచి
రామ భక్తుల ఆశీస్సులతో
రామచంద్రుని కీర్తన చేసెద.

వినాయకస్తుతి

ఏకదంతము శూర్పకర్ణము
చలువచూపుల చిన్నవాడా
పార్వతమ్మకు ముద్దుకొమరుడ
విఘ్నరాజా వందనమ్ము.

రచన

రామదర్శన ప్రభాసి, రాజకవి

సూరంపూడి రాధాకృష్ణమూర్తి

హనుమాన్ చాలీసా

ప్రార్థన

అసమాన బలా అంజనిపుత్రా
మేరునగము నీ వజ్ర శరీరము
అసురులపాలిటి కాలుడ వీవు
అగ్రగామివి జ్ఞానము నందు.

సద్గుణ ఖని ఓ భక్తులధనమా
హనుమా వానర శ్రేష్ఠుడ వినుమా
నిలుమా నా హృది అనిలకుమారా
రాముని ప్రియతమ భక్తుడ రావా.

గోష్పదమును గావించు తీరున
వారిధి దాటిన దైత్యమర్దన
రామాయణ మను సుందరమాలకు
అందములొలికే కొలికి పూసవు.

ముకుళిత హస్తం వంచిన శిరసు
కన్నుల నిండుగ ప్రభువు రూపుతో
ముందర ఉందువు రాముని కీర్తన
ఎందు చేసినా మరి సందియమా ?

నీ చరణ కమలముల దివ్యరజముతో
మది పవిత్రముగ చేసి నిలచితి
బలమును బుద్ధిని విద్య యశమును
మా కొసగుమా ఓ కేసరి నందన.

జయహనుమంతా జ్ఞానసముద్రా
జయము నీకు ముల్లోకములందు
రామునిదూత అతి బలశాలి
అంజనిపుత్రా అనిలకుమారా

మంచిని పెంచి చెడునే త్రుంచే
వజ్రశరీరా విక్రమధీరా
స్వర్ణవర్ణము చెవికుండలములు
చక్కనివేషము సుందరజటివి ||జయహనుమంతా||

వజ్రకరమున ధ్వజము వెలయగ
మేనున సొగసుగ మౌంజియు నమరగ
శివాంశజాతా కేసరితనయా
జగమువందన మందెడి తేజుఁడ

విద్యాఖని ఓ సుగుణ చతురుఁడా
రామకార్యమును, తీర్చగ ఆత్రుఁడ
సీతారాముల - సుమిత్రపుత్రుని
సతతము మదిలో నిలిపి స్తుతింతువు. ||జయహనుమంతా||

చిరురూపముతో సీతకు కనబడి
గురురూపముతో లంక కాల్చితివి
భీకరరూపుతో అసురుల త్రుంచి
రామకార్యమును తీర్చినవాడవు.

సంజీవినితో లక్ష్మణు కావగ
రాముని కౌగిటి భాగ్యము కలిగెను
ప్రభువుచేతనే ప్రశంసలంది
సోదర భరత సముడవైతివి ||జయహనుమంతా||

వేయిరీతుల రాముడు పొగడెను
లక్ష్మీపతి తన కౌగిటి నిడెను
సనకాదులు బ్రహ్మాదిమౌనులు
నారద శారద ఆదిశేషులు

కాలుడు కుబేర దిక్పాలకులు
కవులు పండితులు అందరు పొగడిరి
రాముని మైత్రి రాజ్యభోగము
సుగ్రీవునికి కలిగించితివి. ॥జయహనుమంతా॥

నిన్ను నమ్మిన విభీషణాఖ్యుడు
లంకను ఏలుట జగమెరిగినదే
రెండువేల యోజనముల దూరము
ఎగిరి భానుని ఫలముగ గొనగ

ప్రభువు ముద్రికను నోటను దాచి
జలధి దాటగ అచ్చెరువేమది
జరగనివైనన్నో నీ దయ వున్న
జరుగును జగమున అతిసులువుగను ॥జయహనుమంతా॥

రాముని చేరెడి మార్గము నిడెదవు
నీ దయలేక రాముడందదు
నిను శరణందే సుఖములు కాదవా
రక్షకుడవు నువు భయమసలెందుకు

నీ తేజము నువు భరించువాడవు
నీ గర్జనకే వణకు లోకములు
భూత ప్రేత పిశాచ గణములు
నీః జయనామము విని హడలును కద ॥జయహనుమంతా॥

ఆధి వ్యాధులు అన్ని పీడలు
తొలగును నిరతము నిన్ను తలంచిన
మనసున-మాటల-ధ్యానమునందు
నిన్నే నమ్మిన సంకటహరణము

ఎన్నిక రాజు-మునులకు ఏలిక
రామచంద్రునికి నమ్మినబంటువు
అన్ని అభీష్టము లింపుగ తీరును
సొంపుగ నీ గుణ గానముచేసిన ॥జయహనుమంతా॥

నాలుగు యుగముల నీ ప్రతాపము
నిలచును నిరతము జయహనుమంతా
సతతము సాధుల రక్షణ చేతువు
రామదూత ఓ - రాక్షసహరణా

అష్టసిద్ధులకు నవనిధులకును
దాతవునీవు - మాతవరము కద
రామసుధా మధువన్నది నీదే
రాముని దాసుడ వంచే నీవే. ॥జయహనుమంతా॥

నిను తలంచుటది రాముని సేవ
జన్మజన్మలకు దుఃఖహరణము
శ్రీపతి భక్తులు ఎచట పుట్టినా
చేరుట చివరకు రామపాదములు

అన్యదైవముల తలచక నిన్నే
కొలచుట సౌఖ్యములన్ని పొందుట
బలవిక్రమ సంపన్నుడ వగు నిను
స్మరియించిన హరియించు పీడలు ॥జయహనుమంతా॥

జయహో - జయహో జయహనుమంతా
కృప జూడుమయా ఓ గురుదేవా.
నూరుమార్లు మది పఠించినంతనె
బంధములన్నీ తొలగి సుఖమగు

ఎవరు చదివినా స్వామి చాలీసా
సిద్ధికలుగు శివశక్తుల సాక్షిగ
తులసీదాసు - హరికేదాసు
స్వామీ నా హృది నీ మందిరము.

జయహనుమంతా జ్ఞానసముద్రా
జయము నీకు ముల్లోకములందు.

హనుమ పాదములె మనకు శరణము
హనుమ స్మరణమె మనకు కరణము
హనుమ ధ్యానమె మనకు తరణము
హనుమ చింతనమె సంకట హరణము.

మంగళమయ్యా మారుతపుత్ర
మంగళమూర్తీ, మంగళమిదిగో
సుందరమూర్తీ శుభ మంగళము
అందుకొనుమిదే నిత్యమంగళం.



విషయసూచిక

సర్గము పేజీ

శ్రీ గణేశాయనమః

శ్రీ రామచంద్రాయనమః

కిష్కింధ కాండము

సర్గము. 1

పంపసోయగము-సీతాదేవికై శ్రీరాముని ఆవేదన

శ్రీ రఘురాముని రమ్య చరితము
మారుతి రాముని సందర్శనము
సీతాసతికై అన్వేషణము
కపుల సేవ కిష్కింధ కాండము.

సతితో వనమున సాగెను రాముడు
పితృవాక్య పరిపాలన ధీరుడు
శీలసంపద కలిగిన జానకి
అపహరింపబడె ఆ వనమందు.

అన్వేషించుచు ఎంతో కుములుచు
ఆ వనసీమను రామచంద్రుడు
శాపముతీరిన కబంధు పలుకున
ఋష్యమూకము చేరవచ్చెను.

ఋష్యమూకమున సుగ్రీవునితో
మైత్రిచేసుకొని అతని సాయమున
సీతాన్వేషణ జరుపుట సరియని
చేరెను దశరధరాముడు అచటికి.

॥శ్రీరఘురాముని॥

అడుగుజాడలో తమ్ముడు నడువగ
అడుగిడె పంపా తీరముచెంత
కమలము, కలువలు మీనములుండి
శోభించినవా పంపాజలములు

మనోహరమ్మగు నదీజలములు
మనసుహాయినిడు సుందరవనము
మరిమరి గాంచిన రామచంద్రుని
మనసున నిండెను సీత తలంపులు.

ప్రకృతి అంతా శోభామయమై
కలవరపరచగ దుఃఖతప్తుడై
ధరణీనందన తలపుల నిండగ
తమ్మునితో దాశరధి పలికెనిటు.

''వికసిత కమలములవి గను లక్ష్మణః
ఎర్రని కలువలు చూడు సరస్సున
వైడూర్యమ్ముల కాంతితొ జలము
ఒడ్డున నిలచెను పలువృక్షమ్ములు.

శిఖరమ్ములతో శోభిలు గిరివలె
సరసుశోభిలె తరుసంపదతో
భరతునిభక్తి-సతిఅపహరణ
తలచితలచి నే కుములుచుంటిని.

తాపహరమ్ములు శీతజలమ్ములు
వేసట నణచెడి కాసారమ్మిది
అయినాకానీ వసంతశోభ
మనసు కలంచెడు మధన పెంచెడు.

॥శ్రీరఘురాముని॥

చిక్కగపరచిన పచ్చికనేలను
చక్కనివన్నెల పూలురాలగా
రత్నకంబళులు రచించినట్టుగ
శోభిలుచున్నది నేల అంతయు.

నిండుగవిరిసిన తరువులన్నిటిని
దండిగపూసిన పూలతలెంతో
మురిసిపోయిమరి కౌగలించినటు
పెనవేసినవి చూడుము సోదర !

సుమగంధముతో వీచెడిగాలుల
ఫలపుష్పముల శోభలుకలిగిన
మన్మధుసాయము పొందినవాడగు
వసంతుడెంతో ప్రకాశించెను.

మేఘము జలములు కురియునట్టుగా
తరువులుకురిసెను పూలవృష్టిని
పూచినశాఖల నూపుచుపవనుడు
తుమ్మెదలోయన రాగముతీసెను.

నిండినపూల శాఖలు కదలగ
పంచమస్వరముల కోయిల లన్నటు
పాడుచు గుహలను వదలినట్టుగా
తోచెనుపవనుడు రమ్యముగాను.

శ్రీగంధమువలె చల్లనివాడు
మందానిలుడు సుమగంధముతో
సుఖమగుస్పర్శను కలగజేయుచు
తిరుగుచుండెను సోయగమెగసెను.

॥శ్రీరఘురామునః॥

కొండచరులలో పుట్టిన తరువులు
విరగబూసి అవి కలసిపోవగా
పూలరాశివలె గిరులన్నియును
తోచెను కనులకు పండుగచేసెను.

విరసినపూల తరువుల పైన
నిలచినతుమ్మెదలన్నియు గాలికి
పైకిలేచి మరి ఎగురుచునుండగ
నల్లనిముసుగై తోచె తరువులకు.

నిలువుగ పూచిన గోగులు - పూలతొ
బంగరు, వెండి వల్లెవాటులు
ధరించినిలచిన తరుణీమణులన
శోభిల్లినవి ఈ వనసీమలొ

ఈ వసంతపు శోభలన్నియు
క్రొత్తపులుగుల, రవములునిండి
సతికిదూరమై నిలచిన నాకు
తీరనివేదన పెంచుచున్నవి.

భార్యకుదూరము నున్న బాధను
సుమశరుడెంతో పెంచుచుండెను
కోయిలలన్ని నీటికోళ్లు మరి
మధురస్వనములతో పెంచెను వేదన

పంచవటీతటి ఆశ్రమమందు
మనోహరమ్మగు పక్షులకిలకిల
వినుమనిచెప్పుచు మురిసిపోయెడిది
జానకిప్రియముగ ఆలకించెడిది.

॥శ్రీరఘురాముని॥

మక్కువనిండి మనసు పెంచుకొని
మన్మధువశమున చిక్కినపులుగులు
జంటనుజేరి తుమ్మెదగానము
వినుచుముదముతో కలసిపోయినవి.

అశోకతరువుల పూలునిప్పులై
తుమ్మెదరవము చిటపటధ్వనిగా
ఎఱ్ఱచిగురులు జ్వాలలపోలి
వసంతాగ్ని నను దహించుచున్నది.

మనోహరమగు కోకిలస్వనములు
చక్కగపూసిన వసంతశోభలు
జానకికెంతో సంతోషమునిడు
జానకిలేక నే మనదగునా ?

విరివిగపూసిన పూపొదలన్నీ
కనవచ్చినని నేనెటుచూచిన
కానీ, జానకి-చకోరలోచన
కనరాకున్నది మరునికిచిక్కితి.

రెపరెపలాడుచు గాలులువీచెను
స్ఫటికద్వారములు తెరచినయట్టుల
పురులువిప్పినవి పెంటి నెమళ్లు
పరవశించినవి మగనెమలులిట.

కోరికపెరిగి మన్మధువశమై
ఆడునెమలి తన భర్తనుచేరి
నిండు మనసుతొ మగనిచూచుచు
పరిహాసించునటు చూచెను నన్ను.

॥శ్రీరఘురామ॥

ఈ మగ నెమలి ప్రియతమ సతిని
ఏ రక్కసుడు - కాననమందు
అపహరించి, మరి దాచలేదు, అని
ఆనందముతో, ఆటల తేలెను.

వసంత శోభల ప్రభావమిది కద
పులుగులు జంటను చేరుచున్నవి
రావణాసురుడు అపహరించనిచో
మైథిలి నా జత బాయకుండెడిది

విరసిన పూవులు-ఎగసిన తేనెలు
పులుగుల మనసగు - పిలుపులన్నియు
సుమశరు తీవ్రత పెంచుచున్నవి
దాటుట నేనెటు ఈ వసంతము

సీత కూడ ఈ వసంత శోభల
వికారమ్ముమను అనుభవించును
కానీ, అసురుల చేతికి చిక్కిన
కోమలి మనసున శాంతి నిలచునా ?

అప్పటి రాముడ నేనే అయినా
ఆ మారుతమే ఈ మారుతము
అయినా, అప్పుడు చల్లని హాయి
జానకి లేక అదియే జ్వాల

పంచవటిని మాకశుభ సూచనగ
ఆకాశములో కాకి కూసెను
ఇప్పుడు శుభము తోచునట్లుగ
చెట్టుకొమ్మపై కూయుచున్నది

॥శ్రీరఘురామునీ॥

మనసు నిండిన ప్రియురాలిని తన
మగడు వెనుకబడి పోవునట్టుగ
గాలికి కదలెడు పూలగుత్తిని
చేరగ, తుమ్మెద సాగుచున్నది.

మన్మథు బాణము అశోక గుచ్ఛము
గాలికి కదలి మీదకు ఒరిగి
కొట్టునో ఏమో అన్నటు తోచెను
కోమలి లేక సుఖమది లేదు.

కాంతులు నిండి ప్రకాశించెడు
నిండుగ పూసిన మామిడిచెట్లు
చందనాదులు చక్కగనలదుకు
మనిషిగ తోచెను మధుర స్పందనతో

చక్రవాకములు హంస బెగ్గురులు
లేత సూర్యుని కిరణములన్నటు
తుమ్మెదలెన్నో కమలమ్ములపై
ఱెక్కలతో ఈ నీటిని కదపగ.

మనోహరమ్మగు వనమను వస్త్రము
కప్పుకున్నటు తోచుచు పంప
లేళ్లగుంపులు దంతిగుంపులతో
నయనానందము కలిగించును కద.

సీతకు దూరము అయి బ్రతుకుటది
భూమికి భారము అగును లక్ష్మణా!
కుటిల బుద్ధితో సుముఖరుడిపుడు
సీత తలంపులు నింపెను మదిలో

॥శ్రీ రఘురామ॥

మన్మధుడొకడన భయమదిలేదు
కానీ, తోడుగ వసంతుడుండగ
శత్రవుకెంతొ బలము కలిగినది
నేనిలుచుటకు కష్టము కలిగెను.

తామర మొగ్గల రేకుల చూచి
ఆనందించగ మనసు కలుగగ
సీత నేత్రములు తోచె తామరలొ
తీయని బాధ కలచెను మదిని

చల్లని గాలి వీచెను హాయిగ
కానీ, పవనుడు పద్మసుగంధము
తీసుకువచ్చి నన్ను తాకగ
తోచును అది నా సీత శ్వాసయై.

పంపానదికి దక్షిణ దిశలో
ఇంపుగ పూచిన గోగులు చూడుము
పర్వతరాజుకు అలంకారములు
విరియబూసుకొనె కొండచరియలు.

మాలతి, మాధవి, మల్లిక సోకులు
అశోక, సంపెగ, కేతకి సొగసులు
చూత, శింశుప, దిరిశెన శోభలు
వకుల, కురంట, వాలివి, శాచర

నాగరంగములు నారంగములతొ
పచ్చని పొదలు విచ్చిన పూలతొ
సోయగమొలకెను పంపతోయములు
శోభలీనినది పంపాతటము.

॥ శ్రీరఘురాముని ॥

గాలికి కదిలిను తరువుల శాఖలు
ముదముగ ముందుకు వచ్చుట తోచగ
మదవతులన్నటు సుమలతలపుడు
మత్తుగ కౌగిట చేర్చె తరువులను

క్రొత్తగ విరిసిన పూవులపైన
పొంగిన వెచ్చని తేనెల రుచిని
చూచుచుసాగెడి తీరుగతుమ్మెద
ఝుంకారముతో ఎగసెను సుమముల.

పోటీపడినటు తరువులు పూసెను
చీటికి మాటికి తగువాడినటు
తుమ్మెద ఝుంకారమ్ముల వంకతొ
సాటి తరువులలో హేళన సాగెను.

సతితో కూడిన కారండవము
జలకాలాడెను పంప జలముల
మందాకినికీ పంప అందము
అందెను; అందుకు ప్రసిద్ధికెక్కెను.

కన్నులముందు సీతయుండిన
పంపకు చేరువ నుండుట కలవడి
స్వర్గసుఖములు, అయోధ్య నగరము
స్మరణకురావు సుమిత్ర తనయా !

లేత చిగురులు మొగ్గలు నిండి
నిండుగ పూసిన పూవులతోను
ఈ వన శోభ, లలనామణిని
తలపుల నింపి మనసును కలచెను

॥ శ్రీరఘురామునే ॥

జంటగ తిరిగేటి జింకలన్నియు
ఒంటిగనున్న నా మదికెంతో
ఆనందముతో కలిపి దుఃఖమును
అందించినవి మెసెరటి కన్నుల.

పావన పంపా తోయములందు
పవనుని చల్లని గాలుల యందు
పావని సీతతో కలిసి తిరిగిన
తనువున నిలుచును ప్రాణము నాకు.

ఆ కమలాక్షి నవయవ్వనవతి
ముఖము పోలును నిండు చంద్రుని
నా వియోగమున తనుమనగలదా !
ఏ విధి ప్రాణము నిలుపును తనువున.

నే వియోగమును సహించియున్నను
అవమానము నను బ్రతుకనీయదు
అంతటి జనకుడు ధర్మశీలుడు
జానకి ఎచటని అడిగిన ఏమగు ?

కన్నతండ్రికై కానకు రాగా
సహధర్మిణి నను అనుసరించెను
కానీ, నన్నే నమ్మిన సతిని
కావగలేని కృతఘ్నుడను కద!

రాజ్యహీనుడై దైన్యము నిండి
నిర్భాగ్యము అది ముందు నడువగా
జంట విడక నా వెంట వచ్చిన
సీత లేక నా ప్రాణము నిలచున?

॥శ్రీరఘురాముని॥

ముద్దులొలుకు నా సీత ముఖమును
సల్లాపములను, పలికెడి పలుకులు
తిరిగి నేను మరి కాంతున సోదర?
నా కంతటి అదృష్టము అమరున?

అయోధ్య కేగగ అమ్మ వచ్చినను
కోడలు ఏదన? ఏమని చెప్పను
అడవిలో అసురుడు అపహరించెనని
చెప్పుట తగునా? ప్రాణములుండున?

కావున లక్ష్మణ ! పొమ్మిక నీవు
నే నట వచ్చుట జరుగదు వినుము
భరతుడు సోదర ప్రేమకు నిలయము
సోదర ప్రేమతో మెలగుడు మీరు''

అనుచు పలికిన అన్నను గాంచి
సమయమునెరిగి సుమిత్రతనయుడు
మంచి మాటలు ధైర్యోక్తులతో
రామచంద్రుని ఊరడించెను.

''ధైర్యము పూనుము ఓ దాశరథీ !
శోకము వదలుము అన్నా ! రామా !
ధీరసత్తముడవైన నీ విటు
దీనుడవై మాటాడుట తగదు

స్నేహమువలన దుఃఖము కలుగును
దానిని మరచిన శోకము తీరును
స్నేహమువలనే నీట తడసినా
వత్తిమండును చమురు స్నేహమున

॥శ్రీ రఘురాముని॥

కానీ, వదిన తలపులు మరువగ
నుడువుట కాదు నా ఆలోచన
కర్తవ్యము భూజాతను వెదకుట
దాచిన చోటు మనకు తెలిసెనన

చోరుడు భయమున, చేర్చను మాతను
లేదా పాతాళములో నున్నను
ఇంద్రుని తల్లి ఉరమున దాగిన
అంతము చేతును! వదలను చోరుని.

శోకించుటది మొదటి విషయము
శోధించుటది రెండవ విషయము
ప్రధానమయినది రెండవదయిన
దానికి కావలె ధైర్యము రామా !

ఉత్సాహమును వదలకుమయ్యా !
అదియే బలము మనకది శక్తి
ఉత్సాహముతో నిలచిన మనకు
ఏ విఘ్నములు ముందు నిలవవు.

మహాత్ముడవునువు కోవిదుడవు కద !
నిన్ను నువ్వు మరి తెలియకపోయిన
నే చాలుదునా నీకు చెప్పుటకు
శోకము వదలుము మాతను వెదుకగ''

తమ్ముని పలుకుల దైన్యము వీడెను
కర్తవ్యమ్మదితోచెను మనసుకు
మత్తేభములై నిర్భయమ్ముగా
సాగిరి ముందుకు ఉత్సాహముతో.

॥శ్రీ రఘురాముని॥

2. రామ లక్ష్మణుల గాంచి సుగ్రీవుడు భయపడుట.

ఋష్యమూక గిరి దాపులయందు
సుర విక్రములు సుందర రూపులు
రామ లక్ష్మణుల గాంచిన యంత
సుగ్రీవుని మది తల్లడిల్లెను.

వాలి పంపగా చంపుట కొరకై
వచ్చినారు ఆ వీరులనుచును
వానరులందరు కలతజెందిరి
దాగిరి మతంగ ఆశ్రమతావున

సుగ్రీవునిమది కలవరమందెను
ధైర్యము చెదరెను పదములు నిలువక
ఆపదతలచి స్థిమితము తప్పి
పరుగిడ దిక్కుల నరయ సాగెను.

తాపసులైనా శరములున్నవి
మతంగ శాపము వీరికి లేదా?
వాలి పంపగా వచ్చిర వీరు
వీరుల చూడగ ప్రాణములూడును.

పారిపోయినా వాలి చంపును
ఆగిపోయిన వీరు చంపెదరు
అసలు విషయము తెలుసుకురండని
సుగ్రీవుడు తన సచివుల కోరెను.

విల్లంబులతో దర్శనమిచ్చిన
వారిని చూచి వానరులందరు
భయపడిపోయి వడిగా గెంతుచు
చేరిరి సుగ్రీవుని సన్నిధికి.

॥శ్రీ రఘురాముని॥

వాయునందనుడు ముందుకు వచ్చి
వానర రాజుతో పలికె తీరుగా
''ఋష్యమూకమును వాలి చేరునా?
తెలివిగ జూడుము ఏడీవాలి?

భయముతొ నీవు కపిలక్షణము
కనబరచితివి, భీరువుగాకుము
ధైర్యము వీడి ఆలోచింపక
ఏలుట ఎట్లు వానర రాజ్యము?

ఆలోచింపక ఏ పనిచేయకు
ఎదుట వ్యక్తి మదిగ్రహించ నేర్వుము''
అనుచు హితవును శుభమును పలికిన
వాయుపుత్రునితో పలికె రవిసుతుడు.

''హనుమా! వినుమా, వీరలిద్దరు
కమలనేత్రులు ఆజానుబాహులు
ధనుర్బాణములు కలిగినవారై
దేవకుమారులవలె వెలుగుచును.

వాలి పంపగా వచ్చియుందురు
రాజుకు మిత్రుల కొదవ కలుగునా?
శత్రుని మిత్రులు అదను జూచుకొని
అంతము చేతురు-రాజధర్మ మది.

వాలి అనిన సామాన్యుడుగాడు
ఉపాయ మెరుగును అపాయ మెరుగడు
విషయము తెలియగ నీవే పొమ్ము
సామాన్యునిగా వేషము దాల్చుము.

॥శ్రీరఘురాముని॥

ఆకారములు ముఖ కవళికలు
మాటలు వాటితో మనసు తెలియుము
వంచన బుద్ధి కలిగినవారో
శుద్ధ మనస్కులో తెలియుము నీవు.

ముందుగ నీవు ముచ్చటలాడి
నమ్మకమన్నది కల్పించుకొని
ఆపై వారి వివరములడుగుము
శరచాపముల సంగతి తెలియుము.

నిర్మలమైన మనసుతో వారు
ఉన్నటు నీవు గ్రహించినంతనె
సత్యాసత్యము తెలియుము మరల''
అనగా మారుతి సరియని పలికెను.

॥శ్రీరఘురాముని॥

3. హనుమంతుడు రామలక్ష్మణులతో సంభాషించుట.

వానర రూపము వీడెను మారుతి
తేజము నిండిన భిక్షు రూపమున
రామ లక్ష్మణుల చెంత చేరెను
అతి నమ్రతగా వందన మిడెను.

వినయము నిండి పలికెను మారుతి
వివరములడిగెను వినసొంపుగను
''అయ్యా ! మీరు దేవసమానులు
రాజ ఋషులుగా అగుపడుచుండిరి.

ఈ వన సీమల కేలవచ్చితిరి
మీరు తిరిగెడి స్థలములు కావు
మంచి వ్రతము చేపట్టినవారు
పులుగులు, మృగములు భయపడుచున్నవి

మేని కాంతితో పంప మెరసెను
మాన్యులు మీరు ప్రాయము నుండిరి
కేసరి చూపులు కలిగినవారు
మృగ రాజంతటి బలమగువారు.

బంగరు సింహాసనము నందున
ఉండగ తగిన రాజవరేణ్యులు
ఇంద్రచాపము పోలిన ధనుసులు
కరి తొండముతో సరిపడు భుజములు.

నడచి అలసి యానిట్టూర్పులవి !
జడలు ధరించి తిరుగుట ఏల?
మీ యోగ్యతకు కనబడు స్థితికి
పొంతన కుదరదు ఎందుకు స్వామీ !

విశాల వక్షస్థలముతొ మీరు
వనమున తేజము నింపినారయా !
నింగి విడచి ఈ నేలను చూడగ
దిగినయట్టి రవి చంద్రుల మీరు?

పరిఘల పోలిన హస్తములుండి
గుండ్రగ బలమును తెలుపుచున్నవి
ఆభరణమ్ములు ధరించలేదు
కారణమేమో తెలియకున్నది.

॥శ్రీరఘురామునిః॥

అడవులు - జలధులు నిండిన భూమిని
వింధ్యాచలముతో శోభిలు ధరణిని
పరిపాలించగ చాలిన వీరులు
దీనత నుండగ కారణమేమి ?

మీధనుస్సులు నిగనిగ మెరయుచు
గంధాదులతో బంగరు పూలతో
పూజలనంది తేజము నిండెను
ఇంద్రుని వజ్రాయుధమును పోలును.

అమ్ముల పొదులవి పగవారలకు
ప్రాణముతీయు సర్పములన్నటు
పోలిన శరముల నిండియున్నవి
నాడెమైనవి శుభకరమైనవి.

మిక్కిలినిడివి వెడల్పుగలిగి
భయము గొలుపుచు మెరసే కత్తులు
కుబుసము విడచిన సర్పముపోలి
ఉన్నవి-రిపులకు కలలోమెదలును

బదులిడకుండిరి కారణమేమి?
నా వృత్తాంతము తెలిపెద నార్యా!
ధర్మాత్ముడును కపులకు రేడు
సుగ్రీవుడను కపికలడిచట.

అన్నచె ఆతడు తరిమివేయబడి
దేశము తిరుగుచు ప్రాణ భయమున
అతి బాధలో అతడుండెను స్వామీ !
వచ్చితినేను ఆతడు పంపగ

॥శ్రీరఘురాముని॥

సుగ్రీవునికి సచివుడనేను
హనుమంతుడను వాయుపుత్రుడను
కోరిన రూపము దాల్చగనేర్తును
కోరిన స్థలముల తిరుగగ చాలుదు.

చెలిమిని కోరి మా సుగ్రీవుడు
పంపెను నన్ను'' అని పలుకగను
ముదమునంది శ్రీరామచంద్రుడు
తమ్మునితోను తిరుగపలికెను.

''సోదర ! సామాన్యుడు కాడితడు
ఘనమతి సుగ్రీవుని సచివుడయా !
వెదకెడివాడే ముందు నిలచెను
ఇతనిలో అతనిని చూడగతగును.

లక్ష్మణ ! యిమ్మ ప్రత్యుత్తరము
శాస్త్రము లెరిగిన ప్రజ్ఞావంతుడు
అతనికి తగినటు తిరిగి పలుకనిచో
తలచును మనలను అపండితులుగ.

ఋగ్, యజు స్సామ వేదములు
శిక్షా వ్యాకరణమ్ములన్నియు
త్రికరణశుద్ధిగ నేర్చినవాడే
పలుకగ నేర్చును యీ విధముగను.

స్వచ్ఛమైన ఉచ్చారణతోను
అప శబ్దమ్ములు అనలే లేక
ముఖమున కన్నుల లలాటంబున
తనురోమలందు దోషములేదు.

॥శ్రీరఘురామునీ॥

వ్యర్థ పదములు వెదకిన దొరకవు
సందిగ్ధమునకు తావేలేదు
తొందరలేదు మాటలయందు
మాటపెగలని తీరులు లేవు.

మధ్యమస్వరమున వ్యాకరణముతో
శుద్ధమయిన వాక్చాతుర్యముతో
కత్తినెత్తిన శత్రువయినను
కొట్టుకుపోగల వాక్ప్రవాహము.

ఏ రాజయినా యింతటి మంత్రిని
పొందకున్న మరి కీర్తి గడించున?
తలచిన కార్యము తీరుగనడచున?
సఫలీకృతుడగు ఇట్టి దూతచే

ధరణినేలగా తలచిన రాజు
ఈ విధమైన దూత కోసమై
తనుగా చూచుట యుక్తమైనది
సర్వము జరుగును నిర్విఘ్నముగ''

అన్న పలుకులు వినిన లక్ష్మణుడు
వాక్యకుశలుడు పలికెతీరుగా
''పండిత శ్రేష్ఠా ! వింటిమి మేము
మీ సుగ్రీవుని నామధేయము.

రవిసుతుగుణములు ప్రభావమ్మును
వింటిమి మేము-నీవు నుడివినటు
చేయుటకొరకై సిద్ధము నుంటిమి
సిద్ధించును నీ కోరిక హనుమా ! ''

॥శ్రీరఘురాముని॥

అనగా వినిన వాయునందనుడు
సుగ్రీవునికి జయమును కోరుచు
రామ సుగ్రీవుల చెలిమిని బలముగ
కూర్చ నెంచెను సంతోషముతో.

4. రామానుజుడు హనుమంతునితో తమ వృత్తాంతము తెలుపుట.

సుగ్రీవునిగన వచ్చిన వీరుల
రామ లక్ష్మణుల కాంచిన మారుతి
తలచెను మదిలో రవిసుతు కార్యము
జరుగును తప్పక వీరి వలననే.

మారుతి పలికెను రాముని చూచుచు
''అయ్యా! నీవు తమ్మునితోను
ఈ వన సీమల తిరుగుట ఏల?''
తమ్ముడు బదులిడె అన్న ఆనతిని.

''ద్యుతిమంతుడును తేజోవంతుడు
దశరథ భూపతి ధార్మిక శ్రేష్ఠుడు
ధనధాన్యములతో యజ్ఞయాగముల
రెండవ బ్రహ్మయి పురమునేలెను

ఆయన జ్యేష్ఠ కుమారుడు రాముడు
పరాక్రమమున ప్రసిద్ధి గాంచి
సర్వభూతముల రక్షణ చేయగ
చాలిన యోగ్యుడు ఈతడు హనుమా!

॥శ్రీరఘురాముని॥

పితృవాక్య పరిపాలన చేయగ
రాజ్యమువదలి కానలనడచెను
నడచెను భూసుత సీతాదేవి
భర్తతో-సాయంసూర్యకిరణమై.

రామచంద్రునకు సోదరుడను నే
అనుసరించితిని అన్న పదముల
సేవలుచేసి జన్మతరించగ
సేవించెద నా అన్నను హనుమా!

లక్ష్మణుడది నా నామధేయము
కృతజ్ఞుడు మరి సుఖపడసిరిగల
జీవుల రక్షణ చేసెడి రాముడు
రాజ్యము వదలి కానల కదలెను

కాననమందు రామచంద్రుని
సతియగు సీతను కామరూపియగు
రక్కసుడెత్తుకు పోయి దాచగా
వెదకుచు మేము తిరుగుచుంటిమి.

శాపవశముచే దానవుడయిన
''దను''వనువాడు సీతను వెదుకగ
సాయము చేయును రవి సుతుడనుచు
సూటిగ జెప్పెను నిజము కపీంద్రా!

జనుల పొగడ్తల నందిన రాముడు
దానగుణముచే శోభిలు రాముడు
అతనికి ఇపుడు మీ సుగ్రీవుడు
అండగ నిలచెడి దిక్కు కపీంద్రా!

॥శ్రీ రఘు రామ ॥

దీనరక్షకుడు ధర్మరక్షకుడు
దశరథ భూపతి కుమారుడితడు
తండ్రికి తగిన తనయుడు అయినా
సాయము వేడగ వచ్చె రవిసుతుని.

భూతల మండలి జీవికి సుఖములు
అనుగ్రహించే ప్రభువగురాముడు
వినయముగా మీ వానరరాజు
అనుగ్రహమ్మును కోరుచుండెను.

సద్గుణ సంపద కలిగినవాడు
రాజలోకమున పూజ్యుడు అయిన
ఉత్తమదాత దశరథతనయుడు
కపిరాజును తను శరణుకోరెను

సత్కీర్తికి మా అన్నయె నెలవు
అంతటివాడు శోకవశుడయి
దిక్కని వేడెను మీ సుగ్రీవుని
దయతోనతడు చేర్చగనగును.''

అని పలుకుచును కన్నులనుండి
అశ్రుధారలు కురియు లక్ష్మణుని
చూచిపలికెను వాయునందనుడు
ఊరడించెను మృదువచనముల.

''విజితేంద్రియులు విక్రమమూర్తులు
సదాచారులు సజ్జనపూజ్యులు
మిమ్ముగనుట మా రాజు భాగ్యము
రవిసుతువివరము తెలిపెద వినుడు.

॥శ్రీరఘురాముని॥

అన్న వాలి మా రాజు భార్యను
అపహరించి మా తేనిని తరిమెను
అడవులబట్టి తిరిగెడి రాజు
అండగనిలచును తనకపిసేనతో''

అనుచు తియ్యగా పలికి మారుతి
సుగ్రీవుని కడకేగగ రమ్మని
లక్ష్మణమూర్తితో పలుకగనంత
పవనతనయుని పొగడె లక్ష్మణుడు.

''అన్నా ! యీ కపిశ్రేష్ఠుడు నిజమును
పలుకుచుండెను సుగ్రీవునికి
నీతో కాగల కార్యమున్నది
నీ కార్యము నెరవేరినదనుకొను.

ప్రసన్నమయిన ముఖకవళికలు
ప్రియము గూర్చెడి హితవచనమ్ములు
సాధుస్వభావము వినయసంపద
మోసము లేదని తోచుచున్నది.

కావున మనము వానరేంద్రుని
చూడగపోదము'' అనగా రాముడు
సరియని పలుకగ వానరశ్రేష్ఠుడు
కపి రూపముతో నిలచె వినయముగ.

రవిసుతు కార్యము నెరవేరినదని
సంతసమంది రామలక్ష్మణుల
నిరువుర చేర్చగ రవిసుతుముందు
భుజముల నిడుకొని తృటిలో చేరెను.

॥శ్రీరఘురాముని॥

5. శ్రీరామ సుగ్రీవ మైత్రి.

రామలక్ష్మణుల నిరుపురనపుడు
ఋష్యమూకగిరి సుఖముగ చేర్చి
సుగ్రీవునితో పలికెను మారుతి
రాఘవు ఘనత తెలిపెను తీయగ.

"సూర్యతేజుడు రామభద్రుడు
మతిమంతుడు తన తమ్మునితోను
నిన్ను చేరగ వచ్చెను ఘనుడు
రవికులతిలకుడు, సూర్యకుమారా!

ఇంద్రుని గెలవగ తేజోవంతుడు
దశరథసూనుడు ధర్మ నిరతుడు
పితృవాక్యపరిపాలనదక్షుడు
సతితో వనమున గడుపుచుండగా.

రావణాసురుడు రాముని సతిని
అపహరించెను విను-మహరాజా!
ధరణినంతను కీర్తిగడించిన
దశరథతనయుడు రక్షణ కోరెను.

పూజ్యులలోను ఉత్తములయ్యా!
భాగ్యము నీదని మదికో తలచుము
నెయ్యము కోరి వచ్చిరి వినుము
పూజలుచేసి పుణ్యమునందుము"

పావని పలుకుల ముదమును పొంది
మదిలో భయము తొలగిపోవగా
మనుజ రూపమున త్వరగా వచ్చెను
మనుజోత్తములను సందర్శించగ

॥శ్రీరఘురామునిః॥

ధర్మగుణముతో రాజిలువారు
సర్వభూతముల వ్యాపకులనుచు
మారుతి పలికిన పలుకులు వినిన
రవినుతుడనెను దాశరథులతో.

''మానవ లోక పాలకులారా !
మీరు నెయ్యము కపితో చేయగ
ముందుకువచ్చుట నా భాగ్యమది
నే కృతకృత్యుడ ! అయినా వినుడు

నాతో చెలిమి చేయగ మీకు
నిండుగ సమ్మతి అయినచోనిపుడు
నా చేతితో నీ చేయి కలుపుము
నే చాచితినిదె కరము వినయముగ.''

రాముడు మదిలో సత్యము నెరిగి
మనసునిండుగా కరమును కలిపి
మానవోత్తముడు-కపికులోత్తముని
కౌగలించుకొని గుండియ కలిపెను.

పవనతనయుని మదిపులకించెను
చంద్రపుల్లలతో అగ్ని రగిల్చెను.
అంతట మిత్రులు హుతవాహునికి
పూజనుచేసి ప్రదక్షిణించిరి.

రామ సుగ్రీవులు అగ్నిసాక్షిగా
స్నేహము నెరపి తమ కార్యములు
తీరినట్టుగా సంబరపడుచు
తృప్తిగ చూపులు పంచుకొనిరట.

॥శ్రీ రఘురాముడు॥

ఆనందముగా స్నేహితులిరువురు
కలసిన శుభ సందర్భములోన
సుగ్రీవుడు శ్రీరాముని చూచి
మన, సుఖదుఃఖములొకటని పలుకుచు.

నిండుగ పూసిన తరువు శాఖను
విరచి ఆసనము చేసె రామునికి
హనుమంతుడు ఒక చందన శాఖను
విరచి లక్ష్మణుని కూర్చొన చేసెను.

తరువు శాఖపై రామచంద్రునితొ
తను కూర్చొని సుగ్రీవుడు పలికెను
"రామా ! వాలి నాకు అన్నయగు
భీకరమైన పరాక్రమవంతుడు.

నాపై కోపము నిండిన వాలి
రాజ్యమునుండి తరిమివేసెను
నా భార్యను చేపట్టెను అతడు
అడవులబట్టి తిరుగుచుంటిని

కరుణ నిండిన మనసుతొ నీవు
అనుగ్రహించుము ఓ నరపుంగవ !
వాలిభయమది తీర్చునట్టుగా
అభయమునిమ్మ దశరథనందన !"

రవిసుతుపలుకులు వినిన దాశరథి
శరణాగతులకు రక్షకుడై మరి
స్నేహధర్మము తెలిసిన ధీరుడు
మందహాసముతో పలికె ప్రియముగా.

॥శ్రీరఘు రామునీ॥

"మైత్రికి ఫలము ఉపకారము సుమ!
తీరగ తెలియుము వానరోత్తమా!
అధర్మపరుడగు వాలిని చంపెద
ధర్మము నెరపెద విక్రమస్ఫురణతో.

పిడుగుపాటుకు పగిలిన గిరివలె
పడును వాలి, నా బాణహతుడయి"
రాముని పలుకుల సంతసమందెను
రమయు, రాజ్యము పొందినట్టుగా.

"వాలి మరణము తప్పదు కావున!
వీరపుంగవా! అతిశీఘ్రముగా
వాడి బాణముల వాలిని కూల్చి
వానిభయమునువు తీర్చుము" అనగా.

ప్రసంగ మటుల సాగుచుండగా
సీతాదేవి కమలలోచనకు
వాలికి, లంకాధీశునకపుడు
వామనయనములు అదిరెనొక్కపరి

॥శ్రీరఘురాముని॥

6. శ్రీరామ సుగ్రీవ సంభాషణము

రామచంద్రునితో సుగ్రీవుడట
పలికె తీరుగ సచివోత్తముడు
హనుమంతుడు మీ వివరములన్ని
తెలిపెను వనముకు మీరు వచ్చుటది.

మిథిలాధీశుని కూతురు సీతతో
నీ తమ్ముడు యీ లక్ష్మణమూర్తితో
వనమున నీవు తిరుగుచుండగా
క్రూర రక్కసుడు మీకు తెలియకనె.

నీ సతి సీతను అపహరించుట
త్రోవలో జటాయు సంతము చేయుట
అంతయు వినిచెను ఆంజనేయుడు
నీ దుఃఖము నే తొలగించెదను.

పతివ్రతయగు సీతాదేవిని
దుష్ట రక్కసుడు ఎచట దాచినను
దనుజుని త్రుంచి వేదశృతిని
తెచ్చినరీతిగ తెచ్చెద తల్లిని.

పాతాళములో నుంచినగాని
ఆకాశములో దాచినగాని
నే తేగలుగుదు సీతాదేవిని
చింతింపగను వలదు నీవిక

రామా! నేను సత్యము చెప్పెద
సీతను దానవు లందగలేరు
విషభక్ష్యమును తినినవానివలె
మడయునుగాని మనలేదుసుమా!

అంబరవీధిని అతి తొందరగా
రావణుండు గొనిపోవు అతివను
ఆడుపామువలె అల్లల్లాడగ
నాతో, ఇట యీ నల్వురు గాంచిరి

ఆమెకూడ మము చూచినదయ్యా!
అంబరమందు నగలను కట్టి
మూట విసరెను మా హనుమంతుడు
భద్రపరచెనవి చూపెదనీకు

॥ శ్రీ రఘురామః ॥

నీ వాల్గింటివి అనగలేమో?
నీవు గుర్తుతో తెలుపుము'' అనగ
రాముడు వారిని తొందర చేసెను
పావని సొమ్ములు తెచ్చి చూపెను.

మూటగట్టిన వలువను గాంచెను
మూటలోనున్న నగలను గాంచెను
మంచుకమ్మిన చంద్రుని రీతిగ
రాముని చూపుల నిలచె నశ్రువులు.

హా సీతా! నా పిర్రియురాలా యని
దుఃఖించుచును సొమ్ముల నంతట
గుండెల హత్తుకు-సర్పము రీతిగ
బుసలమాదిరి శ్వాసించెనట.

శోకించుచును స్మృతి దప్పినది
తిరిగి తేరుకొని సొమ్ముల చూపుచు
పచ్చిక నేలను నగలు రాలినవి
కావున చెక్కు చెదరక నిలచెను.

''సోదర! చూడుము నగలు చూడుము
సీతవి ఇవికద తీరుగ చూడుము''
అనుచు రాముడు నగలను చూపగ
వినయముతో సౌమిత్రి పలికెను.

''పాద పద్మములు దర్శించెదను
ప్రణామముంచి తరియించెదను
కావున అన్నా! అందెలు వదినవి
మిగిలిన నగలు గురుతు నెరుగను.''

॥శ్రీరఘురాముని॥

ఆరాటముతో నిండిన రాముడు
రవి సుతు నడిగెను సీత వివరము
వంచకుడుండెడి తావు అడిగెను
కూకటివేళ్ళతొ కూల్చెదననెను.

"ఇచ్చట నేనయి చంపు టెట్లని
సందేహించకు సూర్యకుమారా!
ఇంతటి బాధకు నను గురి చేసెను
కావున రక్కసు లందర జంపెద.

చోరుని ఉనికి తెలియజేయుము
జాలము నేనిక సహించలేను
సతి అపహరణము ఓర్వజాలను
దుష్టుని త్రుంచెద సూర్యకుమారా!".

॥శ్రీరఘురాముని॥

7. శ్రీరాముని అండ నిలచెదనని సుగ్రీవుడు బాస చేయుట

గద్గద కంఠముతో సుగ్రీవుడు
పలికెను అపుడు రామచంద్రునితొ
"రక్కసు వివరము వాని ప్రదేశము
శక్తి యుక్తులను పూర్తిగ నెరుగను."

కానీ వినుము! వంత నొందకుము
ఏదో విధముగ భూమీ సుతను
నీ దరి చేర్చెడి యోచన చేతును
ముమ్మాటికి నమ్ము నెయ్యము సాక్షి.

మాతను తెచ్చెద ప్రతినగ నెంచుము
ధైర్యము విడువకు మహాత్ముడవు కద
దుఃఖించుటది తగదు రాఘవా
వగపే మూలము గౌరవానికి.

సతీ వియోగపు దుఃఖము నెరుగుదు
కోతి నయినను ధైర్యము నుంటిని
ముదితకోసమై వగచుట ఏల
పండితుడవునువు చేయుట ఇటులా?

ధైర్యముతో కన్నీటిని కట్టుము
పట్టు సడలని పౌరుషమందుము
దుఃఖమునందు ధన నష్టమున
ప్రాణాపాయము భయమునందున

బుద్ధిబలముతో ధీరుడు నిలచును
శోకవశుడగు బుద్ధిహీనుడు
బరువుతో క్రుంగిన నావ సంద్రమున
మునిగిన రీతిగ మునుగు దుఃఖమున.

ముకుళితహస్తము లివిగను రామా!
నా స్నేహమునువు మన్నించు మయా!
ప్రార్థన నాది శత్రుహరణ నువు
ధైర్యము పూనుము పురుషపుంగవా!

నెయ్యముతోనే హితము చెప్పితి
నీకు చెప్పగా నే చాలుదునా!''
అనుచు పలుకగా రామచంద్రుడు
అశ్రుల నాపి పలికె ప్రియముగ

॥శ్రీరఘురాముని॥

"గుండెల హత్తుకు ప్రేమపంచి మరి
పలికెడి హితనిగ పలికితి వయ్యా!
ఆపదలందు ధైర్యము గరపిన
ఉత్తమ హితునిగ వర్తించితివి

అక్కరలో నా ప్రక్కల నిలచిన
ఒక్క హితుడవు బంధువు లెందుకు
నిక్కమయిన నీ కూరిమి పలుకుల
చక్కబడినది నా మనసెంతయొ

సతిని వెదకుట, రక్కసు ద్రుంచుట
వలయు యత్నము చేయుము నీవు
విత్తు జల్లుటకు అనువగు నేలను
నే చేయదగు కార్యము తెలుపుము.

సూర్యనందనా నా పలుకులవి
నిను మెప్పించగ పలుకగలేదు
అసత్యమెరుగను ఇక ముందాడను
శంకవదలుము శపదము చేసితి."

రాముని ప్రతిన హితవాక్యములు
వినిన సుగ్రీవుడు అతని సచివులు
అమితానందము నందిరి అచట
కార్యసిద్ధియని తలచె సుగ్రీవుడు.

8. సుగ్రీవుని దుఃఖము–శ్రీరాముని ధైర్యోక్తులు

సుగ్రీవుడు పలికెను వినయమునిండి
రామానుజుడు వినుచుండగను
"నీ స్నేహముతో కపినయినా నను
రామ నేస్తమని గౌరవింతురు.

॥శ్రీరఘురాముని॥

నీ సాయముతో స్వర్గపురమది
లభించకలదు మాన్యుడనయితిని
నీ నెయ్యముతో నావారలకు
పూజనీయుడను అయితిని రాఘవ.

నా స్నేహము నువు తెలుసుకొందువు
నే నుడివిన అది ఆత్మప్రశంసయే
స్నేహితుడయినచో లోపము లెంచక
ఉత్తమ గతిగా నెయ్యమెంచవలె.

శరీరమునకు కరములమాదిరి
కంటికి రెప్పల మాదిరిగానే
నిలచి మిత్రుల కార్యము లన్నియు
ఆలోచించక నెరవేర్చవలె.''

సుగ్రీవుడటు పలుకగ రాముడు
తమ్ముడు ప్రక్కన వినుచుండగను
''నీవు నుడివినది నిక్కమేసుమా
నే గ్రహించితి నెయ్యపు విలువ.''

సంభాషణమటు సాగుచుండగా
క్రొత్తచిగురులు పూలునిండిన
తరుశాఖలను క్రొత్తవివేసి
దాశరథులను కూర్చొనజేసిరి.

తిరిగి పలికెను రవిసుతుడపుడు
''అన్న వాలిచే తరుమబడితిని
ఋష్యమూకమున దాగియుంటిని
దుఃఖము తీర్చి నను రక్షించుము.''

॥శ్రీరఘురామునకు॥

పలికెను లీలగ నవ్వుచు రాముడు
''నా మిత్రుడవు మేలు చేసెదను
కీడు చేయుటది రిపు లక్షణము
చంపెద వాలిని వ్యథ నీకేల?

నా శరములు అతి వేగము గలవి
మిరుమిట్లు గొలుపుచు భయంకరమవి
స్కందవనమున పుట్టినట్టివి
వజ్రాయుధముతో సమానమైనవి.

భయంకరమయి కోపము నిండిన
సర్పమువంటి శరములు చూడుము
వజ్రాయుధపు పాటుకు గిరివలె
నీతిలేని ఆ వాలి కూలును.''

''అగ్నిసాక్షిగ చెలిమి చేసితివి
చేయి కలిపి నా మనసు గెలిచితివి
దుఃఖానలము కాల్చగ తెలిపితి
చిన్న విషయము కాదు రాఘవా!''

అనుచు పలుకుచు దుఃఖమునిండి
కన్నులనీరు పారుచుండగా
డగ్గుత్తికతో మాటలు పెగలక
సూర్యనందనుడు శోకము నిండెను.

ధైర్యము తెచ్చుకు సుగ్రీవుడట
వాలి చేసిన దుష్కార్యములను
నిర్దయుడై తన హితులందరిని
చెరలో నుంచుట తెలిపెను అపుడు.

॥శ్రీ రఘురాముని॥

"రాజుగ వాలి ఏలుచుండగ
యువరాజగు నను వెడలగొట్టెను
నా ఇల్లాలిని అపహరించెను
నను జంపుటకై యత్నము నుండెను.

నను జంపుటకై వచ్చినవారిని
తెలుసుకు వారిని చంపుట నా పని
కావున, మొదట మిమ్ముల చూచి
భయము నందుటకు కారణ మదియే.

ఈ హనుమంతుడు ముందు నిలువగా
మిగిలిన ఈ కపులందరు నన్ను
ప్రాణప్రదముగా కాపాడగను
బ్రతికియుంటిని దశరథ నందన."

అంతట రాముడు అడిగె రవిసుతుని
"మీ వైరమునకు కారణమేమి?
కారణమల్పము అయిన మాటలతో
సమాధానము చేయగ చాలుదు.

వైరకారణము బలమయినచో యిక
వాలిని కూల్చి కార్యము తీర్చెద
నదివలె నా మది పరుగిడుచున్నది
విశదపరచుము సర్వము యిపుడే.

వింటిని ఎక్కు పెట్టకమునుపే
సర్వము తెలుపుము ఓ సుగ్రీవా!
వింటినుండి మరి శరము వెడలెనా
వాలి చచ్చును నిశ్చయమ్ముగా."

॥శ్రీరఘురాముని॥

9. సుగ్రీవుడు వైరకారణము నివేదించుట.

తీరుగ పలికెను రవిసుతుడంతట
"ఇరువురు పుత్రులు మా జనకునకు
అందు జ్యేష్ఠుడు వీరుడు వాలి
చిన్నవాడను నేను రాఘవా!

ప్రేమగ బరగెడి వాలి అంతట
తండ్రి గతించగ రాజై ఏలగ
వినయమునిండి హితమును గోరెడి
బంటుగ నాతని సేవలు చేసితి.

కాలము ఆ విధి జరుగుచుండగా
మయుని తనయుడు-దుందుభి అన్న
మాయావి రక్కసుడు స్త్రీ నిమిత్తమై
వైరము వాలితో కలిగి యుండగ

మాటు మణిగిన నిశీథిలోన
మదించిపోయి పోరుకువచ్చి
నగరి ముందర నిలబడి వాడు
అతి భీకరముగ అరచు చుండగా

రోషమునిండి పానుపునుండి
లేచిన వాలి పోరుకు సాగగ
ఉదయమువరకై వేచియుండమని
ముదితలు, నేనును, వేడిన వినకయె.

అన్న పోరుకు సాగగనంత
అనుసరించితిని సహాయపడగ
ముందరవాలిని గాంచి అంతట
పరుగిడ సాగెను ఆ మాయావి.

॥శ్రీరఘురాముని॥

వెన్నెలతోడుగ నుండగ వాలి
వెంబడించెను ఆ మాయావిని
అంతట వాడొక బిలమును గాంచి
అందు దూరెను ప్రాణభీతితో

నన్నుగాంచి నా అన్న బలికెను
నీ విచ్చటనే నిలబడియుండుము
బిలముజొచ్చి ఆ మాయావిని, నే
చంపి వచ్చెదను అనగా, నేను

అనుసరించెదను నిన్నే అనగ
వినకనె, అన్న, బిలము జొచ్చెను
నే నచ్చటనే ఒక ఏడాది
వేచియుంటిని వాలి కొరకునై

అంతట నెత్తుటి ప్రవాహమ్మది
బిలమునుండి అట వెడలజొచ్చెను
నురగలు వెడలెను, రక్కసి అరుపులు
వాలి రోదనగ వినవచ్చినవి.

అన్న అసువులు బాసెను అనుకొని
దుష్ట దనుజుని భీతి చేతను
కొండ నొక్కటి బిల ద్వారమున
అడ్డముగా పడవేసి వగచుచు

అన్నకు జలములు వదలి నేసట
దుఃఖము నిండి పురము జేరి, మరి
అన్న మరణము తెలియనివ్వక
రోజులంతట దొర్లించగను

॥శ్రీ రఘురాముని॥

విషయము మెల్లగ తెలిసిన సచివులు
వానర రాజ్యము నప్పగించిరి
వాలి అంతట ఆ మాయావిని
అంతముజేసి తిరిగి వచ్చెను.

రాజ్య కాంక్షతో అన్నను వదలి
పురము జేరితిని అనుకొని అతడు
క్రోధమునిండి కుమతీ నువ్వు
తమ్మునివా ! నా శత్రువగుదువుర !

నమ్మిన నన్ను వదలివచ్చితివి
బిలమున కడ్డము కొండ నుంచితివి
కులుకుచుంటివి పట్టము కట్టుకు
పలికెను వాలి కోపము నిండి.

నా సచివులను మిత్రులందరిని
చెరలో నుంచెను ఆ కోపిష్టి
బలగమ్ములతో వాలిని నేను
నిగ్రహించగ చాలియున్నను

అన్న కావున తప్పగ తలచిన-
శాంతము రాగా దయచూపునని
గౌరవించుటకు ఫలమిది నాకు
ప్రాణము కొరకై పరుగులు తీయుట.

అసురుని చంపి పురము జొచ్చెడి
అన్నకు ఎదురుపోయి భక్తితో
నమస్కరించగ నను చూడకనే
మొఖము త్రిప్పెను కలవరపడితిని

॥శ్రీ రఘురాముని॥

10. సుగ్రీవుడు తనను వాలి తరిమివేయుటను చెప్పుట.

''అన్న పాదముల వ్రాలిపోతిని
విన్నవించితిని సర్వము తీరుగ
నెత్తుటి వరదలు గాంచితినయ్యా!
సంవత్సరమట వేచియుంటిని.

నీ కంఠధ్వని వినబడదయ్యా!
మదిలో శంక ముదిరిపోయెను
అసురుని భయమున బిల ద్వారమున
అడ్డముగా నే కొండ నుంచితిని.

దీనముగా నే పురము జొచ్చితి
వలదన వినక సచివులందరు
పట్టము కట్టిరి దయచూపుమయా!
శత్రుడగానని కరములు ముడిచితి.

వాలి వినకనే దురుసుగ పలికెను
పేరోలగమున నిలపి కథనము
వినిపించెను, తను అసురుని కొరకై
బిలమున వెదకుట సాగించితిననె.

సంవత్సరమటు వెదకగ దనుజుడు
కనబడినంతనె కలబడి జంపి
బిలము వెడలగ సాధ్యము గాక
సుగ్రీవునికై అరచితి నపుడు.

అలికిడిలేదు దుఃఖించితిని
మనసంతయును వికలమయినది
అతి కష్టముతో కొండను నెట్టి
బిల ద్వారమును దాటివచ్చితి.

॥శ్రీరఘురాముని॥

చూడుడు వీడు రాజ్యలక్ష్మికై
అగ్రజు నన్ను ద్రోహచింతనతో
మృత్యుముఖమున త్రోయజూచెనని
ఎన్నో విధముల పరుషములాడెను.

తమ్ముడ నేనటు చేయుదునాయని
తలంపులేక కట్టుబట్టలతో
తరిమెను, భార్యను అపహరించెను
తిరిగి తిరిగి నే చేరితి నీ గిరి.

తెలిసి నేను అపరాధినిగాను
తెలియక చేసిన కాదపరాధము
దీనుని నన్ను రక్షింపుమయా !
ధర్మాత్ముడవు యశము గడించుము.''

రాఘవుడనెను అనునయించుచు
''దుఃఖించకుమో ! మిత్రసత్తమా !
వాడి బాణముల కూల్తును వాలిని
కంటబడుటయె ఆలస్యము-సుమ !

పరస్త్రీ భోగము అందును వాలి
నా కంటికి మరి కనబడువరకే
సతికి దూరమగు దుఃఖము తెలియును
అర్కసుతా ! నీవంత నెరుగుదును''.

॥ శ్రీరఘురామునీ॥

11. వాలి బలము-మతంగముని శాపము

రాముని పల్కుల ధైర్యము నిండి
రవిసుతుడనెను "పురుషోత్తమ నువు
కోపము నిండి శరములు వదలిన
లయ కాలములో రవి కిరణములగు

అయినను వినుము వాలి విక్రమము
కొండలనాతడు అవలీలగను
బంతులాడినటు ఎగురవేయుచు
హేలగ జిమ్మగ చాలును రామా!

ప్రాతఃసంధ్యకు పూర్వమెలేచి
నాల్గు సంద్రముల తీరుగ తిరిగి
సంధ్య కృత్యముల్ల ఆచరించుకొని
అలుపు నెరుగక అడుగిడుపురమున.

భుజబల తేజుడు భూరుహమ్ములను
విరచును, చిత్రము ఆతని బలము
దుందుభి అను మహిషాకృతిగలిగిన
అసురుడు వరబల గర్వమునిండి

సాగరమునుగని పోరగరమ్మన
వారిధి అంతట "హిమగిరీంద్రుడు
నీతో పోరగ చాలినవాడన"
రయమునబోయి గిరిని తాకగ

గిరిరాజంతట పలికె దుందుభితో
మునుల కాశ్రయము నిచ్చెడి నెలవును
ఏలకుమ్మట ఘోరగపొమ్మ
కిష్కింధలో నీ కీడగువాడు

॥శ్రీరఘురామ.॥

వాలి-వానరుడు రాజైయుండెను
సరిచేయును నీ కండూతిని'' అన
భూమి వణకునటు భయంకరముగా
దుందుభి సాగెను కిష్కింధాపురి.

పురమునుచేరి తరువులు కూల్చుచు
శృంగమ్ములతో తలుపులు జీల్చుచు
విజయకాంక్షతో అసురుడు రాగా
వినబడె వాలికి ఆ ధ్వనులన్నియు.

అంతట వాలి అంతఃపురమును
వదలి వచ్చెను స్త్రీలందరితో
తారలనడుమ చందమామలా
వెలిగెడి వాలి పలికె దుందుభితో.

''ఓ దనుజోత్తమ దుందుభివని నిను
తెలిసితి, ఏల ఈ విధ్వంసము?
ఊపిరి నిలువగ ఆశ కలిగిన
శీఘ్రమె పొమ్మన'' దుందుభి పలికెను

''స్త్రీలముందరా ప్రగల్భమ్ములు!
పరాక్రమముతో పోరగ రమ్ము
ఉదయము వరకు వేచియుందును
భోగములంది దిగుము పోరుకు.

లోనికి పొమ్ము భార్యలజేరుము
దివి సుఖమందగ దానము లిమ్ము.
పురము నంతను తిరిగి చూచుకొని
తగినవాని యువరాజుగ జేయుము.

॥శ్రీరఘురామ॥

మత్తు నిండియో అప్రమత్తుడో
నిద్రించుచునో నిరాయుధుడునో
నీవలె కామము నిండినవాడినొ
చంపిన భ్రూణహత్య దోషమగు''

వినిన వాలి తన సుందరాంగులను
లోనికి బొమ్మని పలికె దుందుభితో
''అసురోత్తమ నువు భీరువుగానిచో
తలపకు నన్ను మత్తుని గాను

నేద్రావినది వీరపానము
నేద్రావెద నీ ప్రాణమ్ముల''నని
తండ్రి యొసగిన కాంచనహారము
ధరించివాలి తాకె ధుందుభిని.

లీలగ వాలి దుందుభి నెత్తి
శృంగముల్లందుకు గిరగిర త్రిప్పి
నేలను మోదగ నెత్తురు పారెను
తిరిగి దుందుభి నిలచి పోరెను.

భీకరమ్ముగ పోరు సాగెను
వాలి బలమది ఇనుమడించెను
దుందుభి బలము సన్నగిల్లగా
ముష్టిఘాతముల అసువులు బాసెను.

పీచమడంచి దుందుభికాయము
కరముల నెత్తి యోజనదూరము
లీలగవాలి విసరగనంతట
కాయమునుండి వెడలిన నెత్తురు

॥శ్రీరఘురాముని॥

గాలికి మతంగ ఆశ్రమ మందు
చిందిపడగ - ఆ ముని కోపముతో
వెలుపలకొచ్చి ఆశ్రమసీమలో
దుందుభి కాయము గాంచినయంత

తపోబలముచే సర్వము తెలిసి
బలోన్మత్తుడగు వాలి పనియని
ఆశ్రమ మందలి తరువుల గూల్చి
నెత్తురు మాంసము విరజిమ్ముచును

అతి హేయమగు పనిని చేసిన
వాడుజచ్చు నీ వనముజొచ్చిన
నా ఆశ్రమమొక యోజనమున్నది
అందడుగిడిన వాలి కూలును.

రేపటి సూర్యోదయము లోపలే
వాలి పక్షపు కోతులన్నియు
నా ఆశ్రమము వదలిపోనిచో
వేల ఏండ్లిట శిలలగుదురను,

శాపము వినిన వాలి, మతంగుని
శాంతపరచగా పోయెను అపుడు
మునికోపముతో లోనికి పోవగ
భయముతో వాలి మరలివచ్చెను.

ఆ శాపమె నా పాలిటి వరముగ
తిరుగుచుంటిని అసువులతోనిట
చూడుము అసురుని అస్థిపంజరము
పర్వతమంత ఉన్నది అదిగో !

॥శ్రీరఘురాముని॥

రామా అవిగో మద్ది చెట్లవి
సప్త సంఖ్యలో చిక్కగ నున్నవి
వాలి పిడికిట వాటిని పొడిచి
ఆకులన్నియు రాలగ చేయును.

బలోన్మత్తుడు ఆయుధ మందక
కేవలమాతని చేతులతోనే
అంతటిపనిని చేయగవాలిన
వాలిని నీవు చంపెదవెటులన

రామానుజుడు అడిగె నంతట
రవిసుతు మనసు తెలిసినవాడై
రాముడు వాలిని చంపగలుగునని
నమ్మకటనీవెటు ఓ కపిరాజా!

ఓ గుణవంతా! వాలిబలముతో
ఛిద్రములొనరుచ్చ సప్తసాలముల
ఒక్కదానిని రాముడు త్రుంచిన
నమ్మెదు వాలిని చంపగలుగునని

లక్ష్మణమూర్తీ! పర్వతమంతటి
దుందుభి ఎముకల గూడును రాముడు
రెండువందల ధనుసులదూరము
చిమ్మిన, నమ్మెదు రాముని శక్తిని

"పరీక్షపెడితిని రామునిబలముకు"
అనిన శంకయు భయములతోను
తిరిగిపలికెను రవిసుతుడంతట
వాలిబలములో సురలనుమించును

॥శ్రీరఘురాముని॥

విక్రమమందు అజేయుడాతడు
తిరుగులేని అతి పౌరుషవంతుడు
తీవ్రకోపము-వేగము-బలము
తెలిసి నేనిట దాగియుంటిని

దశరథనందన మిత్రుడవీవు
దయగల ధీరసత్తముడవయా!
దొరకెను హిమగిరి ఆశ్రయమంతటి
ఆశ్రయమ్ము-నా బ్రతుకు ఫలించెను

నీ ఆకారము, బుద్ధి బలములు
మాటలతీరు పూర్తిధైర్యమిదు
నివురుగప్పిన నిప్పువు నీవు
"అయినా ఆజిలో నిన్నెరుగనుకద"

వాలిభయముతో నిటుమాటాడితి
అనుచుపలికిన సుగ్రీవునిగని
రాముడు పలికెను నీ సంశయము
తీర్చెదచూడుము కపికులోత్తమా!

అనుచు పలుకుచు రామచంద్రుడు
దుందుభికాయము ననాయాసముగ
బొటనవ్రేలిచే పదియోజనములు
చిమ్మెను విస్మయమందగ నందరు.

అంతట పలికెను సుగ్రీవుడట
రామా యిపుడీ కళేబరమ్ము
ఎండినమ్రోడై ఎముకలగూడయె
శ్రమనెపుగని నువు చిమ్మితివిటుల.

॥శ్రీరఘురాముని॥

యుద్ధముచేసి అలసినవాలి
మాంసము నెత్తురు నిండిన కాయము
ఎత్తివిసరెను అవలీలగను
కావున నిన్ను దయతో వేడెద.

ఈ పరీక్షలో నా నమ్మకము
కుదురుకొనుటది అతికష్టమయా!
కావున నీవు సప్తసాలముల
ఒక్కదానిని కూల్చుము నమ్మెద.

వాలిని మించిన బలవంతుడవు
అయినా నేను స్వయముగ తెలియగ
కోరితి అసువుల తీపిని వదలక
నిన్ననమ్మిమరి-పోరుకు పోవలె.

కరితొండముతో సరిపడు చాపము-
శరసంధానము చేసి వదలిన
శరము తప్పక కూల్చును తరువును
సందేహము నాకెంతయు లేదు.

తేజమునందు సూర్యునిమాదిరి
గిరులయందున హిమవంతునిగ
చతుష్పాదముల సింహము వగిది
నరులందున నువు శ్రేష్ఠుడవయ్యా!

॥శ్రీరఘురాముని॥

12. సుగ్రీవునికి రాముని శక్తి తెలియుట- వాలితో సుగ్రీవుని యుద్ధము

అంతయు వినిన రామచంద్రుడు
నమ్మకమొదవగ సుగ్రీవునకు
ఘనకోదండమునందుకు నిలచి
బంగరుమొనగల శరమును తొడిగి

విడిచెనుగురితో సాలమ్ములపై
దిక్కులు ధ్వనిచే పిక్కటిల్లగా
రయమున శరము మద్దితరువులను
చీల్చుకుపోయి గిరినే చీల్చి.

అంతట ఆగక అవనినిజొచ్చి
పైకివచ్చి మరి విజయగర్వముతో
వీరపుంగవుని అమ్ములపొదిలో
పదిలమ్ముగను నిలచుటగాంచి.

ఆశ్చర్యముతో గగుర్పాటుతో
రవిసుతుడంతట శిరసునువంచి
రామచంద్రుని పాదమ్ములపై
ప్రణామముంచి పలికెతీరుగ.

దశరథనందన ఇంద్రుడు కూడిన
దేవగణములను - అసురులందరిని
ఏకకాలమున గెలువజాలుదువు
ఏలనేను మరి వాలిని చెప్పుట.

మద్దిచెట్లను కూల్చెను శరము
గిరినే చీల్చిన దివ్యశరమది
పాతాళములో జొరబడిరాగల
శరనైపుణ్యము నీకే తగును.

॥శ్రీరఘురాముని॥

ఓ నరపుంగవ ! నాకొరకై నువు
వాలిని చంపుము వేదన తీర్చుము
కరములు ముడిచి ప్రార్థించితిని
మహాత్ముడవు నువు మైత్రికి నెలవు''

వేడుకొనెడి ఆ సుగ్రీవునిగని
ప్రేమమీరగా కౌగలించుకొని
''పోదము రమ్ము-పోరుకు రమ్మని
వాలిని పిలువుము జాలము చేయకు''

అని పలుకుచును రామలక్ష్మణులు
కపులందరును వెంటనడువగా
సాగి, తరువుల చాటున నిలిచిరి
ముందుకు సాగిన సుగ్రీవుడట

సింహనాదముతో దిక్కులవియగా
వాలిని పోరుకు రమ్మని పిలువ
పశ్చిమాద్రిపై నిలచిన రవియై
కోపమునిండి వాలి నిలచెను

భీకరమయిన పోరుసాగినది
పిడుగుల సవ్వడి పిడికిటిపోట్లతో
చరుపులు-అరుపులు సాగిన యుద్ధము
బుధుడంగారక పోరుగ తోచెను

పోరు పెరుగగా రామచంద్రుడు
వింటిని ఎక్కుపెట్టి చూడగా
సోదరులిరువురు అశ్వినిసురలన
ఒకేరూపము బలములునిండి

॥శ్రీరఘురాముని॥

గుర్తించుటకు వీలు తెలియని
సందేహములో రాముడు పడగ
ప్రాణములీయు శరమును విడువగ
మనసురాకమరి ఊరకుండెను

వాలిదెబ్బలకు ఓర్వజాలక
నెత్తుటదడిసిన ఆ సుగ్రీవుడు
రామునిజాడ తెలియకపోగా
పరుగిడె తిరిగి ఋష్యమూకము

తరిమినవాలి ఛీ! యని పలికి
బ్రతికిపోతివని హేళనచేసి
తిరిగిపోయెను రామచంద్రుడు
హనుమంతునితో చేరె సుగ్రీవుని

ముందర నిలచిన రామునిగాంచి
సిగ్గుతొ తలను వంచి రవిసుతుడు
పలికెను "రామా! ఇటు చేయుటకు
ఏమపకారము నే చేసితిని?

నమ్మకమొదవగ శక్తినిచూపి
పోరుకుపొమ్మని నను నమ్మించి
శత్రువువాత బడజేయుటచే
నీకు కలిగెడి లాభము ఏమి?

వాలిని చంపను నేనని చెప్పిన
నేనీగిరిపై బ్రతుకుచుందును
పోరకుపొమ్మని ప్రోత్సహించినది
చావుదెబ్బల పాల్జేయుటకా?"

॥శ్రీరఘురాముని॥

అనుచు పలుకుచు రోదించెడి, ఆ
సుగ్రీవునిగని రామభద్రుడు
''నాయన ! నీవు కోపించకుమా
శరమువదలని వివరము వినుము

రూపమునందు వయస్సునందున
చూపునందు మరి వేషమునందు
మాటలయందు కంఠస్వరమున
ధైర్యమునందు ఇరువురు సములే

మీలో వాలిని తెలియగనైతిని
శరమువదలినచో వ్యర్థముగాదు
నీకాశరమే తగిలినచో మరి
సర్వమునాశము అయినటులేకద !

ముందువెనుకలు ఆలోచించక
విడచినశరము నిన్నే కూల్చిన
కార్యముకాక పోవుటకాగా
శాశ్వతమైన అపకీర్తికదా !

అభయమునిచ్చి తానేకూల్చుట
ఎంతటిపాపమొ ఆలోచించుము
దానికి ప్రాయశ్చిత్తము లేదు
లేసగతెలియుము సూర్యనందనా!

నా వచనమ్ములు నమ్ముము నీవు
తిరిగి వాలితో పోరగపొమ్ము
నాకు తెలిసెడి గుర్తు ధరింపుము
వాలికూలు నా వాడి బాణమున

॥ శ్రీ ర ... రాముని ॥

అనుచు పలుకుచు రామచంద్రుడు
గజపుష్పమ్ముల తీగనొకటిగని
లక్ష్మణమూర్తిని ఆదేశించెను
లతను హారముగ కపికి వేయగా

సౌమిత్రపుడు లతాహారమును
రవిసుతుమెడలో వేయగనతడు
తారాకాంతుల వెలిగెడి రవియై
తిరిగిపోరగా బయలుదేరెను

॥శ్రీరఘురాముని॥

13. వాలితో పోరుకు సుగ్రీవుడు రెండవమారు వెడలుట

రామచంద్రుడు రవికిరణములగు
శరములు, ఘనమగు వింటితో నడుమ
లక్ష్మణమూర్తి సుగ్రీవులు ముందై
నలుడు-నీలుడు-తారుడు-హనుమలు

అనుసరించగా సుందరమయిన
పూపొదలనుమరి పక్షిగుంపులను
పూలబరువుచే వంగిన తరువుల
తటాకాలను గిరిప్రదేశములు

వైడూర్యములన మెరసెడి ఆకులు
సిగ్గునిండిన మొగ్గలుండినది
విరసినకమలము లుండినకొలను
శుభముగ కన్నుల కగపడెనచట

కారండవములు హంసబెగ్గురులు
నీటికోళ్లుమరి చక్రవాకములు
మధురస్వనములు నింపెను మడుగుల
పచ్చికమేసెడి జింకలగాంచిరి

నడచుకొండలు కారుమబ్బులన
తిరిగెడుగజములు తటాకాలను
కలవరపెట్టుచు నీటిని చిమ్ముచు
గట్లను త్రోయుచు కనబడెనచట

రామచంద్రుడట ఒకప్రదేశమున
చిక్కగనున్న తరువులగాంచి
ఒప్పుమీరగ పెరిగినవనము
వివరముచెప్పగ కోరె రవిసుతుని

సొగుచుపలికెను సుగ్రీవుడట
"సప్తజనులను" ఋషులేడుగురు
శిరసులు భువిపైనుంచి తపసుతో
ఏడు దినములకు ఒక్కతడవనే

వాయుభక్షణ చేయు తాపసులు
నీటియందునే నిద్రించుచును
ఏడువందల సంవత్సరములు
తపసుచేసి రవితేజులు అయిరి

తపసు ఫలించగ తనువుతోడనే
నాకముచేరిరి ఆ మహాత్ములు
వారి మహిమచే చెట్లుచుట్టిన
వనము చొరగను శక్యముకాదు

దేవాసురులకు భయము దీనిగన
పక్షులు జంతువు లిందడుగిడవు
అడుగిడెనామరి దారితోచక
వనమున తిరుగుచు-వెలువడలేవు

॥శ్రీరఘురాముని॥

ఆభరణమ్ముల సుందరనాదము
ఆనందమగు మంగళవాద్యము
మృదుభాషణలు సురసంబంధపు
పరిమళవాయువు వీచును ఇచట

రామా! చూడుము త్రేతాగ్నులవి
వెలుగుచున్నవి గాలికి ఆ పొగ
తరుశాఖలలో యెఱ్ఱనికాంతితో
కపోతకంఠము రంగును పోలెను

తరువులపైన ఆ పొగనిండగ
కాననమందలి వృక్షములన్నీ
మేఘకాంతిచే ఆకులవన్నెచె
వైడూర్యముల కొండగతోచును

రామా! నీవు అనుజునితోను
ఇచ్చటనుండే మ్రొక్కుము మునులకు
మునులకు మ్రొక్కిన వ్యాధులంటవు''
అనగా మ్రొక్కిరి దాశరథులట

మునులకుమ్రొక్కి తేజమునిండి
రిపుసంహారణకు ఆయుతుడై అట
భద్రమూర్తి శ్రీరామచంద్రుడు
వాలియేలు కిష్కింధనుగాంచెను.

॥ శ్రీరఘురాముని ॥

14. సుగ్రీవుడు సింహనాదముతో వాలిని పోరుకు రమ్మనుట

రోషమునిండి సుగ్రీవుడట
మేఘగర్జనము చేసెను అపుడు
తేజోవంతుడు అయినరామునితో
నగరము జూపుచు పలికెను అంత

''కావలి కపులను వలచేజుట్టి
యంత్రరక్షణ నున్ననగరమది
నీ మాటలవి ఫలించు తరుణము
వచ్చెను రాఘవ కను కిష్కింధను''

రాముడు పలికెను అనునయముగను
''అర్కసుతా ! నువు పుష్పమాలతో
చుక్కలు చుట్టిన సూర్యుని మాదిరి
వెలుగుచుంటివది అశుభము వాలికి

వాడిబాణమున భ్రాతృకంటకుని-
కూల్తును వానిని కనబడనిమ్ము
కనబడి వాలి బ్రతికిన అపుడు
నను నిందించిన సరియగునయ్యా!

భయమును వదలుము సూర్యనందనా !
నా ప్రతిజ్ఞ నెరవేర్చెద వినుము
వాలిని యుద్ధోన్మత్తుని చేసెడు
సింహనాదమును చేయుము ఇపుడే

శూరుడు-శత్రువు ఘనతకు లొంగడు
అబలల ముందవమానము కలుగును
ఓటమి శంక మదిలో కలిగిన
దురాగ్రహముతో ముందుకురుకును''

॥శ్రీరఘురాముని॥

దశరథనందను ధైర్యవాక్కులతో
రవిసుతుడంతట ఉబుమై ఉఱిమి
దిక్కులవియగా నాదము చేసెను
సంద్రపుఘోషగ ధ్వని వినిపించెను
మేతకుపోయి వచ్చెడిగోవులు
భీతిలి పరుగిడుచందముగాను-
అరాచకములో కులస్త్రీలందరు
దుష్టులకందక చెదరిపోయినటు
యుద్ధభూమిలో దెబ్బలు తిని మరి-
పరుగిడు అశ్వము లన్నితీరుగ
పరుగిడె మృగములు, పక్షులన్నియు
నింగిని వదలి నేలకురాలెను
పక్షులు నేలకు రాలిన చందము
పుణ్యము తరిగి పుడమిని రాలిన
గ్రహముల తీరుగ నుండగనపుడు
ఎగసిన ధ్వని అట వాలిని పిలచెను.

॥శ్రీరఘురాముని॥

15. వాలిని యుద్ధవిముఖునిగా చేయుటకై తార ప్రయత్నించుట

సుగ్రీవుని కంఠము వినబడినంతనె
అంతఃపురమున వాలి లేచెను
మత్తుజారెను కోపము హెచ్చెను
సంధ్యాసూర్యుని చందము ఆయెను
గ్రహణమునాటి సూర్యుడాయెను
క్రూరమైన తన కోఱలు మెరయగ
మంటగ మండుచు, కలుపలులేని
మడుగురీతిగ కాంతులు తరిగెను

పండ్లు పటపట కొరుకుచు నతడు
ధరణి పగులునటు త్రొక్కుచునపుడు
యుద్ధము చేయగ బయలుదేరగా
తార ప్రియముగ కౌగలించుకొని

శుభకరవాక్కులు పలుకగనేర్పరి
భయముతో భర్తకు మేలుకలుగగా
పలికెను, "కోపము ఏటినీటివలె
వచ్చినదానిని వదలుట మేలు

రాత్రి ముడిచిన మురిపెపు సుమములు
తెల్లవారగనె తీసివేయునటు
వదలుము కోపము, ఉదయముకాగా
పోరినరాదు నీ కవకీర్తి

ఇపుడే పోరుకు పోయిన నీకు
అపకారమది ఏమని అనిన
ఇంతకుముందే నీచే ఓడిన
వైరి ఇంతలో వచ్చిన బలముతో ?

పరుగిడె ప్రాణము నిలుపుకొనుటకై
పోరగవచ్చి పిలచె ధైర్యముతో
సాహసమెటుల వచ్చెనో తెలియుము
నామదికెంతో సందేహమది.

మునుపటిమాదిరి సింహనాదము
కానేకాదు కారణమేమో ?
బలము ధైర్యము-గట్టి ప్రయత్నము
కనబడుచున్నది కారణముండును

॥శ్రీరఘురామునీ॥

అతిబలమయిన సాయముతోడై
ఆజికిపొమ్మని ధైర్యమునిడనిచో
అంతటి గొప్ప సింహనాదమును
అర్కసుతుడుమరి చేయడు నాథా!

నేర్పరితనము తెలివితేటలు
పుట్టుకతోనే నేర్చె రవిసుతుడు
బలము గ్రహించక సాయమునందడు
అల్పులచేర్చుకు పోరగ రాడు

నా ప్రాణేశ్వర నే నిటు పలుకుట
వట్టి ఊహయని మదిలో తలచకు
అంగదుడింతకు ముందే తెలిపెను
వేగులవలన వినిన వార్తను

అయోధ్యాపతి తనయులిద్దరు
రఘువంశమున పుట్టినవీరులు
రామలక్ష్మణుల పేరున బరగెడు
అజేయులయిన సోదరులిరువురు

ఋష్యమూకమున సుగ్రీవునితో
చెలిమిచేసిరి-వారిలో రాముడు
వినుతకీర్తియై వెలయు త్రిధాముడు
ఉచితానుచితము లెరుగును బాగుగ

సాధుజనులకు నీడనిచ్చును
ఆర్తజనులకు మహాగతియగు
బాధితులందర కభయప్రదాత
విస్తారకీర్తికి నెలవగు రాముడు.

॥శ్రీరఘురామునీ॥

జ్ఞానవిజ్ఞానపు సంపన్నతతో
సకలధాతువుల నెలవు హిమగిరిగ
సకలశుభముల కల్యాణగుణముల
స్థానము రాముడు దశరథ తనయుడు

సత్యవాదిగ తండ్రిని చేయగ
కదలె కానలకు ఆ రఘురాముడు
అమితవిక్రముడు అజేయుడతడు
మహాత్ముతో మరి విరోధమేల ?

నీ దోసములను ఎంచుటకాదు
చులకనగా నిను చేయుటలేదు
నే నుడివినటు వానరేశ్వరా
చేయుట శ్రేయము కోపించకయా!

వీరులందు నువు అగ్రగణ్యుడవు
కానీ, నీ సరి వీరుడుండును
రామునితో నువు కలహించకుము
తమ్ముని చేయుము యువరాజుగను

నా ఆలోచన చెప్పితి నేను
నీకు తోచినటు చేయుము నీవు
బలమున నీకు ఈడగువాడు -
నీ తమ్మునితో వైరము వీడుము

రామచంద్రునితో సఖ్యము చేయుము
సుగ్రీవునిపై వలదు మత్సరము
అటుల చేసిన రాముడు నిన్ను
ద్వేషించకను దరి చేర్చుకొను

॥శ్రీరఘురాముని॥

నాథా! నీకు సోదరుడొకడే
అన్నా! అని ఆప్యాయముగాను
పిలచెడివాడు విధేయు డతడు
ఉత్తమగుణములు కలిగినవాడు

కపివీరులలో సుగ్రీవునితో
సరిపడు బలము ఎవ్వరికున్నది ?
దుష్టుడుగాడు ధిక్కరించడు
సద్గుణయుతుడు గురిగలవాడు

తండ్రివైపు నీ బంధువు అతడు
మిగిలిన బంధువు లందరు కూడ
తరుణులవంక వచ్చినవారే
కావున అసలగు బంధువు అతడే

అనుజుడు కాడా ఆ సుగ్రీవుడు
ఏకగర్భ సంజాతులు కారా ?
శత్రువుకాదు బంధువు నీకు
కావున నీ దరి చేర్చు ప్రియముగ

నీ, మేలు కోరెడి దానను నేనని
నిండుగ నీవు నమ్మిన ఎడల
నాపై ప్రేమ నిండిన భర్తవు-
ప్రియమగు కార్యము చేయగ నెంచిన

నీ తమ్మునితో స్నేహము చేయుము
సుగ్రీవునిపై క్రోధము వీడుము
తప్పుయోచనను కాదిది నాథా!
నీకు మరియొక మార్గములేదు.

॥శ్రీ రఘురామ॥

ప్రాణేశ్వర ! నా మాటలు వినుము
కరములు మోడ్చి ప్రార్థించితిని
కోపము వలన మేలు కలుగదు
కీర్తికరము మరి కానేకాదు
అమితవిక్రముడు ఇంద్రతేజుడు
రామచంద్రునితో వైరము వలదు
వలదువల''దని తార పలికినను
వాలి వినకనే తిరిగి పలికెను.
॥శ్రీరఘురాముని॥

16. వాలి సుగ్రీవుల యుద్ధము–రామబాణముచే వాలి కూలుట

బుద్ధిబలములో మిన్నగు తారతో
నక్షత్ర సమమగు నఖములు కలిగి
నీతి విద్యలో నేర్పరి-అయిన
భార్యతో పలికెను కోపమునిండి
''చంద్రముఖీ ! ఇటు పలుకుట తగునా ?
తమ్ముడు వాడు - అయినచో మరి
అతిశయించిన బలగర్వముతో
పోరుకు పిలచున సింహనాదముతో
ఇట్టివానినా నే క్షమియించుట
శూరులకుండున ప్రాణప్రతీప
అపజయమెరుగని వెనుకడుగిడని
శూరుని చావు లిపు అవమానమె
మీదకు వచ్చి సింహనాదము
చేయువాడు మరి శూరుడగునట
బలహీనుడనై ముందుకురాక
పడివుండెడి గతి నాకేమొచ్చెను ?

రామచంద్రుడు చంపును అనుచు
భయపడుచుంటివి కారణమేమి ?
రాముడు నా కపకారము చేయడు
ధర్మమూర్తి మరి చంపున నన్ను ?

నీవు స్త్రీలతో అంతిపురమునకు
పొమ్ము-నేను మరి పోరుకు పోయెద
నాపై ప్రేమ నిండిన నీవు
పలికినదంతయు వింటిని నేను

బలమున చాలడు గొంతే లేదు
అట్టివాడు మరి సింహనాదమును
చేసిన నేను భరించగలనా ?
భుజబల శౌర్యము చూపి వత్తును

ముష్టిఘాతముల కలబడి పోరి
సుగ్రీవుని బలగర్వము నణచెద
చంపను వానిని-నమ్ముము నన్ను
నా ప్రాణముపై శపథము చేసితి

నా జయమును నువు కోరుకొనుచును
మరలిపొమ్ము మరి అంతిపురమునకు''
అనగా తార ప్రదక్షిణించి
మంత్రపూతముగ మంగళమనుచు

హీనస్వరముతో రోదించుచును
మిగిలిన స్త్రీలతో లోనికి పోగా
ఇనుమడించిన కోపముతోను
పోరగపోయెను వాలి అంతట

॥శ్రీరఘురాముని॥

రోషమునిండి నిట్టూర్పులతో
వైరిని చూడగ నలువంకలగని
ఒకచో మండెడి అగ్ని తీరుగ
నేలను తన్ని నిలబడినట్టి

బంగరుఛాయతో వెలుగు సుగ్రీవుని
గాంచిన వాలి దట్టి బిగించి
ముష్టిబిగించి బంగరుమాలతో
ముందుకురాగా రవిసుతు డంతట

ఎదురు రాగను వాలి పలికెను
"వజ్రమువంటిది ముష్టిఘాతము
నీపయిబడును పారిపోకుము"
అన సుగ్రీవుడు తిరిగి పలికెను

"నీ తల నా యీ ముష్టిచె నిపుడే
చితుకగొట్టెద సందియమెందుకు"
అనగా వాలి ఒక్కటి మోదగ
నెత్తురు కారెను రవిసుతునకును

తిరిగి సుగ్రీవుడు తరువును పెరకి
గిరగిర త్రిప్పి వాలిని కొట్టగ
అతి బలశాలి వాలి అంతట
గడగడ వణకుచు విలవిలలాడెను

తమ్ముని దెబ్బకు వాలి అచ్చట
బరువుతో నిండిన పెద్దఓడ అది
పెనుతుపానుకు ఊగినట్లుగ
ఊగిపోయెను కలవరపడెను

॥శ్రీరఘురాముని॥

వాయువేగము గరుడవేగము
కలిగిన వీరులు వాలి సుగ్రీవులు
ఒకరిని ఒకరు జయింపగోరి
వెనుదీయక మరి పోరసాగిరి

ఆకాశములో సూర్యచంద్రులన
వెలుగుచువారు పోరగనంత
వాలి బలమది క్రమముగ హెచ్చెను
రవిసుతుబలము తగ్గె క్రమముగ

వాలి బలముచే విక్రమమంతయు
చెదరి సుగ్రీవుడు రోషమునిండి
యుద్ధముచేయుట కొనసాగించెను
పట్టుదలతొ మరి పోరసాగెను

ముష్టిఘాతముల-పెద్ద తరువులతొ
నఖముల గీరుచు-కాళ్ళతొ తన్నుచు
ఒకరిని మించిరి మరి యొకరన్నటు
పోరసాగిరి సోదరులిరువురు

మీద దుముకుచు చెట్లచె కొట్టుచు
నేలనీడ్చి మరి పిడికిట గ్రుద్దుచు
ముఖాముఖిగను కలయబడుచును
వాసవ-వృత్ర సమరము చేసిరి

వాలిబలము మరి హెచ్చిపోయెను
రవిసుతుబలము క్షీణించగను
దెబ్బలు తినిన సుగ్రీవుడట
నలువంకలకు గలయజూచెను.

॥శ్రీరఘురాముని॥

మిక్కిలి బాధలో నున్న మిత్రుడు
అభయమునందిన అంతరంగికుడు
కన్నుల ముందర రిపునికి లొంగి
ప్రాణాంతకమగు బాధను పడగ

కన్నుల గాంచెను రామభద్రుడు
భయంకరమగు తేజముతోను
వాలిని చంపగ చాలిన బాణము
ప్రియదర్శనుడు విసురుగ తీసి

అల్లె త్రాటికి బిగించి నిలచెను
అల్లదెలేచెను టంకారధ్వని
నింగిని పక్షులు నేలను మృగములు
నిలువలేక మరి నేలను బడెను.

వజ్రాయుధమన వేగము గలిగి
పిడుగుపడినటు వచ్చిన బాణము
రాఘవుచేత వదలబడినది
వాలి రొమ్మున సూటిగ నాటెను.

రామబాణమది రొమ్మున నాటగ
ఆశ్వయుజమున పున్నమినాడు
కూలినయట్టి ఇంద్రధ్వజమై
వాలి అంతట ధరణిని బడెను.

॥శ్రీరఘురాముని॥

17. వాలి శ్రీరాముని నిందించుట

మొదలు నరకిన మానై పడెను
నేలను కూలెను వాలి అంతట
చంద్రుడులేని ఆకాశమువలె
ధరణి తేజము సన్నగిల్లెను.

వీరుడు వాలి నేలబడినను
పరాక్రమమ్ము. తేజము విడువక
ప్రాణమ్ములను నిలపగ చాలెను
ఇంద్రదత్తమగు హారమహిమచే

వాసవు డొసగిన బంగరుదండ
మేలగు కాంచన హారము మెరయగ
సంధ్యాసమయము ఎఱ్ఱని కాంతితో
వెలిగెడు మేఘము అన్నటుతోచెను.

కాంచనహారము మెరయుచుండగ
ఘనమగు శరము రొమ్మున నుండగ
నిర్మలమయిన దేహముతోను
మూడు వన్నెల వెలిగెను వాలి

రిపులకూల్చగ చాలిన వాలికి
నాకలోకము పంపగ చాలిన
రాఘవువింటిచె వెడలిన శరము
ఉత్తమ గతిని కలిగించినది.

జ్వాలలు తగ్గిన అనలము వోలె
ప్రళయములో మరి జారిన రవియై
పుణ్యము తరిగి పుడమిని బడిన
యయాతి తీరుగ నుండిన వాలిని

॥శ్రీరఘురాముని॥

సురపతి వలె ధిక్కారము నెరుగని
మృగరాజంతటి ఠొమ్ము గలిగిన
దీర్ఘ బాహువుల వెలిగెడు వాలిని
తేజము నిండిన వదనము గలిగి

తననే కొట్టిన అతి బలశాలిని
మెచ్చుకొనుచు తా-చూడగ నెంచి
నలుదిక్కులకు చూచెడి అగ్నిని
రాముడు చేరెను అనుజునితోను

లక్ష్మణమూర్తితో చెంతకు చేరిన
అతి పరాక్రముడు రామచంద్రుని
చూచిన వాలి ధర్మము వినయము
నిండిన కఠినోక్తులతో పలికెను.

''రామా ! నీవు రాకుమారుడవు
శాస్త్రజ్ఞానము కలిగినవాడవు
గొప్ప కులమున బుట్టినవాడవు
కీర్తి-తేజము కలిగినవాడవు

అంతటివాడవు ఆహవభూమిలొ
నీపై దృష్టి నిలపని వాడిని
వీరునిగానే పోరుచుండగ
ఠొమ్మున గొట్టుట ఘనమగు పనియా ?
రామచంద్ర-నిను హితునిగతలచుచు
దయాలక్ష్మికి నెలవుగ నెంచుచు
ఉచితానుచిత జ్ఞానమూర్తిగ
లోకులు పొగడుచు నుండిరి కాదా !

॥శ్రీరఘురాముని॥

పోరగబోకుము సుగ్రీవునితో
అతనికి రాముడు తోడని తార
చెప్పిన వినక వచ్చితి పోరుకు
రాజగుణములు కలవని తలచితి.

శమ దమాదులు - ఓర్పు - ధర్మము
ధైర్యము - సత్యము - పరాక్రమమ్ము
అపరాధులనే దండించుటవి
రాజులకుండెడి సద్గుణంబులు

అట్టి గుణములే నీలో కలవని
గట్టిగనమ్మి వచ్చితి పోరుకు
మట్టుపెట్టితివి ఎట్టి వీరుడవు
ఇట్టి అకార్యము చేయుట తగునా ?

గొప్ప గుణములతో శోభిలువాడవు
హేయ కార్యమును ఏలచేతువని
ఇతరులతో నే పోరుచుండగ
నన్నే విధముగ హతమార్తువని

నిన్ను మున్ను మరి చూడకుండుటచే
మోసపోతిని నేల కొరిగితి
ఏ విధి నాపై వచ్చును అనుకొని
వచ్చితినేను-నిజము నెరుగక

పచ్చిక కప్పిన బావివినీవు
బూడిద కప్పిన చిచ్చువునీవు
పాపపు నడవడి-రాజవేషము
మాయలమారివి తెలియగనైతిని.

॥శ్రీరఘురాముని॥

నీ ముఖమును నే నెరుగను కాదా
నీ నగరము నే నెరుగను అసలే
నీ కపకారము చేసి ఎరుగను
నాపై నీకు కలహము ఏల ?

ఈ వనసీమల కాయల కొరకు
శాఖామృగమును-విరోధిగాను
అట్టి నన్ను నువు ఈ విధముగను
చంపుట కేమి కారణమయ్యా !

రాచకులమున పుట్టినవాడవు
వేదాధ్యయనము చేసినవాడవు
తేజము గలిగి జ్ఞానము నందియు
ధర్మాత్మునిగా వేషము దాలిచి

లోకమునకు మరి కీడు చేయుటకు
ఏ విధి నీకు మనసు గలిగినది
క్రూర కార్యములు చేసెడి నీవు
పెద్దమనిషిగ ఏల నటించుట?

బుద్ధిమంతులలో శ్రేష్ఠులు చెప్పిరి
సామదానములు-శౌర్యము-సత్యము
క్షమా-ధర్మము-ధృతితో దుష్టుల
దండించుటవి రాచగుణములని

ఫలమూలములు తిను వనచరులము
పురుషుడవీవు మనుజోత్తముడవు
మృగముల మయితిమి రాణీ-రామా !
మనుజుడవై మరి మసలుట ఇటులా?

॥శ్రీరఘురాముని॥

భూమిగాని మరి బంగరుగాని
రజితముగాని కలహకారణము
నే తిను ఫలములు-దుంపలు నీకు
లేకపోవునని చంపితివా నను ?

మంచిమాట మరి అనుగ్రహములు
మంచిరాజుల సొమ్మయి వెలయును
దుర్వినయము మరి కీడొనరించుట
దుష్ట భూపతుల పాలై యుండును.

కానీ రామా ! నీలో రెండును
మేళవించి మరి యున్నవి కాదా !
స్వేచ్ఛగ రాజులు చరింపజాలరు
ధర్మబద్ధులై యుండగవలెను

ఇంద్రియాలకు వశుడవు అయి నువు
కోరికలన్నీ తీర్చుకొనుటకై
మంచి చెడ్డల మిశ్రమమయితివి
విల్లు చేతగొని విర్రవీగెదవు.

ధనమూర్జించగ నియమములేదు
ధర్మమునందభిమానములేదు
కోరికలకునువు మనసందించి
మనసగు రీతిని చరించుచుంటివి

నిరపరాధిని దోషినిగాను
నన్ను చంపితివి నీవీ శరమున
నిలబడి సజ్జనులందరి ముందర
నీవే జవాబు చెప్పెదవయ్యా ?

॥శ్రీరఘురాముని॥

జీవహింసను చేసెడివాడు
చోరుడు-నెపములు చెప్పెడివాడు
గురుభార్యను తను పొందినవాడు
రాజహంతకుడు-నాస్తికుడున్నూ

గోవధచేసెడి దుర్మార్గుడును
అన్నకన్నతను ముందుగ పెండ్లై
చరించుజనులు అందరు కూడ
నరకవాసులై పడివుందురు కద !

సజ్జనులగు నీ వంటి జనులు మరి
నా మాంసమును తినరుకదయ్యా !
నా చర్మము మరి నా ఎముకలవి
నా రోమములు పనికే రావు.

ఐదుగోళ్లు కల జంతువులందు
అశుపము-ఉడుము-తాబేలున్నూ
ఏదుపంది మరి చెవులపిల్లియు
మాంస భక్షణకు నిర్ణయించినవి

మాంస భక్షణకు నేకొరగాను
చంపితివేల తెలుపుము నీవు
ఎముకలు చర్మము ముట్టగరానివి
ముట్టు పెట్టుటకు కారణమేమి?

తార చెప్పిన హితవచనమ్ములు
కాలదన్ని, నే బుద్ధి హీనతతో
వచ్చిన దానికి ఫలితము నేను
అనుభవించుచు నుంటిని కాదా !

॥శ్రీరఘురాముని॥

ధరణీనాథుడవని నువు తలచకు
నీచుడు - ధూర్తుడు భర్తగనున్న
శుభశీలియగు స్త్రీ ఇలనెపుడు
భర్తృహీనయని తలచగవలెను

అపకారమన్నది ప్రధానమైనది
నీచమయిన మనసున్న వాడివి
జితేంద్రియువలె నటించువాడవు
పుట్టితివెటుల దశరథుకడుపున?

అంకుశమ్మును లక్ష్యపెట్టక
వక్రమార్గమున చరించునట్టి
హస్తిమాదిరి అధర్మ వర్తివి
నాదు కర్మ నీ పాలబడుటది

ధర్మము - జ్ఞానము నిండిన వృద్ధులు
ఛీఛీ! అను దుష్కార్యముగాదా!
ఏ ముఖముతో వారందరిముందు
నిర్భయమ్ముగా తిరిగెదవయ్యా!

ఎంతటి మగసిరి కలిగినవాడవు
ఆలి అపహరణ చేసినవానిని
ఏమి చేసితివి? నీ మగతనము
తటస్థుపైన చూపితివయ్యా!

రామా! ఎదిరి పోరిన పస అది
త్రుటిలో యమపురి కంపియుందును
మత్తుడు నిద్రలో పాము వాతబడె-
అటులే చచ్చితి - కనబడకుంటివి.

॥శ్రీ రఘురాముని॥

రామా ! నీ కథ తెలుపకపోతివి
సుగ్రీవునితో చెలిమి చేసి మరి
నను చంపుటకు కారణమేదియొ
తెలిసిన నేను నా శౌర్యముతో

కపటచిత్తుని ఆ దశకంఠుని
ఆజిని కొట్టి నిలబెట్టెదను
ఒక్క పూటలో నీ సతి సీతను
నిలపజాలుదు నీ సమక్షమున

''శ్వేతాశ్వతరి'' ఉపనిషత్తును
మధుకైటభులు అపహరించిరి
హయగ్రీవుడై శ్రీహరి-కడలిలొ
దాగిన వారిని సంహరించి-తను

వేదశృతిని తెచ్చెను వింటివ
అటులే నేను సీతాదేవిని
తేగల చాలుదు తెలియకపోతివి
తగని వానితో నెయ్యమేలయా?

నే మరణించిన లాభము కలుగును
కిష్కింధేలగ సమయము వచ్చెను
కావున తమ్ముడు-నను చంపుటది
సమంజసముగా తోచును కాదా !

కానీ నీకు ఏమి లాభము
రాజ్యమురాదు రమణిరాదు
వక్ర మార్గము అధర్మమైనది-
న్యాయమైనదని చెప్పగరానిది.

॥శ్రీరఘురాముని॥

పుట్టినవాడు గిట్టుట తప్పదు
ధరణిని బ్రతుకు శాశ్వత మెవరికి ?
చావుకొరకు నే వ్యథ నొందనయా
శౌర్యము చూపక చచ్చితినేను.

శూరుల మార్గము తప్పించితివి
శూరమర్యాదను దాటించితివి
సమాధానము ఏమి చెప్పెదవు
వెదకుము యుక్తికి తగినదానిని''

అనుచు పలుకుచు శరవేదనతో
నోరంతయును ఎండిపోవగా
దేహమంతయు మంటల మండగ
వాలి పలికెను తేజము తొలగి.

॥శ్రీరఘురాముని॥

18. శ్రీరాముని ధర్మ సూక్ష్మ వివరణ

ధర్మార్థముతో కఠినముగాను
వాలి పలికెను అవివేకముగా
కాంతులు లేని రవి వలె నుండెను
జలములులేని మేఘమాయెను.

చల్లారిన అగ్నిని పోలియుండెను
అంతట రాముడు పలికె వాలితో
శరము వదలుట ధర్మయుక్తము
అర్థ కామములు గలవని అనుచు.

''ధర్మార్థకామములు వానరరాజా !
పురుషార్థములు మూటిని నీవు
శాస్త్ర ప్రకారము తెలియకపోయి
లోకాచారము కూడను తెలియక

తారుమారు మరి చేసిన వాడవు
తిరిగి నన్ను నువు చపల బుద్ధితో
దూషించితివి తెలిపెద తీరుగ
అడుగక పోతివి పెద్ద లెవ్వరిని.

గిరులు-తరువులు-తోటలు-తోపులు
నిండిన పుడమి అంతయు వినుము
ఇక్ష్వాకుల నుండి మా వంశమున
పుట్టిన రాజుల పాలన నున్నది.

సార్వభౌములు వారని తెలియుము
సామంతుడవు స్వతంత్రతేది?
సర్వజనులను మృగముల-పక్షుల
రక్షించుటది సార్వభౌముడే.

పురుషార్థములు పూర్తిగ తెలిసి
దుష్ట శిక్షణ శిష్ట రక్షణ
సత్యము-నీతి వినయ శౌర్యములు
కలిగిన భరతుడు రాజై ఏలగ.

రాజ్యము నాకు లేకపోయినను
ధర్మపాలన సాగుచునున్న
భరతుని పాలన ధర్మవంతముగ
సాగుట కొరకై కొందర మిటుల

॥శ్రీరఘురాముని॥

భూమిని తిరుగుచు ధర్మరక్షణ
చేయుచుంటిమని తెలియుము నీవు
ధర్మహాని మరి చేసినవాడు
శిక్షనందుచే భరతుని పాలన.

పూర్వము రాజులు ధర్మరక్షణకు
దేశమునందు నలుమూలలకు
అధికారులను పంపుట తెలియుము
సామంతుని కర్తవ్యము ధర్మము.

అధర్మమేమి చేసితినందువ
చెప్పెద వినుము ఓ బలశాలీ!
ధర్మ మార్గము వదలి కామముతో
చరించుటేటులా? రాజధర్మమా ?

ధర్మ వర్తనము నున్న వారికి-
తండ్రితో సమము-గురువు-అన్నయు
తమ్ముడు-శిష్యుడు-కన్న కుమారుడు
సద్గుణవంతులు అయినచో కొడుకులు.

ఓ వానరుడా! ధర్మమన్నది
దేహేంద్రియముల కందనిదయ్యా!
పండితులయిన వారలకయినా
ధర్మసూక్ష్మములు అందక పోవును

చరాచరములలో ఆత్మగనుండి
హృదయాంతరములో వసించునట్టి
పరమేశ్వరునికి సంపూర్ణముగా
సర్వము తెలియును నీకెటు తెలియును?

॥శ్రీరఘురామా॥

నాకు తెలియక పోవుట ఏలని
నీవు అడిగిన నీతో నుండెడి
సహాయులందరు వానరులే కద
మూఢులు మరియు చపలమతులయా !

పుట్టుగ్రుడ్డితో మరియొకడట్టి
పుట్టు గ్రుడ్డియే చేరినట్టుగా
తెలియనివానితో తెలియనియట్టి
తోడు చేరిన తెలియుట శూన్యము.

నే నుడివెదవిను స్పష్టముగాను
కోపము నిండి నను నిందించకు
నిను జంపుటకు కారణమిదియే
తమ్ముని భార్యను చేపట్టితివి

నీ సోదరుడు బ్రతికి యుండగా
అతని భార్యను పాప మార్గమున
కోడలు అగు ఆ రుమను పొందుట
దుష్కార్యము, మరి అసత్యమూ అది ?

ధర్మము వదలి కామము నిండి
అడ్డగించెడి వాడే లేదని
నీతి తప్పుట-తమ్ముని భార్యను
పొందుట తప్పు. చంపితి నందుకు.

జనహిత మెంచక ధర్మము విడచి
దుష్ట గర్వమున చరించు వానికి
కట్టుబాటులు వదలిన వానికి
దండన మాత్రమె తగినది వినుము.

॥శ్రీరఘురామునిి॥

క్షత్రియకులమున పుట్టిన నేను
భూమినేలు రాపట్టి సోదరుడ
రాచ లక్షణము ధర్మ రక్షణము
నీతినిలపుట కీర్తి గడించుట.

ధర్మదూరమగు పనులను చేయుచు
పాపముచేసెడి కాముకుడవగు
నిన్ను నేను మరి సహించుటెటుల
దండించుట సరి రాచపట్టినై.

కూతురు-సోదరి-మరదలు ముగ్గురు
ఒక్క వరసతో ఆదరించనగు-
వారలతో మరి పొందునందిన
శాస్త్రు ప్రకారము వధ్యుడువాడు.

నిజమగు నెయ్యము నే చేసితిని
సౌమిత్రియు సుగ్రీవుడు నొకటే
నెయ్యము ఫలము రాజ్యము-లక్ష్మియు
ఆలిని పొందుట చాలు మిత్రునికి

అట్టి మిత్రుని అండగ నుంటిని
ఆలి అపహరణ చేసిన వాలిని
కూల్చి, రాజ్యము రమణి నిచ్చెదను
అని నే ప్రతిన చేసితి వినుము.

అందరి ముందు ప్రతిన చేసితి
మిత్రుని హితము కోరిచేసితి
ధర్మరక్షణము నిలప కోరితి
రాచవంశపు కీర్తి నిలపితి.

॥శ్రీరఘురాముని॥

కొండలు-కోనలు-వనములు నీవని
పాలించెడివి, ఇక్ష్వాకులవి
కావున నీవు సామంతుడవు
దుష్ట శిక్షణ సార్వభౌమునిది.

కట్టు వస్త్రముల తమ్ముని తరిమి
తమ్ముని భార్యను చేపట్టితివి
తమ్ముని భార్యను పొందిన వానికి
మరణదండనమె శాస్త్ర సమ్మతము

సజ్జనులందరు మెచ్చగ తగిన
ధర్మ కారణములున్నవి కనుకనె
కన్ను మిన్నును కానక తిరిగెడు
నిన్ను నేను మరి చంపితినయ్యా !

ధర్మము నెరిగిన మిత్రుడెప్పుడూ
ధర్మ చరిత్రుని సాయపడవలె
ధర్మము నీకు తెలిసిన నెంచుము
పాపకర్మ కిది ప్రాయశ్చిత్తము

సదాచారులు ఆచరించునవి
పండితులంగీకారము నందిన
ప్రమాణమయిన మనుసూక్తులను
చెప్పెద వినుము వానర రాజా !

పాపము చేసిన జనులందరును
రాజు చేతిలో శిక్షను పొందిన
నరకము కేగక పాపము తొలగి
ఇంద్ర లోకమున నుందురు వినుము.

॥శ్రీరఘురాముని॥

చోరుని రాజు దండించుటయో
నిర్దోషిగను పరిగణించుటో
జరిగిన, చోరుని పాపము తొలగును
రాజ నిర్ణయము ధర్మ నిర్ణయము

పాపిని రాజు దండించనిచో
పాపము రాజుకు చుట్టుకొనునయా !
ఇంద్రకుమారా ! వింటివ తీరుగ
ధర్మమన్నది శిరోధార్యము.

ధర్మాత్మునిగా కీర్తి గడించిన
మా పూర్వీకుడు, మాంధాత, మరి
నీ వలె నడచిన ఒక సన్యాసిని
నిర్దయగా దండించుట తెలియుము.

రాజులు తొలుత ఏమరి యుండగ
అధర్మపరులై కొందరు నడచిన
పిదప వారిని గ్రహించి రాజు
దండించిన మరి పాపము తొలగును.

ధర్మభ్రష్టులై చరించువారిని
గ్రహించి రాజు శిక్షించినచో
వారి పాపము తొలగుటె గాక
రాజు స్వర్గము చేరగ నర్హుడు.

కావున నీవు వంత నొందకుము
ధర్మ మార్గమున ధర్మము కొరకు
దునిమితి నిన్ను ధర్మ విషయమున
నేను కూడ మరి అస్వతంత్రుడను.

॥శ్రీరఘురాముని॥

భరతుని పాలన సాగుచున్నది
ఇష్టాయిష్టము సాగనియ్యము
కష్టమయినను ధర్మము నెరపుట
సామంతునిగా నీ కర్తవ్యము

మనుజుని కాను, మృగమునంటివ
ధర్మాధర్మము తెలియదంటివ
మృగమును చంపుట వేటాడుటయు
రాజ కులములో సదాచారము

మాంస భక్షణకు జనులు ఎన్నియో
మాయలు పన్ని జంతువులను మరి
హతమార్చినను, అట్టి జనులకు
పాపము అంటదు తెలియుము నీవు

వలలు పన్నుచు ఉచ్చులు వేసి
పల్లముచేసి ఆకుల కప్పి
వివిధోపాయము లుపయోగించి
వేటాడెదరు జంతులనిలలో

వ్రణముచె బాధను పడెడి రోగికి
వైద్యుడు శస్త్ర చికిత్స చేయును
రోగి యిష్టము అయిష్ట మన్నది
తలచడు వైద్యుడు కర్తవ్యములో

॥శ్రీరఘురాముని॥

రాజులు అటులే ప్రజల మంచికై
వారి ఇష్టము అయిష్టమెంచక
ధర్మ మార్గమున వారి రక్షణకు
తగినదానిని చేయుట ధర్మము

ప్రజలహితమునే రాజులు కోరుచు
ప్రజాహితముకై పనులను చేయగ
దోషులు కష్టము కలిగెననుకొని
రాజును చంపక నిందించకను

రాజధికారము నెంతయుసలుపక
రాజు చర్యలను పరిహసింపక
ఉండుట యుక్తము, ఏలన సురలు
ధర్మ రక్షణకు మనుజులగుదురు

ధర్మరక్షణకు రాజులగుదురు
దేవతలే మరి దిగివచ్చెదరు
ధర్మము నిండిన పుడమిని వారు
దయతో చల్లగ నేలుచుందురు

ధర్మసూక్ష్మము మదిలో తలచక
శరము వదలితిని అన్నకోపముతో
ఇచ్చవచ్చిన రీతిని పలుకుట
పాడిగాదుకద కపికుంజరుడా!

నా తాత-తండ్రులు ఏ ధర్మమును
అనుసరించి మరి కీర్తిగడించిరో
అట్టి ధర్మమునె అనుసరించితి
ధర్మదూరుడను కాకపోతిని

॥శ్రీరఘురాముని॥

ధర్మరక్షణకు చంపితి నిన్ను
తెలియుము నీవు వానరోత్తమా !
చెప్పితి తీరుగ తిట్టిన తిట్టుము
తప్పుకాదని తోచిన మెచ్చుము''

మెల్లగ రాముడు చెప్పిన ధర్మము
చల్లగ వాలి చెవికెక్కినది
రాముని దోషము లేదని తెలిసెను
దూషించితినని పరితపించెను

''రామచంద్ర - నే నవివేకముతో
సత్యమూర్తివగు నిను నిందించితి
ధర్మవిషయమై నువు నుడివినది
సత్యము - సత్యము సందియమేమి?

అల్పులమగు మేమేవిధి నీతో
ధర్మవిషయమై బదులిడగలము
కఠినోక్తులను పలికితి రాఘవ!
నను కరుణించుము మన్నించుమయా !

రామచంద్ర నువు సామాన్యుడవా !
ధర్మవిషయమున సుశిక్షితుడవు
యథార్థమైన జ్ఞానము కలిగిన
పండితులలో మరి శ్రేష్ఠుడవయ్యా!

నే నల్పుడను తప్పులబట్టితి
ధర్మకార్యములు చేసి ఎరుగను
దాటిపోవు నా తనువు ఇంకను
క్షమించినాను అను దయతో నువు

యుద్ధభూమిలో నీ బాణముతో
తనువును వదలి ఉత్తమలోకము
చేరగ నుంటిని ఓ రఘురామా!
ధన్యుడనయితిని చింతింపనయా!

తమ్ముడు-తార-బాంధవులెందరో
అందరికోరకై నే చింతించను
కనకాంగదుడు ముద్దుకుమారుడు
వానిని తలచిన దుఃఖము కలుగును

రామచంద్ర నాకొక్క కుమారుడు
గుణములయందు శ్రేష్ఠుడు వాడు
మురిపెముగా నే పెంచితివానిని
నే నిట పుడమిని వ్రాలుట గాంచిన

నీతుతేని సరసున్న తీరుగా
తండ్రీ! నన్ను వదలిపోదువా
అని దుఃఖించును కళదప్పినటు
రోదించునుకద ఓ రఘునందన

పసివాడయ్యా! పసివాడునయా
ఒక్కకుమారుడు మక్కువ నెలవు
మంచిచెడ్డలు వానికిజెప్పి
చక్కదిద్దుటకు ఎవరున్నారిక ?

నీ చేతులలో నుంచితి నంగదు
చింతవదలెదను నీవే తండ్రివి
తల్లివినీవే దిక్కువునీవే
నిన్నుమించి, మరి, వానికెవ్వరిక

॥శ్రీరఘురాముని॥

సుగ్రీవునితో సమానమ్ముగా
ఆదరించుము కనకాంగదుని
పరమగుణాఢ్యుడవైన రాఘవా!
పాలముంచెడి భారమునీదే

భరత, లక్ష్మణుల ఇద్దరిపైన
నీకున్నట్టి ప్రీతిని నీవు
సుగ్రీవునిపై అంగదుపైన
చూపగవేడెద-నిలచిన ధర్మమ!

వివేకి తార భాసురశీల
నా భార్యగుటచె విరోధి అగును
అర్కసుతుడు, తానవమానించక
ఆమెను చూడగ ఆనతినిమ్మ

వినయ విధేయత మీయెడ చూపుచు
వర్తించెన మతి అర్కసుతుడిక
పుడమి ఏల? మరి స్వర్గమునయిన
ఏలగలడిది-సత్యము-సత్యము

వలదు రామునితో వైరమువలదని
తార పోరినను-పోరగవచ్చితి
నీతో పోరి, నీలో చేరగ
వచ్చితిపోరగ సుగ్రీవునితో

అంద చేరెను మా సుగ్రీవుడు
అందజేర్చితిని అంగదునిపుడు
అసువులపైన ఆశలేదు యిక
ఆనతినిమ్మ జానకీశ్వరా!

॥శ్రీ రఘురాముని॥

అంతట రాముడు ప్రేమతో పలికెను
అంగదు విషయము చింతింపకుము
నే నకార్యము చేసితిననియో
నీవు పాపము చేసితివనియో

తలపకు మదిలో ప్రాయశ్చిత్తము
దండించుటచే కలిగించితిని
దండనవలన దోషముతీరి
దేహము విడిచి దివికేగెదవు.

నిను దండింపక పోయినచో మరి
నా కర్తవ్యము ధర్మము నిలపుట
జరగకపోయి దోషినగుదును
నీ దోషము యిక తీరుట యెట్లు?

మదిలో క్రోధము వదలుము నీవు
రోషము వదలుము వనచరపాలక
విధినిదాటగ ఎవరికి వశము
వ్యథను వదలుము అని పలుకుచును

నీవిక అంగదు విషయములోన
చింతిలవలదు ఇంద్రకుమారా!
నీవు అతనిని చూచుకొన్నటు
సుగ్రీవుడు-నేనును చూచుకొందుము!!

అనుచు రాముడు తియ్యగ పలుకగ
ధర్మమూర్తి యగు రామచంద్రునితో
వాలి పలికెను వేదననిండి
వాసవ సుతుడు వందనమిడుచు.

॥శ్రీరఘురాముని॥

"నిప్పుగ శరము ఎదనుకాల్చగా
పాపక్షాళనము జరుగుచుండగా
బాధలో నన్ను నేనే మరచి
వదరితిరాఘవ దయగొనుమయ్యా !"

19. తార శోకము

వాడిబాణము బాధించగను
గిరుల-తరులతో సుగ్రీవుడు కొట్టిన
దెబ్బలతో తనువంత వ్రయ్యలవ
మరణబాధతో వాలిమూర్ఛిలె

బాణహతుడయి వాలి వ్రాలెనని
వార్తపిడుగులా విన్నది తార
తనయునంగదుని వెంటనిడుకొని
దుఃఖము-భయముతో బయలుదేరెను

కాంచెను తార పరుగిడుచున్న
వానరవీరుల నెందరొగాంచెను
రామబాణముల బారి పడకను
పారిపోయెడి వీరులు వారు

వారలగాంచి తారపలికెను
"భీరువులారా పరుగిడు టెందుకు ?
రాజ్యముకోరి తమ్ముడు అన్నను
కూల్చగజేసెను తీవ్రశరమున

॥శ్రీరఘురా:.ని॥

ఇన్ని దినములు ప్రభువును కొలిచి
విశ్వాసముతో సేవలు చేసి
విపత్కాలమున పరుగులు తీసి
గిరులగుహలలో దాగ న్యాయమా ?''

అంతట వానర వీరులు పలికిరి
యుక్తినిండగ పలికిరి తారతో
''తనయునితో నువు లోనికి పొమ్మ
అంగదు ప్రాణము అందనీయకు

యముడే రాముని రూపమునంది
గమ్యము చేరగ చాలిన శరముతొ
వాలిని కూల్చెను విను మహరాణీ
అంగదు రక్షణ నీ చేనున్నది

గిరుల తరులను నిగ్రహించుచు
వాలిపోరెను విను మహరాణీ
వజ్రాయుధమై వచ్చిన శరముతొ
వాడి బాణముతొ వాలికూలెను

ఇంద్ర తేజముతొ సమమగునట్టి
తేజము కలిగిన వాలికూలగా
ప్రాణభీతితో వానరులందరు
గుహలచేరగా పరుగులెత్తిరి

తిరిగి పలికిరి తారతొ వారు
బహిర్ద్వారముల మూయించగను
అంగదునకు మరి పట్టముగట్టిన
తిరిగి రాజును సేవింతుమని

॥శ్రీ రఘురాముని॥

"నీ వీటనున్న అపాయము రాణి
ఆలిదూరమై తిరిగెడి వీరులు
పరుల ఆలికై పరుగిడు కోతులు
అందరు పురమున అడుగిడగలరు

పాతవైరములు వెలికితీయుచు
పోరుపెంచెదరు సుందరవదనా!"
అనినవారితో నిర్లిప్తతతో
తారపలికె చిరుదరహాసముతో

"లోకోత్తరమగు మహిమాన్వితుడు
వానరసింహము - పూజనీయుడు
నాకుదక్కనిచో రాజ్యము ఏల?
నిక్కము, వలదు-సుతుడు, దేహము

ఈ దేహము మరి నా కుమారుడు
ననురక్షించగ చాలినవారా?
రామబాణముచె నేలకూలిన
ప్రభువు పాదముల చెంతవ్రాలెద"

రోదించుచు తల బాదుకొనుచును
గుండెలు పగులగ చరచుకొనుచును
రిపులపాలిటి యముడైనట్టి
యుద్ధములందు వెనుకడుగిడని

వాయువు సరిపడు వేగముగలిగి
కొండలలీలగ చిమ్మగచాలిన
ఇంద్రుని పోలిన విక్రమమూర్తి
మేఘ గర్జనతో సరిపడు కంఠము

॥శ్రీరఘురాముని॥

సుందరమయిన రూపముగలిగి
శూరపుంగవుని కోలనుబడిన
వాలిని దూరమునందే గాంచిన
తారచేరె తను నడుపలేకనే

వానకురిసి మరి వెలసిన మేఘము
శార్దూలముచే భక్షించుటకై
కూలిన సింహము పోలిన వాలిని
వానరపతిని గాంచెను తార

పాముల పగర గరుత్మంతుడు
నాగులకొరకై కూలద్రోసిన
ప్రాసాదమువలె వాలితోచెను
తారకాంచె తనకాంతుని భక్తితో

వాలినికూల్చి ధనుసు నూతగొని
నిలచిన రాముని లక్ష్మణమూర్తిని
వాలి సోదరుడు సుగ్రీవుని అట
మంచి మనసుగల తారగాంచెను

కాంచెమసాగి శరఘాతముచే
కూలిన పతినిగాంచి శోకమున
మూర్ఛనందినది తిరిగి-తేరుకొని
నాథా-నాథా-ప్రియనాథాయని

నాప్రాణేశ్వర జీవితేశ్వరా।
ఓ మనోహరా। అనుచు ఏడ్చుచు
మృత్యుపాశముల బద్ధుడు అయిన
భర్తనుగాంచి శోకతప్తయగు

వదిననుగాంచెను వాలితమ్ముడు
చెంతనెగాంచెను కనకాంగదుని
రవిసుతుమదిలో దుఃఖముపొంగెను
దుఃఖ సంద్రమది కన్నుల నిండెను.

20. తార విలాపము

శరఘాతముచే నేలనుబడిన
మత్తేభమువలె నున్న వీరుని
సురపతి సముడగు భర్తనుగాంచి
దుఃఖముపొంగి రోదన నిండెను

ప్రేళ్లతో ఊడిన తరువై పడిన
పతికాయముపై వ్రాలెను తార
హానాధా !-యని రోదించుచును
విలవిలలాడెను వివశురాలయి

"రణమున ఓటమి నెరుగని వాడవు
ధరణినికూలగ ఏ విధి మనసయె
నిరపరాధిని నాథాయని-నే
పిలచుచుంటి మరి పలుకవేలనో?

నీ మాటకునే నెదురాడితినా
నాదోసము మరి ఏమదిస్వామీ!
కోపించితివా కోమలాంగిపై
నను వదలితివా వీరపుంగవా!

॥శ్రీరఘురామః॥

కపిరాజువునువు కటిక నేలపై
పరుండుటేమి ? మృదు తల్పమున
శయనించుము నువు లే మహారాజా!
నేనిటుచూసి ఓర్చుట ఎట్లు ?

భూకాంతన నీ కంతమక్కవా
అక్కన చేర్చుకు పరుంటివయ్యా!
నేనిటనుండగ పరకాంతను నువు
చేర్చుట తగునా కపికులాగ్రణీ !

స్వర్గమార్గమున మన కిష్కింథను
మించిన సంపదలున్న నగరము
అందెన స్వామీ? అందుకొరకు నువు
వదలిపోదువా? ఇందరి నిచట

ఉద్యానమ్ముల విహరించుటెటు
మధువు నిండిన సుమముల నింత
ఇచ్చెడి దెవ్వరు-ప్రాణేశ్వరియని
మక్కువనిండి పిలిచెడి దెవ్వరు ?

నాధునికొరకై నిరీక్షించుట
నా తనువుకు ఇక ఏదీస్వామీ
దిక్కులేక-నే దీనురాలనై
మూలజేరి మరి బ్రతుకుట ఎట్లు ?

మురిపెపు పలుకులు మదిలో తలచి
సుందరమూర్తిని ముందర చూచుచు
సాటి కాంతలలో మేటిగ పొంగెడి
నాకిదుర్విధి కూర్చెను బ్రహ్మ

॥శ్రీరఘురాముని॥

వేయితునకలై గుండియ పగలదు
ఎంతటి బండరాయియో మరి
ఇంతకు మించిన విపత్తు మరియిక
కలుగున కాంతకు, వానర రాజా !

తమ్ముని తరిమి ఆతని భార్యను
చేర్చుకుంటివి ఫలమిది ఇపుడు
అనుభవించగా ఫలసెను నాధా !
ఆలి అపహరణ ఎంతటిదో విను !

మేలుకోరినే మరిమరి చెప్పితి
నా బోధన నీ చెవికెక్కినదా
నోటిని నీవు మూయించితివి
మాట వినుటవిచే మంచి కలుగదా !

పురుషుల మనసు దోచగ చాలిన
దేవకాంతలను వశపరచుకొని
ఏలగచాలిన చల్లని దొరవు
ఏలిన నన్ను ఏలవదలితివి ?

వలదు-వలదు నువు పోరగవలదు
అని చెప్పినను వినక పోరుకు
పోవుట గాంచి తలచితిమదిలో
ప్రాణాంతకమగు సమయమగునని

దుఃఖము నెరుగను దీనత్వమది
వినకపోతిని ఇకపై నేను
దిక్కులేక మరి వైధవ్యముతో
ఏ విధి తనువును నిలపుట స్వామీ !

॥శ్రీరఘురామునిః॥

రమ్మి కుమారా జనకుని చూడుము
రమ్యగుణములు ధర్మము నెరిగిన
రాజపుంగవుని కన్నుల చూడుము
రాదు నీకు మరి చూచెడి భాగ్యము.

ఇకపై ఎవరిని నాయనాయని
పిలతువురానువు నా పసికూన
స్వామీ యిడుగో కనకాంగదుడు
చూడవు ఏమి ? కనులు తెరవవా

ముద్దుగ పెరిగెను సుఖముల దేలి
నీ ఎదుటను మాటాడి ఎరుగడు
ఇక పినతండ్రి కోపము నిండగ
కొలచుట ఎట్లో? కొలవక ఏగతి?

వానరేశ్వరా ! కన్నులు తెరువుము
కొడుకును కొంత ఊరడించుము
శిరను మూర్కొని కడసారిగను
హితము గొలుపుచు పలుకుము స్వామీ !

అని పతికాయముపైన బడినది
రోదించుచును పలికెను తిరిగి
వానరేంద్ర ! నిను చంపుట చేతను
రామభద్రుడు మాట నిలుపుకొనె.

గొప్ప కార్యము రాముడు చేసెను
చేసిన ప్రతిన నిలబెట్టుకొనె
సుగ్రీవా ! నువు సుఖపడవయ్యా !
రుమతో రాజ్యము ఏలుకోయిక !

॥శ్రీరఘురాముని॥

వల్లభా ! యని నీ ప్రియురాండ్రు
రోదించుటది వినబడలేదా ?
ఉలకవు, పలకవు వానరశ్రేష్ఠా
ప్రజ్ఞానిధినువు ఏ విధి నుంటివి''

అంతట వానర స్త్రీ సమూహము
అంగదు నచట కౌగలించుకొని
హృదయేశునితో ననిరి దీనముగ
''కుమారు నొదిలి పొగుట తగునా

ఆలోచించుము అంగదుడితడు
ముద్దు కుమారుడు వదలకు మయ్యా !''
అనగా తార తిరిగి దీనముగ
వీరుడ నీకు తగదు వినుమయా !

పరలోకమునకు ఏగుట తగదు
మా తప్పులు మరి దోసములేవి ?
దోసములున్నా మంచి మనసుతో
మము క్షమియించగ తగుదువు నీవు.

కపిశ్రేష్ఠా ! యిదె పాదములంటితి
వదలను నేను'' అనుచు దీనముగ
తారపడగను స్త్రీ లందరును
వాలి పాదముల ప్రాలిరి అచట

దుఃఖించుచును దీనవదనయై
తారాకాంతుని పదముల వ్రాలిన
వాలి భార్య ఆ తారాసాధ్వి
ప్రాయోపవేశము చేయదలచెను.

॥శ్రీరఘురాముని॥

21. మారుతి-తారను ఓదార్చుట

తారాపథమున నుండెడి తార
నేల వ్రాలినటులున్నది తార
చంద్రుని పోలు ముఖము గలిగిన
తారతో పలికెను ఆంజనేయుడు.

"శోకము నాపుము దేవీ ! వినుము
తెలిసియొ, తెలియకొ దేహధారులు
కర్మలు చేసిన-పాప పుణ్యములు
అనుభవించుట జరిగి తీరును.

పాప ఫలము మరి కీడు గలుగుట
పుణ్యఫలమది మేలు కలుగుట
పరలోకములో వారి వెంటను
ఫలితము చేరును అనుభవించగ.

మగువా ! వినుము దేహమన్నది
నీటి బుగ్గతో సమానమయినది
అశాశ్వతమ్మై వగచుట ఏల ?
నిన్ను నువ్వు మరి ఉద్ధరించుకో.

విషయము తెలిపెద విను మహారాణీ
అంగదు నీవు రక్షించవలె
కడుపున బుట్టిన నీ బాలునకు
నీవు తప్ప మరి రక్షకులెవరు?

నీ కర్తవ్యము అంగదు రక్షణ
శుభములు వానికి సమకూర్చవలె
వివశురాలవై తనువు వదలగను
యోచించుటది సరిగాదు సుమా !

॥శ్రీరఘురాముని॥

పవిత్రమైన మనసు గలిగిన
రాణీ! లోకమునందలి జీవులు
పుట్టుట గిట్టుట రెండును కూడ
అనిత్యమయినవి నీకు తెలియదా ?

కావున హితులకు ఈ లోకములో
వలయు హితకర్మలు చేసినట్టుగ
ఊర్ధ్వలోకములు వారు చేరగ
వలయు క్రియలను నిర్వహించవలె

ఊర్ధ్వలోకమున సుఖముతోనుండగ
వలయు కార్యములు చేయగ వలెను
రోదనాదులు నిషిద్ధమయినవి
కాగల కార్యము నాలోచించుము

లక్షలు కోట్ల సంఖ్యలో నున్న
వానర వీరుల నేలెను వాలి
ఆశ్రితులందర చేర్చి-వారికి
బ్రతుకు తెరువును ఏర్పరచెను గద

ధర్మాసక్తితో శాస్త్ర విహితమగు
తత్వము నెరిగి సామదానములు
శాంతియు తెలిసి ఈ లోకములో
చేయవలసినవి పూర్తిగ జేసెను

అంగదునకును కపిశ్రేష్ఠులకు
భల్లూకములకు నీవే దిక్కు
భారము నీపై నున్నది రాణీ !
కపి రాజ్యము నీ చేతనున్నది

॥శ్రీరఘురామసి॥

శోకింపకుము నీ సాయముచే
అంగదుడెంతో సామర్థ్యముతో
రాజ్యము నేలగ సంతోషింతువు
గతమునకై విలపించుట తగదు

ఏ ప్రయోజనము కోరుచు-తండ్రులు
జగతిని పుత్రుల బడయగోరుదురొ
అట్టి సమయ మాసన్నమైనది
ఉత్తరక్రియలను చేయించనగు

తండ్రికి విధిగా సర్వము తీర్చగ
అంగదు నీవు అభిషేకించగ
దుఃఖము తీరును'' అన హనుమంతుడు
తార పలికెను ఆంజనేయునితో

''విను హనుమంతా! అంగదువంటి
పుత్రుల నూర్గుర పొందుటకన్నను
శౌర్యధనుడు మరి అజేయుడయిన
భర్తసన్నిధే శ్రేష్ఠము నాకు

వానరరాజుకు సంస్కారంబులు
చేయించగ నే నెవ్వతెనయ్యా!
అంగదుని మరి యువరాజుగను
పట్టము గట్టుట కెవ్వతి నేను

సర్వము చూడగ చాలు సమర్థుడు
పినతండ్రియగు సుగ్రీవుడగు
నా ప్రాణేశుడు స్వర్గమేగగా
నా కిక మమత దేనిపైనయా!

హనుమంతా నే నీ విషయములో
యోచింపగను ఏదియులేదు
పుత్రునికెపుడు కూరిమి బంధువు
శుభములు కూర్చగ చాలిన తండ్రియె

వానరశ్రేష్ఠా! ఇహపరములలో
వాలి ఆశ్రయము ఉత్తమ ధర్మము
రిపుని కెదురుగ వీరశయనమున
ఉన్న భర్తతో సాగెద నేను.''

22. వాలి జాలి పలుకులు

కిష్కింధాపతి కొన ఊపిరితో
మెల్లగ శ్వాసను విడుచుచు నపుడు
చెంతనె ఉన్న అంగదు గాంచెను
ప్రాప్తవిజయు సుగ్రీవుని గాంచెను

తమ్ముని గాంచి వాలి పలికెను
స్నేహపూరిత వాక్కుతో పలికెను
''పగ సాధించితి, నను దూషించకు
నీ దోసము యిసుమంతయు లేదు

విధికృతమును మరి దాట శక్యమా!
జ్ఞానహీనునిగ చేసెను నన్ను
అన్నదమ్ములము ఒకటిగ నుండి
సుఖించు యోగ్యత లభించలేదు

కపిరాజ్యము నువు పరిపాలింపుము
ప్రాణము-రాజ్యము-సంపద-భువిపై
మూడులోకముల పొందిన యశము
వదలి, దివికి నే పోవుచుంటిని.

॥శ్రీరఘురామ॥

సుగ్రీవా! నువు కపిరాజువయా
మరణావస్థలో నే కోరినటు
కష్టమయినను చేయుట ధర్మము
బుద్ధిమంతుడు సుఖపడవలసిన

విలపించెడి యీ అంగదునిపుడు
ప్రాణముకన్న మిన్నగువానిని
కన్నకుమారుని వలె రక్షింపుము
తండ్రివి-తాతవు-నీవే వానికి

భయపడు నెడల భయము దీర్పుము
విక్రమమందు నీకు సమానము
అసురుల జంపు అమితోత్సాహుడు
నీ ముందటనే విజృంభించును

వాని వయసుకు శక్తికి తగిన
కార్యదక్షుడు సందేహించకు
దోషరహితుడా తారను గనుము
సుషేణుతనయ, సుబుద్ధి ఆమె

సూక్ష్మవిషయముల నిశ్చయమ్ముగా
తెలియగనేర్పరి-సమర్థురాలు
అపశకునములతో రాగల కీడు
చెప్పగ చాలిన శక్తి గలదయా!

మంచిది చేయుము అనినంతటనే
ఆ కార్యము నువు చేయుము సోదర!
రాముని కార్యము ఎట్టిదయిననూ
సందేహింపక చేయుము తప్పక.

॥శ్రీరఘురాముని॥

రాముని కార్యము చేయకపోయిన
అధర్మమగునది అంతియేగాక
అవమానించితివని చంపును నిను-
భయభక్తులతో మెలగుము నీవు

వానరరాజా వాసవుడొసగిన
బంగరుహారము ధరించు నీవు
మరణించగను దానిని తీసిన
మహిమపోవును కావున దాల్చుము

మహిమాన్వితమగు కాంచనహారము
ధరించినీవు రిపుల హరించుము''
అన్నవాలి అటు పలుకుట వినగ
కాంతిహీనుడై నిలచె సుగ్రీవుడు

వాలి అంతట అంగదు బిలచి
ప్రియముగ నీతిని బోధించెనటు
''తనయా ! నీవు ఉచితానుచితము
తెలుసుకు మసలుము ! నీకది మేలు

ప్రియాప్రియములు సుఖదుఃఖములు
సమముగనెంచి క్షమతో మెలగుము
సుగ్రీవునికి వశుడవు అయినువు
నడచుట, కర్తవ్యముగా నెంచుము :

నా ఎడ చనువుతో నడచినట్టుగా
పినతండ్రితో నువు నడచిన యెడల
ఒప్పడు-నావలె లాలన చేయడు
తప్పొనరించిన దండించునయా !

॥శ్రీరఘురాముని॥

సుగ్రీవుని పగతుర స్నేహము చేయక
పగతుర-హితులతో మాటాడకను
శ్రద్ధాభక్తుల ప్రభు కార్యమును
ఆచరించుట నీ కర్తవ్యము.

అతిగా స్నేహము చేయుట తగదు
విరోధమసలు పెంచుకోకయా
మధ్యస్థుడవై మసలుకొనుటచే
మంచి కలుగును శుభములు కలుగును''

అనుచు పలుకుచు హితముచెప్పుచు
గ్రుడ్లను త్రిప్పుచు కోరలు కనబడ
వాడిబాణమున పీడితుడైన
వాలి ప్రాణమును విడిచెను బాధ అపుడు.

జాలిగనేడ్చెను కపిసమూహములు
కాంతి విహీనము అయె కిష్కింధ
కొండలు-గుహలు-తోటలు-వనములు
కళదప్పినవి, విలపించినవి

నిండుగ బూచిన తరువులన్నియు
వేగము కలిగిన వాలి వెంబడి
వచ్చెను-అంతటి వీరుడు, పుడమిని
మరియొకడెవడని వగచిరి అచట

గోలభుడను గంధర్వవీరునితో
పదునైదేండ్లు పోరి, దుష్టుని
అంతము చేసి భయము బాపెను
అంతటి వీరుని మరి గాంచము గద!

॥శ్రీరఘురాముని॥

ఆలమందకు రక్షగయుండిన
ఆబోతు అంతము అయినంతటను
భీకర సింగములున్న అడవిలో
భీతిలిగోవులు ఘోషిల్లినటు

వానరులందరు రోదించిరట
శోక సంభ్రమున మునిగిన తార
కూలినమానై పడిన వాలిపై
చుట్టుకు పడినది శోకలతవలె.

23. శోక సంభ్రమున తార

భర్తముఖమునకు ముఖము జేర్చినది
దుఃఖము నిండి-అయ్యో నాధా !
కఠిక నేలపై పవళించితివి
భూకాంతన నీ కంతమక్కువా ?

వానరేశ్వరా ! నాయెదుటను, నువు
శంకలేక ఈ ధరణీకాంతను
కౌగలించి మరి సంతసపరచగ
ధరణి ఎంతటి ప్రియురాలయినది

సుగ్రీవునికి విధి అనుకూలము
కావున ఈ విధి నీతో పోరి
వీరపుంగవుని ఎదిరించెకద !
లేదా నీతో పోరి బ్రతుకు టెటు?

వానరవీరులు గోలున ఏడ్చుచు
కనకాంగదుడు కుమిలిపోవగా
దీనారవములు, రోదనలన్ని
వినబడలేదా ! తగునా మౌనము

॥శ్రీరఘురామ ని॥

నీచే ఓడిన వీరపుంగవులు
అలంకరించిన వీరశయనము
అలంకరించి వదలిపోతివి
అనాధగా నను చేసిపోతివి

తెలిసిన వారు తనయనెన్నడు
శూరునికొసగరు భార్యగనెపుడు
చూచితివా మరి శూరునిభార్యను
వైధవ్యముతో జీవచ్ఛవమును

మాన్యత నాకు చచ్చిపోయినది
ముత్తయిదువుగా చావకపోతిని
సద్గతిలేదు దుఃఖసంద్రమున
పూర్తిగమునిగితి వానరపుంగవ

మోహనరూపుడు పతిపయనించగ
నూరువ్రక్కలయి గుండియపగలదు
హృదయము శిలగా మారిపోయినది
హృదయేశుని వదలి బ్రతుకుట కొరకా

దైవము, స్నేహితుడితడే నాకు
రక్షకుడైనా మేలుకోరును
నా పెన్నిధి అసహాయశూరుడు
స్వర్గము జేరెను అనాధజేసి

కొడుకులుండిన నాసంపదలున్నను
ధనధాన్యములు దండిగనున్నను
పెనిమిటిలేని భార్యనెప్పుడు
విధవని పిలతురు నిర్లక్ష్యముగ

నెత్తుటిమడుగు మెత్తని శయ్యగ
శయనించెడి ఈ దుర్విధి నీకా!
రొమ్మున నాటిన బాణమువలన
కౌగలించుకొన వశపడకున్నది

ACC NO - 2254

తార అట్టుల రోదించగను
గుహలోనున్న నాగుబాము
వెలికి లాగినట్లు, నీలుడు వచ్చి
రామబాణమును వెలికిలాగగ

OM. 15-00

పశ్చిమాద్రిలో రవిబింబమును
విడచివచ్చెడు రవికాంతివలె
వెలిగిన దచట రామబాణము
వెల్లువగానట నెత్తురు పారెను

294.592
RAD

రోదించుచును ప్రాణనాధుని
ధూళినంత తన కంటినీటితో
కడిగివేసినది తార అచ్చట
అంగదు నిలచి వాలిని చూపుచు

''పాపకర్మమున కలిగిన వైరము
కాయముతోనది నమసిపోయినది
చివరిచూపు యిది ప్రొక్కుము అనగ
వాలిపాదముల వ్రాలె అంగదుడు

దీవించవేల దీర్ఘాయుష్షని
సింహముచేత ఆబోతు పడ
దూడతోనుండెడి గోవు రీతిగ
విడువలేక మరి దుఃఖమునుంటిని

॥శ్రీరఘురాముని॥

సంగ్రామమను యజ్ఞము చేసి
రామబాణమను నీటియందు-నువు
అవబృధస్నానము చేసితివయ్యా
ఆలినయిన నన్నొదలుట తగునా?

పోరుకుమెచ్చి వాసవుడిచ్చిన
కాంచనహారము కనబడదేమి ?
చెప్పిన వినకపోతివి నాధా !
నా మాంగల్యము దూరమయినది

అస్తమించినను అర్కుని కాంతి
రత్నసానువగు మేరు పర్వతము
వీడదు-అట్లే మరణించినను
రాజ్యలక్ష్మి నిను వీడదు నాధా !''

24. సుగ్రీవుని దుఃఖము-వాలిని విడిచి తార బ్రతుకలేననుట.

వదినతార అటు విలపించుటగని
అంగదుడటుల కుములుటగాంచి
మరణించిన తన అన్నను గాంచి
కడుదుఃఖించెను అర్కసుతుడట

సర్పసమానము అగు బాణముతో
వింటితో నిలచిన రామచంద్రుని
చెంత చేరెను తన ఆశ్రితులతో
బాధగపలికెను రవిసుతుడంతట.

॥ శ్రీరఘురాముని ॥

"రాజోత్తమునువు శపథము తీర్చగ
కపిరాజ్యము నా చేతికి వచ్చెను
రాజ్యసుఖముపై కాంక్షపోయెను
అన్నను నేను అనుసరింతును

రాణియు-కొమరుడు, పట్టణమంతయు
రాజుకోసమై రోదించగను
రాజ్యభోగములు మనసు కోరదు
రామచంద్ర నే బ్రతుకలేనయా!

కఠినముగా నను తరిమివేసెనని
తలచితి నాతని చావుకోరితి
నే దొరికినను, నన్ను చంపక
స్వేచ్ఛగపోరా! అనగలిగెనుకద

సురాధిపత్యము అయినా కోరను
ఋష్యమూకమున బ్రతుకుచుందును
అన్న అనిన సామాన్యుడుగాడు
శూరులందున శ్రేష్ఠుడు రామా!

ఉత్తములందు ఉత్తముడాతడు
తెలియకపోతిని దుఃఖమునపుడు
కన్నుమిన్ను మరి కానకపోయి
కామముతో మాటాడితినపుడు

తరుశాఖతొ నను చావమోదగ
నేలనుబడి నే తన్నుకొనగను
మంచిమాటలతొ నాతో చెప్పును
పోరగ రాకుర! బ్రతుకుము పోరా!

॥శ్రీరఘురాముని॥

సోదరధర్మము ఆర్యధర్మము-
రక్షించబడె అన్న వాలిచే-
కామక్రోధముల నిండిన నేను
కోతిగుణమును కనబరచితిని

అఘోరమయిన పాపమునందితి
సాధుజనులచే విడువగదగినది
ఇంతటి పాపము పూర్వము ఇంద్రుడు
పొందెను ఆతని సోదరు జంపి

విశ్వరూపుని ఇంద్రుడు జంపెను
బ్రహ్మహత్యతో పాపము-నందెను
ఆతని పాపము భూమియు-జలము
తరువులు-స్త్రీలు; పంచుకొనిరట

కోతినైన నా పాపమునెవరు
పంచుకొందురు-నీచుడ నేను
నింద్యుడ నేను లోకమ్మునకు-
అపకారములే చేయువాడను

అధర్మవర్తిని-అంగదుడిప్పుడు
అసువులుబాసెను వంశనాశకుడ
యువరాజు పదవికే తగనివాడను
రాజ్యమునకు మరి ఏ విధి తగుదును

భ్రాతృవధయను వాలముగలిగి
సంతాపమను శిరసు-దంతములు
లోభము కన్నులు-కలిగిన ఏనుగు-
పాపమనియెడి మహాగజమది

॥శ్రీరఘురామముని॥

వృద్ధి నందిన మాత్తేభమది
ఏటిగట్టును త్రోసినరీతిగ
త్రోయుచున్నది - ఓ రఘునందన
పాపము, నాలో మంచిని - గ్రమ్మెను

పుటము పెట్టగ బంగరునందలి
మాలిన్యమది పోయినట్టుగా
నా పాపముతో సాధు స్వభావము
రోయుచుపదలెను - కలియలేకను

కొనవూపిరితో అంగదుడుండెను
వాడు బ్రతుకనిచో వానరులందరు
బ్రతుకరు నిజము - ఓ దాశరథీ!
ఇంతటి ఘోరము చేసితి నేను

కొడుకులెందరో ఉందురుగాక
అంగదువంటి సుబుద్ధి గలుగున?
కలిగిన మంచి కొమరుడు కలుగును
కానీ అన్న ఎచట లభించును?

అంగదుడిపుడు బ్రతికియుండెనా
వానికొరకయి తార బ్రతుకును
అటుగాక మరి వాడు నిలవనిచో
తార బ్రతుకదు నిజమిది రాఘవ

అన్నతో, కొడుకుతో స్నేహము నిలపగ
అగ్నికి నేను ఆహుతి అయ్యేద
నీ కార్యముకై వానర వీరులు
తోడుగనుందురు సీతను వెదుకగ

॥శ్రీరఘురాముని॥

కోతులు నీకు సాయపడనిచో
కార్యము ఆగదు నేనెరుగుదును
నీ సామర్థ్యము నాకు తెలియదా
వంశ నాశకుడ నేను తగనయా।

పాప కార్యములు చేయువాడను
ఘోర కర్మలను చేసెడివాడను
అపరాధిని-నే సీతాన్వేషణ
పుణ్యకార్యము చేయగతగను

అనుజ్ఞయిమ్ము మరణించుటకు''
అని సుగ్రీవుడు రోదించగను
శత్రుహరణుడు రామచంద్రుడు
కనుల బాష్పముల దుఃఖితుడయ్యెను

ముల్లోకములు ఏలగచాలిన
రామచంద్రుడు ఓర్పుకు ధరణి-
తనతో పలుకగ తారాసాధ్వి
చూచుచున్నదని తెలిసినవాడై

శోకసంద్రమున మునిగిన తారను
ఊరడించగా ముందుకు నడచి
పతిపై వాలిన తారను గాంచెను
మంత్రులు, తారను వేరుజేసిరి

విశాలనేత్రుని సూర్యతేజుని
ఘనమగు విల్లు శరములు గలిగిన
రామచంద్రుని చూచెను తార
పద్మపత్ర నేత్రమ్ముల జూచెను

॥శ్రీరఘురాముని॥

సాధువర్తనుని—ముందెన్నడుగాంచని
పురుషోత్తముని రాజలక్షణుని
పుణ్యశీల ఆ తారగాంచెను
తలచెను, అతడే రామభద్రుడని

ఇంద్రసమానుడు అజేయుడయిన
రామభద్రుడు తనను చూడగ
వచ్చుటగాంచిన తారాసాధ్వి
అంతటి బాధలో ముందుకు వచ్చెను

దుఃఖముతో మరి నిండినదయినను-
నిర్మల సాత్విక మనస్సుగలిగి
గురితప్పకను కొట్టగచాలిన
రామచంద్రునితో పలికెను తార

"అప్రమేయుడవు విజితేంద్రియుడవు
ఘన ధార్మికుడవు అతి సమర్థుడవు
అక్షయకీర్తికి నిలయము నీవు
సుందరమూర్తివి శరచాపధరా!

మర్త్యలోకమున అభ్యుదయముకై
అవతరించిన మంగళమూర్తీ!
అసమానబలా ఆశ్రితపోషా!
వాత్సల్యానిధి క్షమలో భువివే

రామా! ఒకటే బాణముతో నువు
పతినిగూల్చగ చాలితివయ్యా!
నన్నుకూడ నా పతితో పంపుము
నన్ను విడచి నా నాధుడుండడు.

॥శ్రీరఘురాముని॥

ఓ పురుషోత్తమ! స్వర్గమునందు
దేవకాంతలు అలంకరించుకు
సేవలుచేయగ ముందుకురాగ
వాలి, వారిని లెక్కచేయడు

స్వర్గ సుఖములు భోగములెన్నో
అమరియున్నను నేను లేక మరి
నాథుడు అచట సుఖపడడయ్యా
సీత లేక నువు సుఖముగ నుంటివ?

ప్రాయమునందు ప్రియసతి లేనిచో
కలిగెడి దుఃఖము నీకు తెలియదా!
ఆ బాణముతో చేర్చుము పతితో
ఎంతటి దుఃఖమునుండెనో నా పతి

తారుకాంతకా! స్త్రీ వధయనుచు
పాతకంబని తలచకు మదిలో
భార్య అనినచో భర్త ఆత్మయని
వేదశాస్త్రములు నుడువుచున్నవి

కూరిమి భార్యను భర్తకు కూర్చిన
దానము అన్నిట శ్రేష్ఠమయినదని
జ్ఞానులందురు, అఘము అంటదు
పతితో జేర్చుము జానకీపతీ!

దీనురాలను దిక్కులేకను
దీనముగా నిను ప్రార్థించితిని
ఒక్క బాణమున వాలితో జేర్చుము
నాథుని విడచి బ్రతుకలేనయా!

॥శ్రీరఘురాముని॥

తార ఆవిధి విలపించగను
అనునయించెను రామచంద్రుడు
''వీరపత్నివి దీనముగా యిటు
మాటాడుట మరి తగునా సాధ్వీ!

సకల జగత్తును బ్రహ్మ సృజించెను
సుఖ-దుఃఖములు, కర్మల బట్టి
లిఖించబడును విధాతచేత
విధి వ్రాతయని అందురు జనులు

బ్రహ్మ విధించిన తీరుగ నన్నియు
జరుగుచుండును దాట శక్యమా!
వీరపత్ని విటు దుఃఖించగను
వలదు, భర్తది వీర మరణము

యువరాజుగ తనయునిజూతువు నీవు
స్వాంతసించెదవు తారా వినుమని''
ప్రీతి కలుగునటు ఊరడించగ
తార దుఃఖము ఉపశమించెను.

25. శ్రీరాముడు తారను ఊరడించుట

తారయు-కొమరుడు-సుగ్రీవుడును
హోరున విలపించుట చూడగను
రాముడు సమముగ శోకమునిండి
సౌమిత్రితొ కలసి ఊరడించెను

''చనినవారికై ఏడ్చిన వత్తురె
పరలోకమున మేలుకలుగునా
జరగవలసిన కార్యము శీఘ్రమె
తీర్చుట మీకు కర్తవ్యమిక

॥శ్రీరఘురాముని॥

లోక సహజముగ శోకవశులయి
చనినవానికై విలపించితిరి.
కాలనియమమును కాదని మీరు
చేయగ చాలిన కార్యము ఏది?

లోకముకంతయు ఆదికారణము
సర్వము చేయగ చాలిన దైవము
అస్వతంత్రులము దైవము పరిధిలో
నడచెడివారము వనచరులారా!

స్వతంత్రుడై తను ఏ కార్యమును
చేయలేడు చేయించగలేడు
దైవతంత్రమున సర్వము జరుగును
నిత్యము లోకము నడచును అటులే

విధి ఎన్నడునూ సమయము దాటదు
విధి క్షీణతను ఎన్నడు పొందదు
కాలము నియమము నతిక్రమించదు
ప్రకాశించును తన స్వభావముచె

కాలమునకు మరి బంధువులుండరు
పక్షపాతము అసలే లేదు
కాలము గెలిచెడి మార్గములేదు
బలముకు భయపడి కాలము లొంగదు

కర్మలబట్టి దైవము వారికి
ఫలితమునిచ్చును కావున జీవుడు
ధర్మార్థకామములు అవిధముగను
ఆచరించుట జరుగు జగమున

॥శ్రీరఘురాముని॥

ఆచరించిన పురుషార్థముల
కలుగు ఫలమును అనుభవించగ
నాకము చేరెను వానరరాజు
పాపము తీరెను వాసవసుతునకు

ధర్మగుణముచే నాకము గెలిచెను
స్వర్గము గైకొన వెడలెను వీరుడు
వగచుట తగునా మిగిలిన కార్యము
శీఘ్రమె చేయుట కర్తవ్యమనె

రాముడు అటుల చెప్పినంతనే
దుఃఖసంద్రమున మునిగిపోయిన
సుగ్రీవునితో హితవచనమ్ముల
సుమిత్ర తనయుడు పలికె తీరుగా

''సుగ్రీవా! నువు లెమ్ము వేగమె
ప్రేతక్రియలను వాలికి చేయుము
దహనము చేయగ మంచిగంధము
ఎండుకట్టెలను తెప్పించవయా!

అంగదు నీవు ఓదార్చుమయా
వివిధవస్త్రములు - మాలలు - నేయి
సుగంధద్రవ్యములన్నీ ఇపుడే
అంగదునంపి తెప్పించుమయా!

నీ ఆధీనము కిష్కింధాపురి
పామరబుద్ధిని మానుము నీవు
తారుడ! నీవు జాగుచేయక
శివికను తెమ్ము కార్యముతీర్చగ

॥శ్రీరఘురామునిః॥

ఇట్టి సమయమున కార్యమంతయు
త్వరగా చేయుట ఎంతయొ మేలు
శిబికను మోయగ తగు బలవంతులు
ముందు నిలువుడు వాలిసేవకై

లక్ష్మణుడటుల త్వరపరచి అట
అన్నప్రక్కన నిలబడియుండగ
తారుడుచెప్పగ శిబిక నచటికి
తెచ్చిరి వాలికి కార్యము తీర్చగ-

విశ్వకర్మచే నిర్మించబడి
సిద్ధుల విమానమంతటి శిబిక
పక్షులు-లతలు-గవాక్షములతో
కొండలు-కోనలు చెక్కబడినది

పుష్పమాలలతొ కూర్చియున్నది
రక్తచందనము పూసియున్నది
బాలసూర్యుని వర్ణముగలిగి
గుహావలెనున్న శిబికను తెచ్చిరి

రాముడు అంతట తమ్మునిజూచి
వాలికాయమందుంచ మనుచును
వలయు కార్యము చేయింపుమన
సుగ్రీవుడు అంగదు లిద్దరు అపుడు

దుఃఖము నిండి తూలుచునంత
వాలికాయమును శిబికలొ నుంచి
పూలు-వస్త్రములు అలంకరించిరి
పూజలు చేసిరి పుణ్యమూర్తికి

॥శ్రీరఘురాముని॥

రత్నములెన్నో వస్త్రములెన్నో
దానములివ్వగ వానరులకును
పల్లకిముందు నడువ కొందరికి
ఆనతినిచ్చెను అటు సుగ్రీవుడు

అసమాన సంపద కలిగినయట్టి
మహారాజుకు జరిగినట్టుగ
లోపములేక ప్రేతకార్యమును
తీర్చుడు మీరని ఆనతి నిడెను

తారుడు మొదలగు వానరులందరు
అంగదు తోడ్పగ నేడ్చుచు నడచిరి
తార మొదలగు స్త్రీ జనమంతయు
నేడ్చుచు సాగిరి శిబిక ప్రక్కల

ఆడకోతుల రోదనతోను
అడవులు-కొండలు ఏడ్చినట్టుగ
ప్రతిధ్వనించెను-నిర్జనమయిన
ఒక ప్రదేశమును చేరిరి వారు

యేటి ఒడ్డున యిసుక నిండిన
స్థలమునందున చితి నేర్పరచిరి
శిబికనచ్చట దించిరివారు
తొలగిరి దూరము-అంతట తార

వాలి శిరస్సును తొడపై నుంచుకు
ఏడ్చెను "నాథా! ఓ మహరాజా!
నా హృదయేశ్వర! ఎంత గౌరవము
చూపెడివాడవు చూడవు ఏల?

అసువులు బాసిన కాంతి బాయదే
కళలు దేరెను నీ ముఖబింబము
మరల నిన్ను నే నెప్పుడు చూతును
కరవుదీర నే నెన్నడు కాంతును

కాననసీమలో కాంతలందరి
మంగళకర ముత్తయిదు లక్ష్మిని
తుడిచివేసెను-యముడు రాముడై
సుకుమారులము నడచి వచ్చితిమి

నీ భార్యలను పలుకరించవా
నీ తమ్ముని నువు కనలేదా మరి
తారుడు మొదలగు సచివులు వీరు
మంత్రాలోచన చేయవ ? వీరితో

కిష్కింధాపురి కదలివచ్చినది
వారికి తగిన ఆజ్ఞలనిమ్ము
వారు వెడలగ ఏకాంతమున
ఈ వనసీమలో చరించవచ్చును''

తార అట్టుల రోదించగను
స్త్రీలు బలముగ తారను లేపగ
సుగ్రీవుడంతట సాయపడగను
అంగదుడపుడు తండ్రికాయమును

చితిపైనుంచి కపిశ్రేష్ఠునకు-
పరలోకమునకు పోవుచునున్న
తండ్రి చితికిని అగ్నిని చేర్చి
అప్రదక్షిణము తిరిగె విధిగను

॥శ్రీరఘురాముని॥

వాసవు సుతునకు సంస్కారమును
విధులతో తీర్చి శాస్త్రవిధిగను
విడచిరి చల్లని జలముల నచట
భార్యా-కొమరుడు-సోదరుడున్న

యుద్ధములో మరణించిన అన్నకు
క్రియ జరిపించి సూర్యతనూజుడు
వ్యగ్రమనస్కుడు రాముని జేరెను
స్త్రీలు జేరిరి కిష్కింధాపురి.

26. సుగ్రీవ పట్టాభిషేకము

తడసిన వలువల దుఃఖము నిండిన
సూర్యనందనుని కొలిచిరి సచివులు
వారందరు శ్రీరాముని కొలువగ
మునుల సేవలో బ్రహ్మగ వెలిగెను

వారందరట కూర్చొనియుండగ
బంగరుకొండగ వెలిగెడువాడు
బాలసూర్యుని బింబమువంటి
ముఖము కలిగిన హనుమంతుడట

రామచంద్రునితో పలికె వినయముగ
"రఘుకుల దీపక! నీ దయవలన
వానరశ్రేష్ఠుడు అసాధ్యమయిన
రాజ్యలక్ష్మిని పొందగలిగెను

దేవా! నీవు అనుగ్రహించుము
సూర్యసుతుడు కిష్కింధకు వెడలి
దివ్యౌషధులతో దీక్షాస్నానము
ముగించి వానర బలగముతోడను

॥శ్రీరఘురాముని॥

అభిషేకమ్మగు ఇనకులతిలకా !
మీ సోదరులట అరుదేరగను
రత్నభూషల చీనాంబరముల
మిము సేవించును మిక్కిలి భక్తితో

అల్లదె గుహ ! మీరచటకు రండు
సుగ్రీవునికి పట్టముగట్టుడు
వానరకోటికి పండగ అగునది''
అన విని రాముడు పలికె తిరుగ

''హనుమంతా ! నా జనకుని ఆజ్ఞ
పదునాల్గేండ్లు వనమున నుండగ
పట్నముగాని పల్లెలోగాని
అడుగిడనయ్యా అతిబలశాలీ !

శుభముగ పట్టము కట్టుకు నిపుడు
ఓ సుగ్రీవా ! ఏలుము రాజ్యము
శాస్త్రవిధిగను అంగదునపుడు
యువరాజుగను అభిషేకించుము

బలమున నీతో సమమగువాడు
కులదీపకుడగు వాలి తనయుడు
కావున నీవు కనకాంగదుని
అభిషేకించుము యువరాజుగను

శ్రావణమేఘము లడుగిడనున్నవి
వర్షాకాలము నాలుగునెలలు
సీతను వెదకగ సమయముకాదు
కావున పురమున కేగుము నీవు

॥శ్రీరఘురాముని॥

సౌమిత్రితో ఆ కనబడు గుహలో
ఉందును చక్కని గాలివీచగా
విశాలమై గుహ కనబడుచున్నది
కలువలు-కమలము లున్నవి జలముల

కార్తీకములో రావణవధకు
వలయు యత్నము చేయుము నీవు
పురమున కేగి హితులు మెచ్చగ
రాజై ఏలుము రాజ్యము చల్లగ''

నిర్ణయమటుల రాముడు తెలుపగ
రాముని ఆనతి నందినవాడై
పురమును చేరె రవిసుతుడంతట
వానరపౌరుల వందనముందుకు

ముచ్చట పలుకుల కుశలము లడిగి
దుఃఖమున్న తార మనసుకు
ఊరట గొలిపి అభిషేకముతో
తేజము నింపెను వానరరాజు.

బంగరుపూల శ్వేతఛత్రము
బంగరుకాడల చామరమ్ములు
నవరత్నములు ఓషధులన్నియు
నవధాన్యములు నవ్వుచు మెరయగ

పాలు నిండిన తరుల చిగుళ్ళ
నీటబుట్టిన ముచ్చట సుమములు
అగరు చందనము-అక్షతలున్న
శ్వేతవస్త్రములు విరిసినపూలు

॥శ్రీరఘురాముని॥

అడవిపందిదగు చర్మము తెచ్చిరి
పులితోలున్నూ తీసుకవచ్చిరి
పాదరక్షలు-కాంచనమున్ను
పాలు-పెరుగు-మీగడ-తేనెయు

గసగసలున్ను-గోరోచనము
కుంకుమపువ్వు-గంధాదులును
పచ్చకర్పూరము-మణిశిల మొదలగు
మంగళవస్తు సముదాయముతో

పదునారుగురు కన్నెపిల్లలు
పరమహర్షమున రాగా నచటకు
భక్ష్యమ్ములతో-మణులు-వస్త్రముల
భూసురోత్తములు తృప్తినిండగా

శాస్త్రము చెప్పిన రీతిగ నపుడు
దర్భలుపరచిన ధరణిమీదను
అగ్నినుంచిరి పవిత్రమైన
మంత్రోచ్చారణ జరుగుచుండగా

హోమవిధిని అట మంత్రవేదులు
జరిపి తీరుగ చిత్రమాల్యముల
ప్రకాశించెడి సౌధమునందు
కనకపీఠిని తూర్పుముఖముగ

సూర్యకుమారుని కూర్చొనబెట్టి
నదీనదముల జలములు మరియు
సాగరజలము కనక కలశముల
నింపిరి అభిషేకించగ రాజుకు

॥శ్రీరఘురాముని॥

ఎద్దుకొమ్ములతో మంగళజలములు
శాస్త్రము నుడివిన రీతిగ వీరులు
మైందుడు-ద్వివిదుడు-గంధమాదనుడు
గజుడు-గవయుడు-గవాక్షుడున్న

అనిలాత్మజుడు ఆంజనేయుడు
జాంబవంతుడు-నలుడు-శరభుడు
ఇంద్రుని-వసువులు అభిషేకించుట
తలపించునటు అభిషేకించిరి.

ఆనందముగా పరిమళజలముల
అభిషేకించగ అర్కసుతుడట
అమితానందము రామాజ్ఞగను
అంగదునపుడు యువరాజుగను

అభిషేకించగ జేసెను తీరుగ
అందరు పొగడిరి ఆ సుగ్రీవుని
రామలక్ష్మణుల కీర్తించిరట
ధ్వజపతాకలు వానరులెత్తిరి

శోభలీనినది కిష్కింధాపురి
సోయగమొలికెను వానరపురిలో
శుభకర మంగళవాద్య ఘోషలు
వినిపించినవా శుభసమయములో

విష్ణువు సముడగు రామచంద్రునికి
వినిపించెను అభిషేకవార్తను
రుమతో-తారతో స్వేచ్ఛమీరగ
సురపతి విభవము సుఖములందెను.

॥ శ్రీరఘురాముని ॥

27. ప్రస్రవణాద్రిని రామలక్ష్మణులు విడిసియుండుట

రాజ్యమునందిన రవిసుతుడంతట
రామదర్శనము చేసుకు వెడలెను
రాముడు తమ్ముని వెంటనిడుకొని
రమ్యమైన ఆ పర్వతపంక్తుల

పులుల-సింహముల గర్జనమ్ముల
ఎలుగులు-కోతులు-అడవిపిల్లులు
స్వేచ్ఛగ తిరుగుచు-వివిధ లతలతో
మహావృక్షములు-తేటనీటితో

గండశిలలతో-లతాగుల్మముల
మేఘసమూహము అన్నటుతోచు
ఋష్యమూకగిరి పంక్తులలోగల
ప్రస్రవణాద్రికి బయలుదేరెను

విశాలమయిన గుహను చూచిరి
విడిదిచేయగ నిశ్చయించుకొని
వినయవిధేయత నిండిన తమ్ముని
వినుమని పలికెను రామచంద్రుడు

"ఓ సౌమిత్రీ! ఈ పర్వతగుహ
మనోహరమ్మతి విశాలమ్ముగా
ఉన్నది, తగిన గాలి వీచును
వర్షాకాలము గడిపెదమిచట

ఎత్తుగ ఎదిగిన ఈ గిరిశిఖరము
ఎఱ్ఱగ, నల్లగ, తెల్లని రంగుల
ధగధగలాడుచు వెలిగెడి శిలల
ధాతువులన్నీ మెరయుచున్నవి

॥శ్రీరఘురాముని॥

గిరిపై పారెడి సెలయేరులవి
తళతళలాడుచు పరుగిడుచున్నవి
పలువృక్షములు పొదరిండ్లున్నూ
నేత్రపర్వమై నిలచియున్నవి

జాజులు-మొల్లలు-విరగబూసెను
కదంబ-వావిలి-గోరింటలును
మద్దిచెట్లు మరి ఏరుమద్దులూ
పరిమళమ్ములను గుబాళించును

నెమళులునిండి వివిధరకముల
పక్షుల కిలకిల రావమ్ములతో
నిండెను, చేరువ తామరకొలను
విచ్చిన తామరపూలతో నిండెను

ఈశాన్యముగా పల్లమైమరి
పడమటి దిక్కున మెరకయున్నది
వాకిలి నైఋతి దిశలోనున్నది
నాయన! ఈ గుహ శ్రేష్ఠము విడిదికి

గుహవాకిటను కాటుకరంగుతో
నిడుపగు చక్కని రాయి అందమై
ఉత్తరదిశలో కాటుకరంగుతో
నిలచిన శిఖరము దిగిన మేఘమై

దక్షిణదిశలో తెల్లని ఆ గిరి
రజతాద్రివలె తేజమునిండెను
తూర్పున సంపగి-బొట్టుగుచెట్లు
కానుగ-పూగురివిందవృక్షములు.

॥శ్రీరఘురాముని॥

పొగడచెట్లు మరి ప్రబ్బలిచెట్లు
అశోకతరువులు-లొద్దుగుచెట్లు
రేలచెట్లును-చంద్రవృక్షములు
మొగలిపొదలవి మనోహరమ్ములు

చిత్రకూటగిరి ప్రక్కనపారే
గంగకు దీటయి ఈ గిరిచెంత
తూర్పుముఖముగా స్వచ్ఛములయిన
జలముతో పారెను ఈ సెలయేరు

ఏటిగట్టున దట్టములయిన
వృక్షమ్ములలో పక్షుల కిలకిల
అనురాగమ్ము అన్యోన్యముగా
చక్రవాకములు తిరుగుచుండగా

హంసలు-సారసపక్షులు నిండి
ఇసుకతిన్నెలవి సొగసుగ తేలగ
శోభగసాగెడి ఈ సెలయేరు
సారసాక్షులను తలపించునయా!

వస్త్రాభరణాలంకృత లయి మరి
నవ్వులు-కేకలు-పాటలు పాడుచు
పరుగులెత్తెడి సుందరాంగనల
తీరుగ తోచుచు సాగె సందడిగ

ఎఱ్ఱని-తెల్లని-నల్లని కలువలు
ఏటినీటిలో శోభిల్లినవి
క్రౌంచుల-నెమళుల రవములెగసెను
పక్షులు తీయగ పాడుచున్నవి.

॥శ్రీరఘురాముని॥

నదీతీరమున మునులు వసింతురు
చందనతరువులు తీర్చినిలచినవి
వరుసలో వేసిన రీతిగ మద్దులు
నిలబడి శోభను పెంచుచున్నవి

సోదర ! మనము వర్షాకాలము
ఇచట వసింతము-కిష్కింధాపురి
దాపున నున్నది మంగళవాద్యపు
ధ్వనులన్నియును వినబడుచున్నవి

వానరరాజు సూర్యనందనుడు
సతితో సకల సంపదల మీరగ
బంధులగూడి సుఖసౌఖ్యములతో
రాజ్యపాలనము చేయుచుండును''

లతాగృహములు గుహలతో నిండిన
ప్రస్రవణాద్రిని రామచంద్రుడు
విడిసియుండెను లక్ష్మణమూర్తితో
మనసున మాత్రము కలత నిండెను

సీతను మదిలో నిలపిన రాముడు
సంతసమన్నది కరువై రాముడు
శశిబింబము నట ఉదయాచలమున
చూచి శోకమున నిండిపోయెను

అన్నయెన్నడూ అంతటి దుఃఖము
ఉన్నటు కనబడనీయకపోయెను
కావున కలత చెందిన తమ్ముడు
అన్నతో పలికెను ధైర్యోక్తులను.

॥శ్రీరఘురాముని॥

"దుఃఖము వదలుము అన్నా రామా!
దుఃఖపడుటచే ఫలితము శూన్యము
నీకు తెలియని విషయము కాదిది
క్రియాశీలివి-ధార్మికమూర్తివి

ఆస్తికుడవు నువు ప్రయత్నమందు
అంతులేని అతి ఓర్పు చూపెదవు
ఈ విధి నీవు వగచుటవలన
జయాభిలాష సన్నగిల్లును

దుఃఖము వదలక క్రుంగిపోయినచో
మాయరక్కసుడు రావణాసురుని
జయించుటన్నది అసాధ్యమగును
కావున వదలుము దుఃఖము నీవిక

వనములు-గిరులు-సముద్రాలతో
నిండిన ధరణిని తలక్రిందుగను
చేయగ చాలిన శక్తిమంతుడవు
అసురుని చంపగ చాలుదువీవే

నీకు ఒకరు మరి చెప్పగవలెనా
వర్షాకాలము వేచియుండవలె
దుఃఖమువలన మేలుకలుగదు
శరదృతువుకై ఎదురుచూతము

రావణాసురుని బంధుల-మిత్రుల
త్రుంచగ చాలుదు వీవేనయ్యా!
నివురుగప్పిన నిప్పుగనుండిన
నీదు విక్రమము నిద్రలేపెద.

॥శ్రీ రఘురాముని॥

సమయము రాగా నీ విక్రమము
ఆజ్యాహుతులతో జ్వలించునట్లు-
నిదురించెడి నీ వీరత్వమును
మేలుకొలిపెదను-విజయము తథ్యము''

శుభము-హితము నిండిన పలుకులు
వినినరాముడు తమ్మునిచూచి
''మేలుకోరి నువు అనురాగముతో
వీరుడవై బోధించితివయ్యా!

సర్వకార్యముల నాశముచేసే
దుఃఖమునిపుడే వదలెదనయ్యా!
సమయమురాగా అప్రతిహతమగు
తేజము నేను ప్రదర్శించెదను

నీదు మాటల ధైర్యము చిక్కెను
తేటనీటితో నదులు పారగ
శరత్కాలము వచ్చెడివరకు
వేచియుందమా సుగ్రీవునికై

మేలు మరచిన మెచ్చరు జనులు
సత్పురుషులకది బాధాకరము''
అనగా తమ్ముడు కరములు ముడిచి
ప్రియదర్శనునితో పలికె తీరుగా

''వానరప్రభువు తీర్చును శపథము
వేచియుందము నాలుగునెలలు
ధైర్యము నుండుము రిపులగెలిచెదవు
కోపానలము నిగ్రహించుము

॥శ్రీరఘురామునికి॥

ఓరిమితో మరి నాలుగునెలలు
రిపుసంహార సంసిద్ధులమై
సింహములున్న ఈ గిరియందే
వేచియుందము-కాచుకొందము.''

28. వర్షఋతు వర్ణన

వర్షాకాలము అడుగిడె శోభగ
సోదరుగాంచి రాముడు పలికెను
''పర్వతాలవలె మేఘము లవిగో
ఆకాశమును ఆవరించినవి

రవికిరణములతో సాగరజలమును
గ్రోలిన మేఘము నవమాసములు
కార్తికముతో ఆషాఢముగా
మోసినగర్భము-వెలువరించును

నింగివరకును సోపానములుగ
నిలచిన మేఘములన్ని ఎక్కి
కొండమల్లెలు మద్దిపూలతో
భానుని పూజలు చేయగ వీలగు

సంధ్యారాగము అలుముకొన్నది
తెలుపు-ఎఱుపు కలిగిన మేఘము
నింగికి లేచిన వ్రణమునకపుడు
కట్టిన తెల్లని కట్టుగ తోచెను
॥శ్రీరఘురామని॥

మందమారుతము నిట్టూర్చినటు
సంధ్యారాగము చందన చర్చగ
తెల్లని మేఘము పొలిపోయినటు
కాంతలేని కామార్తుడు నింగి-

ఎండకు బీటలు వేసిన భూమి
వర్షధారలతో ఆవిరి విడువగ
దుఃఖమునిండి కన్నీరిడెడి
సీతగ తోచెను ఈ భూదేవి

ఓ సౌమిత్రీ ! మేఘమునుండి
బయలుదేరి మరి మొగలివాసనతో
కలువల చల్లని స్పర్శను యిచ్చెడి
మందమారుతము మనకు హాయినిడు

నిండుగ పూసిన మద్ది-మొగలుల
గుబాళింపులతో వానజల్లులతో
రిపులు వదలి అభిషేకము నందిన
అర్కసూనువలె తోచును ఈ గిరి

నల్లని మేఘము-తెల్లటి జల్లులు
హోరుగాలిలో నిలచిన గిరులు
కృష్ణాజినము-జందెముదాల్చి
వేదాధ్యయనము చేయు వటువులా !

మెరపు తీగయను బంగరుకొరడా
దెబ్బతిన్నదై-నింగిని మేఘము
వటువు బాధతో అరచినట్టుగా
ఉరుములు తోచును మేఘములందు.

॥ శ్రీరఘు తాముని ॥

లక్ష్మణమూర్తీ ! నల్లని మేఘము
మధ్య చలించే మెరపును గాంచిన
అనుపనితో తను పెనగులాడెడి
సీతగతోచును-మదిలో మెరయును

మేఘమునిండి నిలచెను నింగి
చంద్రుడు-తారలు కనబడకుండగ-
చిమ్మచీకటిగ తోచెడి సమయము
కాముకులకది ఉత్సవ సమయము

గిరినెత్తాలలో విరిసిన మల్లెలు
వర్షాకాలపు సంతోషముతో
ఆనందాశ్రుల ప్రియురాండ్రవలె
తోచెను కామోద్దీపన కలుగును

గాలి దుమారము లుండక యిపుడు
చల్లనిగాలి వీచుటవలన
వేసవి చెమట ఆగిపోవగా
హాయిగనుండును అలసట తీరును

రాజులు యుద్ధోన్ముఖులై వుండరు
స్వదేశమ్మునకు పురుషులు చేరిరి
హంసలు మానస సరసుకు పోయెను
చక్రవాకములు కామము నిండెను

వర్షముపడగ రహదారులలో
రాకపోకలు ఆగిపోయినవి
మేఘమ్ములతో కొంతకనబడు
నింగి కాననగు ప్రశాంత కడలిగ

॥శ్రీరఘురాముని॥

కొండవాగులివి గిరిధాతువులతో
పరుగిడుచుండెను కొత్తనీళ్ళతో
రాలినపూలు సొగసుగ తేలుచు
వడిగా పరుగిడె కొండచరులలో

తుమ్మెదలన్నటు నల్లగనున్న
జంబూఫలములు తీయగ తిందురు
రసాలమ్ములవి మిగల ముగ్గినవి
నేలరాలినవి రుచి చెడియున్నవి

విద్యుల్లతలవి పతాకాలయి
కొక్కెరపంక్తులు సుమహారములయి
పర్వతాలవలె కదలు మేఘములు
పోరెడి కరులై గర్జించినవి

వేడుకగాను నెమళ్లు ఆడెను
పచ్చికతోను నేల నిండెను
వాన వెలసిన అపరాహ్ణమది
రమణీయముగా తోచుచున్నది

జలభారముతో మేఘములవ్వి
సాగలేకమరి ఆగినట్టుగా
గిరుల శిరముల నిలచియున్నవి-
సాగుచున్నవి అలసట తీర్చుకు

పొందుకోరి మరి సాగు కొక్కెరలు
బారులు తీర్చి సాగుచుండగా
ఆకాశమునకు కట్టినయట్టి
తెల్లని తామర లన్నటు ఊగెను.

॥శ్రీ రఘురాముని॥

ఓ సౌమిత్రీ! లేతపచ్చికిది
నడుమ నిలచిన ఆర్ద్రిపురుగులతొ
ఎఱ్ఱని చుక్కలు దిద్దినయట్టి
శాలువ కప్పుకు యున్నటు తోచెను

పూసినపూలు ఎగసిన పులుగులు
కడలినిచేరే నదీనదములు
కామోద్రేకము నిండెను దున్నలు-
ప్రకృతి-హరినిక నిద్రపుచ్చును

మదపుటేనుగు వనమున సాగుచు
మేఘగర్జనము వినినంతటనే
పోరగవచ్చెను మరియొక కరియని
వెనుకకు తిరిగెను-తిరిగిపోరగా

నెమళుల నృత్యము కరి-ఘీంకారము
తుమ్మెద ఝుమ్మని పాటలు పాడగ
మంకెన-కదంబ-ఎన్నో పూలతొ
సోయగ మొలికెను ఈ వనమంతయు

అరపులు-చప్పుడు-కేకలు-రవములు
నాట్యము పోరుకు తలపడు కరులు
పూలసొగసులతొ మత్తుల నిండిన
పానశాలవలె తోచెను వనము

చాతకపక్షులు దప్పికనిండి
రంగులునిండిన రెక్కల ఎగిరి
సురనాయకుడు వర్షమునిడగా
నీటిము త్తెముల త్రాగెను ముదముగ.

॥శ్రీరఘురాముని॥

తంత్రీస్వనము తుమ్మెదనాదము-
కప్పల బెకబెక కంఠతాళములు-
మేఘగర్జనలు మృదంగధ్వనులయి-
సంగీతమునే పాడెను వనము

కేకలువేయుచు నాట్యమాడుచు
పురులు నిండుగా విప్పిన నెమళులు
పాటలు-నాట్యము నిండిన ఈ వని
గానసభలనే నిర్వహించెను

గట్టులు త్రెంచుకు సాగే నదులు
కాయలు-పండ్లు-పూల బరువుతో
కడలిని చేరగ సందడిచేయుచు
సాగెడి మదవతి అన్నటు తోచును

ఆకాశములో వ్రేలాడునటు
నిలచినమేఘము సంద్రపు ఘోషను
ధిక్కరించి తను భూమిని నదులను
జలముతో నింపెద నన్నటు కురిసెను

పూర్ణకుంభముల జనులందరును
అభిషేకించగ రాజులవోలె
నిలచెను గిరులు-వాసవుడిచ్చిన
మేఘములన్న జలకుంభములతో

తడిసి నిండుగా నిలచిన గిరులు
మెరిసిపోవగా పూర్తిరూపముతో
జలాభిషేకపు ఆనందముతో
ఐశ్వర్యమును చూపుచు నిలచెను.

॥శ్రీరఘురాముని॥

మెరసిపోవగా కడిగిన గిరులకు
మీదపారెడి జలప్రవాహములు
లలనామణుల ఉరమున జారిన
ముత్తెపు హారములన్నటు తోచెను

ఎత్తుగ గిరిపై పారెడిజలము
మధ్యమధ్యలో కొండరాళ్ళవి
అడ్డు తగులగా చెల్లాచెదరయి
నీటిముత్తెపు మాలలయినవి

గూటికిచేరిన పక్షులబట్టి
ముకుళిత కమలము లుండగచూచి
సూర్యాస్తమయము అగునని తోచును
ప్రకృతిసుందరి నిదురలో జారును

దండయాత్రలు ఆగిపోయినవి
దండు దారిలో నిలచిపోయినది
ధరణీసురులు సామగానము లు
దండిగచేసే భాద్రపదమిది

కోసలభూపతి భరతుడు ఇపుడు
సంబారములను సమకూర్చుకొని
గృహకృత్యములు ప్రక్కకునెట్టి
నియమముతో తను గడుపుచుండును

బహుకాలమ్ముగ దొర్లిన పిదప
నన్నుగాంచిన కోసల ప్రజలు
చేసెడి కోలాహలముగ తోచుచు
సరయూ పారును అతివేగముగ.

॥ శ్రీరఘురాముని ॥

సోదర ! వానరరాజై మిత్రుడు
రాజ్యభోగము అనుభవించుచు
రాజ్యమునేలుచు సుఖముగ నుండెను
భార్యదూరమై బ్రతుకుచుంటిని

గొప్పరాజ్యము చేతికిరాక
ఛాయగనుండెడి సుదతి లేకను
నీటికోతకు తెగిన గట్టువలె
దీనుడనై నే నించియుంటిని

వర్షాకాలము గడుపగ కష్టము
కష్టము కద్దరి కనబడకున్నది
రావణాసురుడు అసాధ్యుడయ్యేను
ఎటుల దొరకును మనసుకు శాంతి

వర్షాకాలము వెదుకుట కష్టము
త్రోవలు తిన్నగ సాగనీయవు
కావున నేనే అర్కసుతునితో
ఆగమంటి నీ నాల్గుమాసములు

చాలాకాలము ఇడుములబడెను
అందెను వానరరాజ్యము యిపుడే
నా పని ముఖ్యము అనగా తగదు-
మిత్రుని సుఖము తలచితి మదిలో

నా ఉపకారము మరువడు అతడు
సందేహము నే పడగా తగదు
అదనుకోసమై వేచియుందము
అతని అనుగ్రహ మందగవలెను.

॥శ్రీరఘురాముని॥

వీరుడు తిరిగి ప్రత్యుపకారము
చేయగచాలును-మరి కృతఘ్నుడు
మేలుమరచును మనసులేకను
మంచిమనసులను వ్యథలో ముంచును''

అనిన రామునితో వినయమునిండి
పలికెను అపుడు సుమిత్ర తనయుడు
''అన్నా ! మానవనాథుడ వీవు
మహావీరుడవు మంచికి నెలవు

వానరరాజు మాట నిలుపుకొని
మంచిమనసుతో అండగనిలచును
కోరిక తీరును జయము తథ్యము
వేచియుండవలె శరదృతువుకై.''

॥శ్రీ రఘురామ॥

29. మారుతి సుగ్రీవునికి కర్తవ్యము బోధించుట.

మెరుపులు-మబ్బులు నింగినివదలెను
వర్షాకాలము వెనుకకు మరలెను
చంద్రుని వెన్నెల అతిరమణీయము
శారద రాత్రులు శోభగ విరిసెను.

సుగ్రీవుడు అతి సంతోషముతో
భోగలాలసుడు అయిపడి వుండెను
రాచకార్యములు మంత్రులవేసని
అహోరాత్రములు సుఖముల మునిగెను.

కామకేళిలో కరగి పోవుచు
భామలందరిని చెంత చేర్చుకు
సోమపానమున సర్వము మరువగ-
హితముకోరి హనుమంతుడు పలికెను

మాటనేర్పరి పనిలో మెలకువ
మంచి చెడ్డల వివరము తెలిసిన
మంచినమ్మకము రాజుయందు గల
మంచి మంత్రి తా పలికె ఓపగ

''వానరరాజా! రాజ్యభోగములు
కీర్తి ప్రతిష్ఠలు దొరకెను నీకు
మిత్రుని కార్యము మిగిలి యున్నది
సమయము మించక చేయగవలెను.

మిత్రులను, మరి సైన్యమ్ములను
ధనాగారము ప్రాణప్రదముగ
చూచుకు ఏలెడి-రాజు రాజ్యము
అమితముగా అభివృద్ధి నందును

సకాలమ్ములో మిత్రుని కార్యము
చేయకపోయిన కలుగుననర్థము-
సదాచారుడవు పుణ్యకార్యములు
చేయుటయందే గురికలవాడవు.

సమయము దాటిన చేసిన మంచి
వ్యర్థము అగునని తెలియుము నీవు
వీరుడ వీవు వైదేహిని ఇక
వెదకుట యున్నది మిత్రుని కార్యము.

॥శ్రీరఘురాముని॥

కాలాతీతము అయిపోయినది
రాముడు సర్వము తెలిసినవాడు
ఎంత ఆతురత మనసున నున్నను
ఎదుటివాని మది ననుసరించును.

అప్పుడు రాముడు ఆర్తరక్షకుడు
అప్రతిహతమగు పౌరుషవంతుడు
అనిన మాటకై ఎన్ని కష్టములో
అన్ని గెలుచును ఆ రఘురాముడు.

అడగకముందే రాముని కార్యము
అతి మెలకువగా ఆరంభించిన
అంటదు దోషము అందుకు నీవు
ఆజ్ఞాపించుము వానరవీరుల

అడగకముందే సాయము చేసే
అంతటి గొప్ప గుణముల వాడవు
నీవే సాయము ముందుగ పొందియు
ఆలసించితివి ఏల కపీంద్రా ?

వానర సేనలు భల్లూకములకు
నాథుడవీవు కిష్కింధాపతి !
రామకార్యమును నెరవేర్చగల
సామర్థ్యము నీకున్నది రాజా !

కోదండముతో శ్రీరఘురాముడు
సురాసురులను మహోరగులను
ఎదిరి గెలువగ చాలినవాడు
అమితశక్తిగల అతిసమర్థుడు.

॥శ్రీరఘురాముని॥

నీ ప్రతినను నువు నెరవేర్చెదవని
సీతే వదలి చూచుచుండెను
నీకొరకై తను వాలిని కూల్చి
నీ సుఖసౌఖ్యము ముందుగ చూచెను.

వాలి - రామునికి శత్రువుకాడు
నీ సంతోషము కోరి చంపెను
భూమ్యాకాశములందున వెదకి
సీతాదేవి జాడ తెలియుము.

దేవాసురులకు మరుద్గణములకు
భయపడడయ్యా రామచంద్రుడు,
అంతటివానికి అసురులు లెక్కా!
ఆదరించె నిను, అతివిక్రముడు.

రాముని నీవు సంతసపరచుము
ఆనతి నిమ్ము-మాలో వీరులు
ఆకాశములో పాతాళములో
సంద్రములోనూ వెదుక సమర్థులు.

సాహసవంతులు వెనుకడుగిడరు
భయము నెరుగని అతి గుణవంతులు
కోట్లకుపైన నీ సేవలలో
వేచియుండిరి ఆనతి కొరకై

నీ విచ్చటనే నిలబడి వారిని
ఆజ్ఞాపించుము-నీ విధేయుల
శక్తికి తగినటు పురమాయించుము
పుణ్యపురుషుని కార్యము తీర్చుము.''

॥శ్రీరఘురాముని॥

సందర్భముగా మంచి సమయమున
స్నేహితునిగ మరి సచివోత్తమునిగ
స్నేహమునందిన రాముని కార్యము
చేయగ చెప్పెను ఆంజనేయుడు

వానరరాజు సంతసమందెను
నీలుని అచటకు రావించుకొని
రామ కార్యము నెరవేర్చుటకు
అమిత సైన్యమును సమకూర్చమనె.

"నా ఆనతిగా అన్ని దిక్కులలో
కపినాయకులను-వీరులందరిని
శీఘ్రముగా నువు రప్పించవలె
ఉత్సాహవంతుల సేకరించుము

సేనలు కలిసి పోకుండగను
తికమక పడక తెలివితోనుండగ
వారందరు యిట వచ్చినంతనే
కాగల కార్యము నీపై నున్నది.

నేటినుండి ఒక పక్షము రోజులు
గడువు లోపల వానరులందరు
సేనలో చేరగ ప్రకటన చేయుము
సుగ్రీవాజ్ఞ మీరగవలదను

ఆనతి మీరిన మరణ దండనే-
అందుకు తిరిగి విచారణ లేదు
ఇది నా నిర్ణయమన్నది తెలియుము
అదియే తెలుపుము వీరులందరికి.

॥శ్రీరఘురాముని॥

అంగదునిపుడే వెంటనిడుకొని
జ్ఞానవృద్ధులు వయోవృద్ధులగు
కపివీరులకు వినయము నిండి
తెలియజెప్పుము ఈ విషయము'' అని

అర్కసుతుడు తానాజ్ఞాపించి
అంతఃపురమున అడుగుబెట్టెను-
ఆంజనేయుని ఆనందముగా
అంగదాదులు పొగడిరి అపుడు.

॥శ్రీ రఘురామునిః॥

30. శరత్కాల వర్ణన - సుగ్రీవునిపై శ్రీరాముడు కోపించుట.

వర్షాకాలము సాగిపోయెను
నిర్ణయించిన గడువు తీరెను
నింగినంతటను వెండి పూసినటు
వెన్నెల చల్లగ ఆవరించెను.

హేమధాతువుల శోభగవెలిగే
గిరి శిఖరముపై రాముడు కూర్చొనె-
తలపుల నిండెను ధరణీనందన
దుఃఖము ఎగసెను రామచంద్రునికి.

''నా ప్రియురాలు బాలామణి తను
సారసపక్షుల స్వరముతో పలుకును
ఆడుకొనును ఆ పక్షులతోను
ఏ విధినున్నదో ఆ రమణీమణి

బంగరు రంగు పూలు పూసిన
వేగిస చెట్లను చూచి మురియును-
వేగిసపూలను చూచి వెదకును
నే కనబడక దుఃఖము నిండును.

కలహంసధ్వని మేలుకొలుపులై
కలభాషిణి తను నిద్రలేచును
కళకళలాడే సుందర వదన
కనులు విప్పి మరి ఏ ధ్వని వినునో ?

ఆ పద్మాక్షి నా ప్రియురాలు
చక్రవాకముల ధ్వని వినినంతనె
ముదముగ నన్ను చేరుచుండెను
నే దరిలేక ఏ విధి నున్నదో ?

ధరణీనందన నా దరిలేనిచో
ధరణిసోయగము మదిలో చేరక
ప్రకృతి శోభల మనసు నిలువక
సుఖసంతోషములన్నవి లేవు.

కాముడు వదలడు ఆ సుకుమారిని
కాంతలేక మరి శాంతియె లేదు''
వర్షధారకై చాతక పక్షిగ
విలపించెను అట రామచంద్రుడు

గిరినెత్తాలలో పండిన ఫలములు
అన్న సేవకై తేగా పోయిన
సుమిత్ర తనయుడు తిరిగి వచ్చెను
అన్న దుఃఖమును తాను గ్రహించెను.

వినయముగా హితబోధ చేసెను
''వీరుని ధైర్యము నిలబెట్టుటకై -
అన్నా ! నీవు కామవశుడవై
ధైర్యము విడచుట తగదిది వినుమా !

॥శ్రీరఘురామా॥

కార్యసిద్ధికై వలయు యత్నము
చేతము, మనసు చెదరనీయకు
జయమునందెడి మార్గమునరయుము
ధైర్యము నీవు అవలంభించుము

సాయపడెడి సుగ్రీవుని శక్తిని
సామర్థ్యమును ఆలోచించుము
అతని పనికి నువు చూపినశక్తిని
స్వకార్యసిద్ధికి వినియోగించుము

మానవనాధుడవయ్యా రామా !
మాననీయుడవు మహావీరుడవు
మాతకు నీవే సర్వముగాదా
మరియొకవ్యక్తికి తాకగ వశమా !

అగ్నిహోత్రమే సీతామాత-
ఆమెను తాకిన నాశనమగుదురు
ఆలోచించుము అన్నారామా !''
అని నిర్భయముగ పలికెను తమ్ముడు

సమయోచితము సందర్భముగ
ధర్మార్థమును సాంత్వయుక్తముగ
రాజనీతితో తమ్ముడు పలుకగ
రాముడు పలికెను లక్ష్మణమూర్తితో

''సోదర ! నీవు నుడివినయటుల
కార్యసిద్ధికై యోచనకావలె
ఉత్సాహాదులు అవసరమైనవి
ఫలమునెంచని క్రియకావలయును''

॥శ్రీరఘురాముని॥

అనుచుపలుకగా అవనిజ-మదిలో
మరి మరి మెదలి మాటలు పెగలక
ఎంతో వేదన నిండిన రాముడు
పలికెను తిరిగి లక్ష్మణమూర్తితో

"సురనాయకుడు వర్షధారలతో
ఈ వసుంధరను సంతసపరచెను
సస్యసంపదకు ప్రాణముపోసెను
సకలశుభములు చేకూర్చెనయా!

నల్లని మేఘము గంభీరముగా
గిరిశిఖరముల వృక్షాగ్రముల
సంచరించి మరి మురిసికురిసి-ఇక
అలసిపోయినటు అగపడుచున్నది

మేఘగర్జనలు కరిఘీంకారము
నెమళుల కేకారావములన్నియు
జలజల జారే సెలయేరులయు
ధ్వనులన్నియును ఆగిపోయినవి

జలములకడిగిన ధగధగమెరిసే
పర్వతసానువులన్నియు కూడ
కుంకుమ, సుగంధ ద్రవ్యములన్నియు
పూసుకొన్నటు శోభగనున్నవి

శరదృతువు తన విభవమునంతయు
ఏడాకులుగల అరటిచెట్లకు-
తారాచంద్రులు-కర్మసాక్షికి
మదకరీంద్రముల కందించెనయా!

॥శ్రీరఘురాముని॥

ఏడాకులుగల కదళీ తరువులు
విరగ పూయగా వెడలు సుగంధము
తుమ్మెదపాటకు శ్రుతి చేసినది
మదపుటేనుగులు పరవశించెను

ఇసుకతిన్నెల చక్రవాకములు
రెక్కల శోభగ పుప్పొడి నిండగ
మదనుని శరముల బారిపడినవి
హంసలు వాటితో ముదముగనాడెను

మదించి తిరిగెడి కరీంద్రములపై
గర్వించెడి ఆబోతులపైనను
తేటనీటితో పారు నదులపై
శరల్లక్ష్మి తను శోభిలుచున్నది

నింగిని మేఘము లగపడకున్నవి
నెమళుల కోలాహలమది తగ్గెను
నిండుగపూసి, వంగిన వేగిస
నయనానందము కూర్చుచున్నది

అరటి పూవుల వాసన మత్తుతో
మదజలమ్ములు కారె దంతులకు-
పెంటి ఏనుగుల చేరి వనముల
తామరకొలనుల చేరగసాగెను

వర్షములవ్వి వెనుకడుగిడగా
ఆకసమిపుడు తళతళలాడుచు
తోమిన ఆయుధమన్నటు మెరసెను
శుభ్రజలములతో నదులు నిండెను

॥శ్రీరఘురాముని॥

ఎఱ్ఱనికలువల చల్లని గాలులు-
దిక్కులు చక్కగ కనబడుచున్నవి
సూర్యకిరణముల ఎండిననేల
నెఱియలు విచ్చి కనబడుచున్నది

రాజులు సేనతో కదలుచుండిరి
కయ్యానికి మరి కాలుదువ్వుతూ-
ఆబోతు రంకెలు వినబడుచున్నవి
ఆలమందలో జొరబడుచున్నవి

కేకి పింఛమును వదలివేయగా
ఆభరణమ్ములు పోయినట్లయి
నదీతీరమున చేరిన వాటిని
హంసలు హేళన చేయుచున్నవి

ఆవుల అంబారవములు ఎగసెను
మదపుటేనుగులు సాగె మందముగ
పెంటి ఏనుగులు వెదకుచు సాగెను
బెగ్గురుపక్షులు కూసె శ్రావ్యముగ

సెలయేటి స్వనములు సన్నగిల్లినవి
ధ్వనితో వీచే గాలులు తగ్గెను
మహానదులకు ఉరవడి తగ్గెను
కప్పల బెకబెక వినపడకున్నది

వర్షకాలమున బిలముల దాగిన
విషసర్పములవి బయటపడినవి
వివిధవన్నెలతో విహరించుటకై
వడివడిగానవి సాగుచున్నవి

॥శ్రీరఘురాముని॥

సాయంసంధ్యాసుందరి నెంతో
ఒడుపుగచంద్రుడు తన కరములతో
పట్టుకొనగను విరిసినతారల
కనుపాపలతో - ఎఱ్ఱనికాంతితొ

ఇనుమడించిన అనురాగముతో
నింగి అనెడి తన చీరను తానే
విప్పివేయుచు నున్నటు తోచగ -
నాయకి - నాయక భావన నింపెను

ఉదయచంద్రుడు ముఖబింబమయి -
తారలు తెరచిన కన్నులు కాగా -
వెన్నెల వెలుగు తెల్లని చీరగ --
నిశాకాంత తను శోభిలుచున్నది

బెగ్గురు పక్షులు పండిన గింజల
పొట్టనింపుకొని నింగికి ఎగరగ
పూలమాలలవి ఆకాశమునకు
విసరినట్టుగా శోభిలుచున్నవి

తెల్లని కలువలు - నిదురిడు హంసలు
నిండిన గొప్ప తటాకములన్నియు
మబ్బులులేక తారాచంద్రులు
నిండిన నింగిగ తేజరిల్లెను

మెులనూలన్నటు హంసలు మెరయగ
కలువలు - తామరపూలు దండలై
చక్కని కోనేళ్ళన్నియు కూడ
అలంకారముల అంగనలాయెను

॥శ్రీరఘురాముని॥

వెదురు పొదలతో విరిసిన నాదము
ఆవుల అంబారవములన్నియు
ఆబోతు రంకెలు కలసి అచ్చట
సహజమైన సంగీతము నింపెను

నదీతీరముల నిండుగ పూసిన
రెల్లుపొదలను మందమారుతము
కదుపగ, తెల్లని పట్టు చీరలను
కట్టిన స్త్రీ జఘనమ్ముల పోలెను

మధుపానముతో మత్తునిండినవి
జంటకూడిన తుమ్మెదలన్నియు
పుప్పొడినిండి గౌరవర్ణముతో
గాలిలో తేలుచు పోవుచున్నవి

నదులు-చేపలను వడ్డాణముతో
స్త్రీలై రాతిరి సుఖముల తేలి
ప్రాతఃకాలము కాగా గృహముల
చేరుచున్నటు మెల్లగ సాగెను

విరగబూసినవి వివిధ తరువులు
పూవిలుకాడు స్వేచ్ఛగ తిరిగెను
పక్షులు ముదముగ విహరించగను
మధురమైన ధ్వని వినపడుచున్నది

సౌమ్యుడ వినుము! రాజపుత్రుడవు
పాత వైరములు పైకి త్రవ్వుకొని
రాజులు రణముకు సుముఖులుకాగా
యుద్ధప్రయత్నము చేయుచుండిరి

॥శ్రీరఘురాముని॥

మిత్రుడు యత్నము చేసెడి ఛాయలు
కనబడకున్నవి వర్షాకాలము
నాలుగు నెలలవి నూరు ఏండ్లుగా
సీతనుగానక కుములుచుంటిని

చక్రవాకి తన జంట విడువనటు
సీతకూడ నావెంట వచ్చినది
దుర్గమదండకవనికి జనకజ
వనవిహారముగ బయలుదేరెను

లక్ష్మణమూర్తీ! రాజ్యములేకను
దేశమువదలి అడవులయందు
భార్యలేక నే దుఃఖమునుండగ
దయరాకున్నది వానరపతికి

శరణుజొచ్చితిని అసహాయుడను
అని, అవమానము చేయగ తలచెనో!
తన పని తీరగ తానుగ చేసిన
ప్రతిన మరచెనో దుర్మతి అతడు

సోదర నీవు కిష్కింధకు పో!
సుఖములతేలే అర్కసుతునిగని
చెప్పుము వానితొ నా మాటలుగా
ప్రతిన తీర్చుటది కర్తవ్యము అను

పుణ్యముగానీ పాపముగానీ
మాటకు నిలచినవాడే వీరుడు
పురుషోత్తముడగు ప్రతిన నిలపిన
పురుషాధముడగు ప్రతిన మరచిన

॥శ్రీరఘురామునీ॥

తన పనితీరి ప్రత్యుపకారము
తలచనివాడు కృతఘ్నుడగును
అట్టి కృతఘ్నుడు మరణించినచో
కుక్కలు-నక్కలు ముట్టవు కట్టెను

తమ్ముడ ! చెప్పుము సుగ్రీవునితో
బంగరు తొడుగుతొ మెరపుతీగలా
మెరిసే ధనుసును పోరాటములో
ఎక్కుపెట్టగా చూడగ తలచెనొ ?

కోపముతో నే నారి ధ్వనించగ
పిడుగుల సవ్వడి వినవలెననియా ?
నా ప్రతాపము తిరుగ తెలిసియు
నీ సహాయము నాకు కలదని

సర్వము తెలిసియు త్వరపడడేమి?
తన పని తీరిన దనుకొన్నాడా?
సీతాన్వేషణ సంకేతమును
చేసికొంటిమని గుర్తే లేదా ?

వాలినిచంపి వానరరాజ్యము
వానికిచ్చిన విషయము మరచెన ?
అంతఃపురమున అందములందు
మత్తులొ మునిగి తేలుచుండెను

నాలుగునెలలు గడచిపోయినటు
తెలియకపోయెను స్పృహ లేదతనికి
పానమత్తతను స్త్రీలోలుడు అయి
దైన్యమునున్న, నను కనకుండెను
॥శ్రీరఘురాముని ॥

ఓ బలవంతా! నా కోపమును
తెలియజెప్పుము మరియొకమాట
చెప్పుము వానితో వాలి సాగిన
మార్గముతెరిచే వున్నది వినుమని

వాలి సాగిన మార్గమునింకా
మూసివేయనే లేదని చెప్పుము
ఆ దారిని మరి అడుగిడవద్దను
ఒక్క బాణమే వాలిని గొనెనను

ప్రతినతీర్చగా ముందుకురమ్మను
ప్రత్యుపకారము చేయగ రెమ్మను
ప్రతిన తప్పినచొ సబాంధవముగా
వానిని చంపుట ప్రతినని తెలుపుము

మన స్థితి నీకు తెలియును సోదర!
మనకు మేలు మరి కలిగెడి తీరుగ
మనమేవిధి మాటాడుట మేలో
మంచిచెడ్డలు తెలిసి పలుకుము

కాలాతీతము జరుగుచున్నది
ఆలసించకు త్వరగా పోవలె
వానితో చెప్పుము ఓ సౌమిత్రీ!
ప్రతినకు నిలబడి ధర్మము నెరపగ

శాశ్వతమైన ధర్మము తెలిపి
సత్యమునకు మరి బద్ధుడవగుమను
అటుగాకున్నను వాడిబాణమున
అన్నవాలిని చూచెదవనుము

॥శ్రీరఘురాముని॥

యమసదనమునకు పోవలదనుము
సీతను వెదకుట కర్తవ్యమను."
అనుచు రాముడు కోపముతోను
దుఃఖమునిండి పలుకుట వినెను

అన్న మాటలు వినిన సోదరుడు
ఉన్న వేదన తీరుగ తెలిసెను
అన్నను చూచుచు ఆ పరాక్రముడు
అన్నియు తిరిగి యోచన చేసెను

31. సౌమిత్రి కోపము

"రాముని స్నేహము భోగములిడినది
అని సుగ్రీవుడు తలచకయుండెను
రాజ్యసుఖములు నాశనమైనచో
బుద్ధి స్మరించును రామనామమును"

అనుచు లక్ష్మణుడు కోపమునిండి
"మేలుమరచి మరి తుచ్ఛసుఖముల
మునిగియున్న ఆ కోతిరాజును
వాలి పోయిన త్రోవలో పంపెద

అన్నా! నేనిక జాగుచేయను
అర్కసుతుని మరి చంపెదనిపుడే
అంగదుడుండెను వదినను వెదుకగ
ఆనతి నిడును తన కపిసేనకు"

సామర్థ్యముగల వీరునిగాంచి
యుద్ధోన్ముఖుడై యుండుటగాంచి
రామచంద్రుడు శాంతవచనముల
"మిత్రుని వధ మరి పాపము అగును

॥శ్రీరఘురాముని॥

కోపమునెవడు వివేకమ్ముతో
కాల్చగ చాలునొ అతడుత్తముడు
ధన్యుడు ఆతడు-సద్గుణయుతుడవు
కావున మిత్రుని చంపుట తగదు

నే కోపముతో నుడివినవన్నియు
పరమార్థముగా నెంచకుమయ్యా!
మెత్తనిమాటల మెల్లగ చెప్పుము''
అనగా తమ్ముడు కొంత శాంతముతో

ఇంద్రధనుసుతో సరిపడు విల్లు
శిఖరములుండిన మందరమన్నటు-
ప్రళయకాలమున యముని తీరుగ
భాసిలెనచట సుమిత్రసుతుడు

అన్నమాటలు అనెడి మాటలు
మదిలో తలచి సురగురు సముడు
వడిగా నడచుచు చెట్లను కూల్చుచు
రాళ్ళను పొడిపొడి చేయుచు సాగగ

మదకరీంద్రమును తలపించుచును
రామకోపమను అగ్ని ఆతడై
భయంకరమగు వడగాడుపుగా
వడిగా సాగెను లక్ష్మణమూర్తి

చిక్కని కొండల నడుమనఉన్న
కిష్కింధాపురి గాంచినవాడై
సుగ్రీవునిపై కలిగిన కోపము
పెదవులపైన అదరుచుండగా

॥శ్రీరఘురాముని॥

నడిచే గిరివలె వచ్చు మనిషిని
గాంచిన కోతులు తరుల గిరులను
ఎత్తుకురాగా కోపము హెచ్చి
చూపులవారిని దహించుచుండగ

యముడే ఇటుగా వచ్చెననుచును
భయపడి పరుగిడ కొందరు వీరులు-
లక్ష్మణమూర్తిని తెలిసిన కొందరు
ఉగ్రమూర్తిగా వచ్చెను అనుచు

విషయము చెప్పగ వానరరాజుకు
మత్తులోనుండగ తలకెక్కదయె-
సచివుల ఆనతినందిన వీరులు
గిరి-మేఘములు-కరిబలసములగు

పది ఏనుగులు వంద ఏనుగులు
పదివేల దంతుల బలము గలిగిన
పులులవంటి పరాక్రమవంతులు
శిలలు-తరులతో అగడ్త కాచిరి

అన్నబాధ, హృది కలచివేయగా
అర్కసుతునిపై అమితకోపమున
అడుగులువేసెను వేడి నిట్టూర్పుల-
అతని కన్నులవి జ్యోతులాయెను

పొగతో కూడిన అగ్నిహోత్రమన
శరము మ్రులికికొన-కోరగ మెరయ
ధనుసే శిరసై-తేజము విషమై
ఐదు తలలుగల పన్నగ మాయెను

॥శ్రీరఘురాముని॥

ప్రళయకాలమున అగ్నియన్నటు
పన్నగమన్నటు ఋసలను కొట్టుచు
ఆగ్రహించిన లక్ష్మణమూర్తిని
అంగదుడపుడు చేరగ భయపడ

లక్ష్మణమూర్తి, అంగదుగాంచి
మంచి మాటలతో పలికె ప్రియముగ
''నీ పినతండ్రికి తెలుపుము నీవు
లక్ష్మణుడిటకు వచ్చినాడని

అన్న దుఃఖమును చూడలేకను
శత్రుభీకరుడు లక్ష్మణమూర్తి
వచ్చినిలచెను ద్వారము వెలుపల
వీలగు రీతిని ఆచరించమను

ఏమి చెప్పునో నీ పినతండ్రి
నాకు చెప్పుము త్వరగా రావలె''
అనిన మాటలకు శోకభయములతో
తారకు-రుమకు తీరుగ చెప్పెను

స్పృహలోలేని సుగ్రీవునకు
వినబడకున్నది విషయమేమియు
లక్ష్మణమూర్తిని గాంచిన కపులు
భయముతో కిచకిచ అరచి లేపగా

మెల్లగలేచెను కిష్కింధాపతి
ఎఱ్ఱని కన్నుల మత్తు నిండెను
మెడను హారములు చిక్కుపడినవి
అంగదు పలుకులు చెవికెక్కినవి

॥శ్రీరఘురాముని॥

ప్రభువుకు ఇష్టము అయిన మిత్రులు
ప్లక్ష-ప్రభావులు అను కపివీరులు
రాజుకు హితము, మేలు కోరుచు
పలికిరి "రాజా! దశరథ తనయులు

సోదరులిద్దరు నీకి భోగము
అమరగ చేసిన అరి భయంకరులు
భూమినెల్ల పాలించగ యోగ్యులు
సత్యవర్తులు పుణ్యాత్ములగు

వారిలో లక్ష్మణుడనెడి వీరుడు
విల్లు ధరించి వచ్చెను యిటకు
వానిని గాంచిన వానరులందరు
వణకిపోపుచు పరుగిడుచుండిరి

ఒంటరిగా మరి వచ్చెనెట్టులన-
పగసాధించే దృఢనిశ్చయమను
రథమునుఎక్కి-రాముని వాక్యము
సారథికాగా తృటిలో చేరెను

చూపుల కాల్చుచునున్నాడీ పురి
చేవగలిగిన పురుషోత్తముడు
చేరుము బంధుల హితులందరితో
క్షమించ వేడుము పదముల వ్రాలి

ధర్మమూర్తియగు రామచంద్రుని
మాటప్రకారము నడువుము నీవు
మాట నిలుపుకొను సత్యవర్తియని
మాట గెలుచుకో విను మారాజా!".

॥శ్రీరఘురాముని॥

32. సుగ్రీవునికి మారుతి హితోపదేశము

మనసు కెక్కినది మత్తు జారినది
వణకుచు నిలచి "నేనెప్పుడును
వారికి కీడు తలచనైలేదు
విరోధులెవరో కల్పించినదిది

వాని మనసును తెలిసి మసలవలె
భయపడ నేను దాశరథులకు
వ్యాకులమేమన, నా ప్రియమిత్రుడు
అకారణమ్ముగ కోపించెనని

మిత్రుల చేపట్టు సులభమైనది
మైత్రి నిలుపుటది కష్టమైనది
చంచలమైనది మనస్సు గనుక
చిన్నవిషయముల మైత్రి చెడునుగద

నాకీ సాయము రాముడు చేసెను
నే నే ప్రత్యుపకారము చేతును
తలచుకొన్నచో భయము కలుగును
నా రాముని దయ నేనెటు మరతును?"

అంతట మారుతి-మంత్రిసత్తముడు
పలికెను "రాజా ! రాముని సాయము
మదిలో తలచి పొంగుటమేలు
ఇంద్రసమానుని వాలిని చంపెను

నీకు హితమును కూర్చుటకొరకై
నెయ్యము విడువని కోపమునిండి
పంపెను తమ్ముని-గుర్తుచేయుటకు
మత్తులోనున్న నిను మేల్కొలుపగ

॥శ్రీరఘురామ॥

వర్షాకాలము సాగిపోయెను
శరదృతువు తను శోభిలుచున్నది
గడువు పూర్తిగా దాటిపోయినది
యుద్ధప్రయత్నము చేయు కాలమిది

నీవు స్వయముగా పోకపోతివి
వారి మనసును తెలియకపోతివి
మత్తునిగా నిను వారు గ్రహించిరి
హెచ్చరించగా వచ్చె లక్ష్మణుడు

సతి అపహరణతో దుఃఖిలు రాముడు
అన్న బాధతో జ్వలించు తమ్ముడు
కఠినముగా మరి మాటాడినను
ఎదిరి నీవు మరి పలుకుట తగదు

దోషము నీవు చేసితివయ్యా!
దోషహరణకై కరుణ కలుగగ
చేతులు రెండును జోడించుమయా
అదియే చక్కని మార్గము రాజా!

కోపమునిండి నిలచిన రాముడు
కోదండముతో-సురాసురులతో
నిండి వెలుగు-ఈ జగతినంతను
నిలపగ చాలును, తన వశమ్మున

మెత్తని మనసు రామచంద్రునిది
మ్రొక్కిన నీపై మరి కోపించున ?
పుత్రులు-మిత్రుల నందరజేర్చుకు
జేరుము రాముని పాదసన్నిధికి.

॥శ్రీరఘురామున్ని॥

భర్తచెంతకు జేరు భార్యగను
భక్తిప్రపత్తుల నిలువుము సన్నిధి
నీ ప్రమాణము నిలుపుము అచట
నీ హితమును నే కోరి నుడివితిని

రామలక్ష్మణుల ఆజ్ఞను మీరగ
మదిలోనైనా తలచకు రాజా!
ఇంద్రసమానుడు తమ్ముని కూడిన
రాముని బలమది నీకు తెలియదా?

33. లక్ష్మణుని ఆగ్రహము-తార సమాధానము

అంతఃపురమున ఆలోచనలు
సాగుచుండగా అంగదునంపి
లక్ష్మణమూర్తిని గొని రమ్మనగా
అడుగిడె గుహలో రామానుజుడు

విక్రములైన ద్వారపాలకులు
కరములు మోడ్చి నిలుచునియుండిరి
రత్నశోభతో దివ్యసుమములు
ఉద్యానములతొ సౌధరాజముల

అగరు-చందన-పద్మసుగంధము
మైరేయమ్ముల మధువాసనలు
తీర్చినబాటలు సెలయేరులతో
వెలయు నగరమున-వివిధ సౌధములు

అంగదు గృహము-మైందుని సదనము
గజ-ద్వివిద-గవాక్ష-శరభ
విద్యున్మాలి-సంపాతి నిలయములు-
ఆంజనేయుని హర్మ్యముగాంచెను.

॥శ్రీరఘురాముని॥

వీరబాహు-సుబాహు సదనముల
సూర్యాక్ష తార-సుషేణు గృహముల
నలుడు-నీలుడు-కుముదుని గృహము
జాంబవంతుని సౌధముగాంచెను

దధివక్త్రి-సునేత్ర-సుపాటులుండెడి
గృహములన్నియు నిలచియుండెను
తెల్లని మబ్బులవలె తేజముతో
ధనధాన్యములు, స్త్రీ జనములతో

శోభిలుచుండెడి సౌధములన్ని
కోపమునిండిన చూపులతోను
వేగముగా తను నడచుచు చూచెను
కపినాయకుని గృహమును గాంచెను

తెల్లని ప్రాకారముతో చుట్టి
రమ్యమైనది-సురనాయకుని
సౌధముతో మరి సమానమైనది
కైలాసమువలె తెల్లగ మెరసే

వాసవుడొసగిన వృక్షమ్ములతో
కోరిన ఫలముల నిచ్చు తరువులు
సౌఖ్యమునింపి-తేజము గలిగిన
మేలిమి బంగరు తల వాకిలితో

సురసంబంధపు సుమహారములతో
ఆయుధధారుల రక్షణనున్న
అర్కసుతుని గృహమచ్చట గాంచెను
రవి ఆకసమున సాగినట్లుగా-

॥శ్రీరఘురాముని॥

ఏడు కక్ష్యలను దాటి నడచెను
బంగరు, వెండి పొన్పు వరుసలను
మేలు తివాసులు రత్నకంబళులు
పరచిన అంతఃపురమును గాంచెను

వయసు పొంగుతో సౌందర్యముతో
అలంకారముల ఉత్తమాంగనలు
వీణకు సరిపడు చక్కని స్వరములు
రత్నాంబరముల వెలుగగ గాంచెను

సుందరవదనల అందెల రవళులు
తరుణుల వడ్డాణపు సవ్వడులు
వినిన లక్ష్మణుడు సిగ్గు, క్రోధముల
అల్లె త్రాటిని ధ్వనింపజేసెను

రామతాపమును తాను పొందుచు
రమణులులేని స్థలమున నిలచెను-
అల్లెత్రాటిధ్వని విని సుగ్రీవుడు
వణకెను, వచ్చెను లక్ష్మణుడసుకొని

అంగదుడంతట తెలుపగ రాజుకు
తారతో పలికెను కిష్కింధాపతి
"మెత్తని మనసు లక్ష్మణమూర్తిది
క్రోధకారణము నరయుము నీవు

మన దోషమును తెలియుము నీవు
కారణముకుల తెలియకపోయిన
మంచిమాటలతో కోపము తీర్చి
ఆదరమొలకగ చేయుము నీవు.

॥శ్రీరఘురాముని॥

కపటమెరుగని శుద్ధమనస్కుడు
కోపించడు, నువు నిరపరాధివి
మహాత్ములెపుడును స్త్రీల విషయముల
క్రూరత్వమును చూపరు నిజము''-

పతి పలుకులు విని తారాసుందరి
పడకనుండి తను లేచి భయముతో
సుఖముల తేలిన దేహముతోను
మెల్లగ నడచుచు లక్ష్మణు గాంచెను

వచ్చెడి వనితను గాంచె మహాత్ముడు
వంచెను శిరసును, కోపము జారెను
లక్ష్మణుడపుడు ప్రసన్నుడనుకొని
అనునయమ్ముగా పలికెను తార

''దశరథపుత్రా! ఏల కోపమిది
మదమున ఎవడు నిను కాదనెను
కారుచిచ్చులా మండుకోపమున
శలభము రీతిగ పడువాడెవ్వడు''

కపటములేని తార పలుకులతో
కారణమడుగగ లక్ష్మణమూర్తి
పలికెను తారతో ''పతిహితమతివి
నీవీ మాత్రము యోచన చేయవ?

మద్యవశుడయి, మన్మథవశుడయి
ధర్మవిచారము తలపులో నుంచక
రాజ్యపాలనము చేయుట ఇటులా?
మేము చెప్పినది యిట్టి పాలనా?

॥శ్రీరఘురామ॥

గడువు గడచిన సంగతి ఎరుగడు
నా పతి దోషము ఏమని అంటివి
నీవైనా మరి హితముగోరుచో
చెప్పకపోతివి ధర్మసూక్ష్మమును

ధర్మార్థసిద్ధిని కోరెడువారు
పానము మదిలో తలచరు తరుణీ!
పానము చెరచును ధర్మమునంతయు
అర్థకామముల భంగపరచును

అర్థకామములకంటెను శ్రేష్ఠుడు
విమలచరిత్రుడు అయిన మిత్రుడు-
సత్యధర్మములు నిండిన మూర్తిని
మరచిపోవుట ధర్మహానికద

కార్యతత్త్వము తెలిసినదానవు
మేము చేయగల కార్యము తెలుపుము''
అనిన లక్ష్మణుని చూచిన తార
తియ్యగ పలికెను ధర్మమునిండి

''మనుజోత్తమ! నువు నుడివిన యటుల
దోషి ఆతడు, అయినను నీవు
కోపించుటది అకారణమ్ము
కోపము తగునె బంధువులందున

మీ పనియందు శ్రద్ధ కలిగిన
ఆత్మబంధువు వానరరాజు
అట్టివానిపై కోపము తగునా
క్షమించతగును మీ కోంట్లకును.

॥శ్రీరఘురాముని॥

బలవంతుడు తను బలహీనులపై
కోపించడు విను ఓ సుకుమారా !
రాముని కోపము నెరుగుదు నేను
గడువుదాటుట తెలియును నాకు

మీరు చేసిన మేలు తెలియును
మేము చేయనగు కార్యము తెలియును
అయినను వినుము లక్ష్మణమూర్తి!
కామబలమది తెలియదు నీకు

నాయన ! నీ మది కోపవశమయె
కామవశమన తెలియకపోయెను
మన్మధువశమున చిక్కినవానికి
దేశకాలములు అర్థము తెలియవు

నా వశమునసే చిక్కినవాడయి
లజ్జాహీనుడు అయ్యెను రాజు
కిష్కింధాపతి-సోదరసముడు
దయామయా నువు క్షమించవయ్యా !

కృపాగుణముతో శోభిలువాడా
తపోధనులగు ధర్మవర్తులే
కామసౌఖ్యముల కరగిపోవగా
చపలుడు-కోతి-చిక్కుట చిత్రమ ?"

అర్థవంతముగ వనిత పలికెను
మహావీరుడు శాంతపడినటు
తెలుసుకొన్నది తిరిగి పలికెను
పతికి హితమును కూర్చగనెంచి

॥శ్రీరఘురాముని॥

"కామవశుడయి కిష్కింధాపతి
కార్యము చెఱచెను అని కోపించకు
కాగలకార్యము తీర్చుటకొరకై
తన విధేయులకు ఆజ్ఞలనిడెను

బలయుతులున్న, కామరూపులు
కోట్లకొలదిగా వానరవీరులు
పర్వతవాసులు జలముల తిరుగగ
చాలినవారిట వచ్చియుండిరి

అంతఃపురమున స్త్రీలను చూచుట
దోషము అని నువు తలచుట నిజమే
కానీ మిత్రుల భార్యల చూచుట
దోషముకాదు అడుగిడు లోనికి"

అనుచు తార అటు పిలువగనపుడు
రామకార్యమున తొందరగలిగి
అంతఃపురమున అడుగిడి అచట
భూషణయుతుడు ఇంద్రసమానుడు

సులభముగా మరి జయించరాని
దివ్యసుమములు-వలువలు-మాలల
వనితల నడుమ మెత్తని శయ్యన
కీర్తిశాలి సుగ్రీవుని గాంచెను

కనులు కోపమున ఎఱ్ఱగ వెలుగగ
ప్రళయకాలమున యమునిగనున్న
విశాలనేత్రుని లక్ష్మణమూర్తిని
దమ-సుగ్రీవులు చూచి వణకిరి.

॥శ్రీరఘురాముని॥

34. లక్ష్మణుడు సుగ్రీవుని నిందించుట

పురుషసింహమును అమితతేజుని
ఇంద్రధ్వజముతో పోలెడి రాజు
గాంచి భయమున దుమికె పీఠిని
తారలవోలె తరుణులు దుమికిరి

తారల మధ్యన చందమామలా
నిలిచెను అతడు కల్పవృక్షమున
పద్మనేత్రలతో నిలచినరాజును
కొరకొరచూచుచు పలికె లక్ష్మణుడు

"సద్వంశమున పుట్టియు పుడమిని
పాలించగనే రాజుకాదయా
సత్యవాదియు కృతజ్ఞుడున్నూ
విజితేంద్రియుడు కరుణామూర్తిగ-

నిలచిన ఏలిక లోకపూజ్యుడు
మేలుపొందితివి, మేలు చేయగా
ప్రతినచేసి మరి పాలింపనిచో
అతనిని మించిన ఖలుడింకెవ్వడు

అనృతదోషము పెరుగుచుండును
మనిషి విషయమున అసత్యమాడిన
తనను, తనవారందరి నతడే
చంపినంతటి పాపము కలుగును

తిరిగి మేలు మరి చేయని కుమతి
కృతఘ్నుడాతడు భూతజాలముల
వధ్యుడనుచును బ్రహ్మయె పలికెను
మేలు మరచిన క్షమకు ననర్హుడు.

॥శ్రీరఘురాముని॥

బ్రహ్మహత్యకు సురాపానముకు
చోరత్వమునకు వ్రతభ్రష్టతకు
ప్రాయశ్చిత్తము భువిలో కలదు
కృతఘ్నతకు మరి లేదు నిష్కృతి

రాముని మేలు పొందినవాడవు
తిరిగి మేలు మరి తలచని వాడవు
కృతఘ్నుడవు మరి మానహీనుడవు
వంచకుడవు నువు అసత్యవాదివి

మాతను వెదుకగ యత్నము చేయవు
సారసాక్షులతో కులుకుచుంటివి
కప్పకుత్తుకతో అరచు పాముపని
పావనమూర్తి తెలియకపోయెను

దీన వాక్యముల ఏడ్చిన నినుగని
జాలి కలిగి శ్రీరామచంద్రుడు
రాజ్యము నేలగజేసెను-అతడే
కోపముతో నిను వాలిని జేర్చును

పాపాత్ముడ ! విను వాలినడచిన
మార్గము యింకా మూయలేదు-మరి
ఆ మార్గములో అడుగిడవద్దు
సత్యవర్తివై శపథము నిలువుము

వజ్రాయుధమును పోలిన శరములు
రాముడు విడువగ చూడకపోతివి
అందువలన నువు ఆలసించితివి
తలచకపోతివి రాముని కార్యము.

॥శ్రీరఘురాముని॥

35. తార లక్ష్మణుని శాంతింప చేయుట

క్రోధముతో మరి కాల్చునట్టుగా
చూచెడి లక్ష్మణుగాంచిన తార
అనునయ వాక్యమ్ములతో పలికెను
"లక్ష్మణ ! నీ విటు పలుకగ తగదు.

వానరేంద్రుడు కటు భాషణము
వినగా తగదు-క్రూరుడుగాడు
కృతఘ్నుడితడు కాడు లక్ష్మణా!
కపటిగాడు మరి దోషియుగాదు.

అసాధ్యమయిన రాజ్యసంపదయు
రుమను నన్ను పొందగలుగుటది
రామ ప్రసాదము అన్నది తెలియును
తలచితలచి మిము పొగడుచుండును

కడు ఇడుమలబడి కుమిలిపోయెను
సుఖములు వడిగా వచ్చిపడగనే
గడువు మీరిన విషయము నితడు
తెలియకపోయెను-కౌశికమునివలె

కౌశికముని ఆ ఘృతాచివశమున
కామపాశముల బంధింపబడి
పదివేలేండ్లు ఒక్క దినముగా
తలచెను గాదా ! సర్వము వదలి

జనపాలక ! విను దేహ స్వభావము
జన్మగుణమది వదల నసాధ్యము
కామములో మరి అమరిన మనసు
కాలనియమము మరచును కాదా !

॥శ్రీరఘురాముని॥

సజ్జన వినుతా ! నాయన వినుము
దోషము నీవు క్షమించ తగును
విషయము తెలియక జడుని మాదిరి
పలుకుటమేలా ? వివరించెద విను.

నిన్ను బోలిన సత్వవంతులకు
విమర్శమాని తగునా కినుక?
నన్ను-రుమను-రాజ్యభోగములు
రామ కార్యమున వదలును వినుము.

ఆహవ భూమిలో దశముఖు ద్రుంచి
రోహిణితోడుత చంద్రుని రీతిగ
అవనిజ నితడు రాముని జేర్చును
ఒక్కనితో నది చక్కబడదు కద!

లంకలో లక్షల కోట్ల సంఖ్యలో
అసురులు గలరు రావణు బలగము-
ఒంటరి అగు సుగ్రీవుడు వారిని
చంపగచాలడు-అనెను వాలియే

మీ సాయముకై తన సాయముగా
వానర సేనల పిలువనంపెను
గడువు నేటితో ముగియుచున్నది
చేరెదరిపుడే పురి నా వీరులు.

ఇపుడే వీరులు విక్రమ మెందరొ
ఋక్షవరులగు కోతి గుంపులు
కోట్ల కొలదిగా వచ్చి చేరెదరు
కోరివచ్చెదరు సేవ చేయగ

॥శ్రీరఘురాముని॥

కోపము మానుము-జ్వాలనేత్రముల
కలిగిన భయము తీరకున్నది
వానరనాథుని విశ్వసింపుము
సంతోషమునిడు సుమిత్ర తనయా !''

36. సుగ్రీవుని భక్తి - లక్ష్మణు ప్రశంస

మృదుభాషణముల తారపలుకగా
రామానుజుడు కోపము వదలెను
రవిసుతుడపుడు భయమును నట్టి
తడి వస్త్రమును వదలివేసెను.

మెడలోనున్న బంగరు సరమును
తీసివేసి అతినమ్రత నిండి
అణకువతో నట పలికె రవిసుతుడు
''రాముని దయ ఈ రాజ్యము, యశము.

అంతటి వీరుని వైరి బ్రతుకడు
రాముడు చాలును రావణు త్రుంచగ
సీతను చేకొని సుఖములందును
నిమిత్తమాత్రము నా సహాయము

సప్తసాలములు-ధరణిని-గిరిని
ఒక్క శరమున చీల్చిన ఘనుడు
అల్లె త్రాటి టంకారమెగసిన
గిరులు నిండిన భూమి వణకును.

॥శ్రీరఘురాముని॥

సేనావాహిని వెంబడి నడచును
రామసేవలో నడతును ముందు
చనవు చేతనో-విశ్వాసముననో
దారి తప్పితిని దాసుడ స్వామీ !

కొద్దియొ గొప్పో అపరాధమును
ఇలలో చేతురు జనులు-కావున
క్షమించవేడితి దయగొనుమయ్యా !''
అనిన రాజుతో పలికె లక్ష్మణుడు

''వినయమూర్తివి దిక్కుగనుంటివి
కావున ! రాముడు సనాథుడయ్యెను
వానర రాజ్యరమను పొందగ
తగుదువు నీవు మంచినడవడితో

నీ సాయముతో రామచంద్రుడు
రావణు జంపి విజయము నందును
కృతజ్ఞుడవు నువు జయశీలివయా
యుక్తముగా మరి పలికితివయ్యా !

ఘనసామర్థ్యము కలిగియుండియు
తన దోషమును తెలిసి వినయముగ
పలుకగ చాలుదు రిద్దరేనయా
అన్న రాముడు-అర్కసుతుడును

శౌర్య పరాక్రమమందున నీవు
రామభద్రునికి సరిపోదువయా !
దైవవశమున మీ యిద్దరికి
నెయ్యము కుదిరెను వానరరాజా !
॥శ్రీరఘురాముని॥

భార్యలేక-తను దుఃఖిలు రాముని
ఊరడించుము లెమ్మ ! నీవిక
మనసు వశమును దప్పి తిట్టితిని
హితుడవె-నీవు తలచకు మదిలో.''

37. వానర సేనలను సమీకరించుట.

వానరరాజు చెంతనె వున్న
హనుమంతునితో పలికెను అపుడు
హిమవత్-మందర-వింధ్య మహేంద్ర
కైలాసాచల బాలసూర్యులన

సాగరతీర గిరులయందున
పడమటి గిరుల-సంధ్య మేఘములు
ఉదయపర్వత గిరులలో తిరుగు
పద్మతాలవన-మేఘనములగు

అంజనపర్వతమందలి కపులు
మణిశిలగుహలలో నుండెడి వీరులు
కరిబలసములగు వారందరిని
మేరుగిరి మరి ధూమ్రగిరులలో

మహారుణగిరి మనోహరమ్మగు
అడవులయందు వానరనాథుల
మైరేయి గ్రోలెడి వేగవంతులను
మునుల ఆశ్రయములందు వసించెడి.

॥శ్రీరఘురాముని॥

పుడమిని నిండిన వానరవీరుల
సామదానముల పిలిపించుమయా-
మంత్రీ! ముందే వెడలిరి కొందరు
మరికొందరిని త్వరగా పంపుము

కామాసక్తులు, సోమరులందర
రేపు అనుచు మరి జాప్యము చేసెడి
వారందరినీ వాయునందనా!
త్వరగా పిలువుము నా ఆజ్ఞగను

పది దినములలో నా ఆనతిని
పాలింపగ మరి రాని కపులకు
తల త్రుంచెదరని తెలియబరచుము
దిక్కుదిక్కునకు దూతల నంపుము-

కోట్లకొలదిగా దూతల నంపుము
మేఘము-పర్వతసములాదూతలు
ఆకసమంతయు కప్పివేయుచు
కపుల తావులలో వెదకి తెత్తురు''

వేగమె-సచివుడు ఆంజనేయుడు
వీరులందరికి ఆజ్ఞలనిడగ
మేఘసమానులు తారాపథమున
వెడలి, వార్తను చెప్పిరి-దూతలు

రామకార్యమును వినినంతటనే
ప్రళయకాలమున మృత్యువు సమమగు
రాజు ఆజ్ఞను వినినంతటనే
సమరోత్సాహులు విజయము చేసిరి.

॥శ్రీరఘురాముని॥

కాటుకవంటి నల్లని దేహులు
అంజనగిరిగల మూడుకోట్లును
పడమటి కొండల పసిమివన్నెగల
కపివీరులు పదికోట్లు చేరిరి

హరికేసరము వన్నెతో వెలుగు
కైలాసగిరి వేయికోట్లును
హిమవత్పర్వత ప్రాంతమందలి
ఫలమూలములను తినెడి వీరులు

లక్షకోట్లుగల వారందపను
వింధ్యపర్వతవాసులు కపులు
నిప్పువంటి ఆకారము గలిగిన
కోటివేలగు కపులు చేరిరి

పాలసముద్రము తీరమునుండి
టెంకాయలనే తినెడి కపులు-మరి
లెక్కలకందని కపిసేనలటు
నేల యీనినటు వచ్చి చేరినవి

కొండల-కోనల నదీతీరముల
గుహలలో వాసము చేసెడి కపులు
సూర్యమండలము మ్రింగునట్లుగా
రామకార్యమున వచ్చి కలిసిరి

పిటుల బిలువగ పోయినవారు
హిమవత్పర్వతమందు నిలచిన
శంకరుడచ్చట యజ్ఞముచేసిన
వస్త్రఖముగాంచి సంతసపడిరి.

॥శ్రీరఘురాముని॥

యజ్ఞమునందు పాలు-నేయి
అన్నమువలన నానిన నేలలో
ఉద్భవించిన కందమూలములు
అమృత తుల్యములైన ఫలములు

వాటిని తినినచో నెలదినములు యిక
ఆకలిమాటను తలచని దినుసులు-
దివ్యసుమములు కాన్కగ-రాజుకు
తెచ్చిరి-పిలచిరి వానరవీరుల

గడువు మేరలో కాన్కలుగొని అట
వచ్చిచేరి మరి సర్వము తెలుపగ
ప్రీతిగ కాన్కలనందుకు రాజు
గృహముల కేగగ ఆనతినిడెను.

38. సుగ్రీవుడు రామసేవాంకితుడగుట

రామకార్యమున కృతార్థుడైనటు
తలచెను అపుడు కిష్కింధాపతి
లక్ష్మణుడంతట రాముని చూడగ
పోదము రమ్మని ఆదేశించగ

మీ ఆనతి అది శిరోధార్యమని
వనితలకచ్చట శలవును యిచ్చి
వీరులందరిని వడిగా రమ్మని
దివ్యవల్లకీ తెమ్మని చెప్పెను.

॥శ్రీరఘురామని॥

లక్ష్మణమూర్తిని కూర్చొనజేసి
వెనుకనె రాజు, పల్లకి నెక్కెను
వింజామరలు వేయుచుండగా
శ్వేతచ్ఛత్రము వెలుగుచుండగా

        నగారధ్వనులు-శంఖారవములు-
        వీరుల సింహనాదమ్ములతో
        వానరరాజ్య విభవమ్ములతో
        వానరేశ్వరుడు బయలుదేరెను

రాముని విడిదికి దూరముగానే
పల్లకిదిగెను భక్తి మీరగా
చేతులు రెండును మోడ్చి వినయముగ
నిలచెను-నిలచిరి వీరులందరు

        తామరమొగ్గల శోభిలు జలమున-
        తామరకొలనుగ వెలిగెడి సేనను
        రాముడు గాంచెను-పదముల వ్రాలిన
        అర్కసుతునట కౌగలించుకొని

తిరుగ చెప్పెను ''విను కపిరాజా!
ధర్మము-అర్థము-కామము వీటిని
సమయము మించక ఆచరించగ
కీర్తి కలుగునా ధరణీధవునకు

        ధర్మార్థములను రెంటిని వదలి
        కామమునందే మునిగినవాడు
        చిటారు కొమ్మన నిద్రలో మునిగి
        నేలబడగ మరి మేల్కొనినట్లగు.

॥శ్రీరఘురాముని॥

సూర్యతనూజా ! కార్యారంభము
చేయు సమయము వచ్చినదయ్యా !
మంత్రులు-వీరులు అందరితోను
యోచన చేతము సభను తీర్చుము''

అనిన రామునితో సుగ్రీవుడు అనె
''రామా ! ఇది మీ సోదరులిద్దరి
దయాభిక్షయని సతతము నెరుగుదు
తరగనిరీతిగ అమరినవన్నియు

ఇట్టి నీకు మరి ప్రత్యుపకారము
చేయగతలచక నింద్యుడు అగును
రామచంద్ర యీ భూమిని నిండిన
కపివీరులును-భల్లూకములు

కామరూపులు-అతి బలవంతులు
అసాధారణులు-అడవుల తిరుగగ
దేవ, గంధర్వుల సుతులగువారు
వందలు-లక్షలు-ఆయతమ్ములు

శంకువు-లర్బుద-ఖర్వ-పద్మములు
అంతములుండి సాగరమ్ములుగ
పరార్థములుగా వచ్చెడివారు
ఇంద్రసమానులు మందరబలులు

దుష్టరావణుని దునిమి బంధులతో
సీతను తెచ్చి నీ కర్పింతురు''—
ముకుళిత హస్తములున్న రవిసుతుని
కౌగలించుకొనె రామచంద్రుడట.

॥శ్రీరఘురామ॥

39. వానర సేనల ఆగమనము

రాఘవుడనెను సుగ్రీవునితో
''రవి ఆతనమున చీకటి బాపును
సురపతి వర్షము సుఖముగ నిచ్చును
చంద్రుడు చల్లని వెన్నెల నిడును.

అటులే నీవు సజ్జన పూజ్యా !
సత్పురుషులవలె ప్రత్యుపకారము
చేయుట ఏమి విచిత్రము రాజా
సహజగుణమది-వారికి వలెనే.

నీ సాయమున అసురుల జంపెద
నీ అండతో నే విజయము నందెద
మంచి మనసుగల మిత్రుడవీవు
సాయముచేయుము సూర్యానందనా !

''మనుహ్లాదుని'' సురపతి జంపి
శచీదేవిని గొనివచ్చినటు
సీతను దెచ్చెద రావణు జంపి
కాల్చెద లంకను అగ్నిశరముల''.

మాటలట్టుల సాగుచుండగా
దిక్కులు ధూళితో మాసిపోయినవి
అడవులు-నదులతో ధరణి వణకెను
వానర సేనావాహిని నిలచెను.

బాలసూర్యుని ఎఱ్ఱని వన్నెతో-
చంద్రకాంతిలా తెల్లగ మెరయుచు-
పచ్చని వన్నెతో పదివేల కోట్లగు
వీరులతోనట ''శతవలి''వచ్చెను.

॥శ్రీరఘురామునిః॥

శత్రుభీకరుడు-కోపి, ఆతడు
తారతండ్రి "సుషేణు"డచటికి
పది వేలైన కోట్ల సేనతో
వచ్చి చేరెను వానరపతిని

రుమకు తండ్రియగు "తారుడు" అచటికి
కోటి సహస్ర కోతుల నడిపెను
బుద్ధి బలమును వేగము గలిగిన
బాల సూర్యుని బింబము వంటి-

ఆంజనేయుని తండ్రి "కేసరి"
అనేక వేల సేనతో నిలచెను
కోటి వేలతో వచ్చె "గవాక్షుడు"
మూడు కోట్లతో "పనసుడు" నిలచెను

రెండు కోట్లగు భల్లూకములతో
శత్రుభంజనుడు "ధూమ్రుడు" వచ్చెను
నల్లని కాయము గలిగిన వీరుడు
"నీలుడు" వచ్చెను పది యగు కోట్లతో

ఐదు కోట్లతో "గవయుడు" రాగా
వేయి కోట్లతో "దరీముఖుండు"ను
వేయికోట్లతో "మైంద-ద్వివిదులు"
మూడు కోట్లతో "గజుడు"ను చేరిరి

పదికోట్లగు భల్లూకవీరులతో
"జాంబవంతుడు" వచ్చినిలచెను
"రుమణ్వంతు"డను కపినాయకుడు
నూరుకోట్లు మరి కొలవగ నిలచెను

॥శ్రీరమునామము॥

నూరు వేలగు కోట్ల కోతులతో
"గంధమాదనుడు" వచ్చి చేరెను
తారాకాంతులవెలిగే "తారుడు"
ఐదు కోట్లగు సేనతో చేరెను.

వాలి పరాక్రమసము "అంగదుడు"
వేయి పద్మములు-నూరు శంకువుల
"ఇంద్రజానుడు" పదునొక కోట్లతో
రామచంద్రుని సేవలో నిలచిరి.

సింహాబలులు విశ్వాసపాత్రులు
నూరు కోట్లతో "రంభుడు" వచ్చెను
ఉదయ సూర్యుని తేజము గలిగిన
రెండు కోట్లతో వచ్చె "దుర్ముఖుడు"

వెండికొండవలె ఉన్నతమై మరి
అతిబలవంతులు వేయికోట్లుగా
తన సేవలలో నిలువగ-వీరుడు
నిలచెను సేవకు అటు "హనుమంతుడు"

శతలక్ష కోట్లతో "నలుడు" నిలచెను
పదికోట్ల సేనతో "దధిముఖుడు"న్నీ
అతివేగముగల "వహ్నికుముదులు"
"రంహుడు"-"ఉగ్ర"-"శరభులు"వచ్చిరి.

వచ్చిన వీరులు నమస్సులుంచిరి
నడచిరి కొందరు నిలచిరి కొందరు
దిక్కులదియగా నాదము చేసిరి
దుముకుచు నచట నిలచిరి కొందరు

॥శ్రీరఘురాముని॥

వానరసేనావాహిని మధ్య
కరిబలసములగు వీరుల నడుమ
మబ్బుల మధ్యన సూర్యబింబమై
భాసిలెనచట సూర్యకుమారుడు
వినయ విధేయత చూపెడివీరుల
రామచంద్రునికి ఎరుకపరచెను
తమతమ సేనతో అడవులయందు
విడిసియుండుడని ఆజ్ఞలనిడెను.

40. తూర్పుదిశకు సీతాన్వేషణకై -వినతుని, వీరులతో పంపుట

వినయముతో సుగ్రీవుడు పలికెను
"రామా, వీరులు, గజబలసములు
కామరూపులు-అరిభయంకరులు
అతి విశ్వాసము కలిగినవారలు
నీ కింకరులు-సేవకు నిలచిరి
అనతినిమ్ము నీ సేనలివి
ఆలోచించి తగు విధముగను
ఆదేశించుము అంజలి గొనుము"
అనగా రాముడు అర్కసుతునట
కౌగలించుకొని పలికెను తిరుగ
"జానకి అసువులు నిలపియున్నదను
విషయము ముందుగ తెలియదగినది
ముందుకార్యము జరుప జాలుదువు
మైత్రిలో నీవు రెండవవాడవు
మేలుచేయ మనసున్నవాడవు
సేనకు నీవు ఆదేశమునిడు.

రాముని పలుకులు విని సుగ్రీవుడు
మేఘధ్వనిగల ''వినతుని'' పిలచి
వానరేంద్ర ! నిను లక్షల కపులు
సూర్యచంద్ర వంశమ్ముల వీరులు

కొలుచుచుండగా తూర్పుదిక్కున
రావణుకొరకై అడవులు-కొండలు
నదీనదములు-సరయూ-గంగను
సింధు-యమునలు-సరస్వతి వెదకుము

కొండలకోనల నిండిన ''మహినది''
కాలమహియును-బ్రహ్మమాలయు
విదేహమ్మను-మాళవమ్మను
కాశికాపురి-మగధగ్రామములు

కోసలమ్మును వెదకుడు మీరు
సాగరగిరులు-బత్తనమ్ములను
మందరమందలి ముక్కిడులందు
పెదవులంటుకొను చెవులు గలిగిన

లోహముఖులను-ఏకపాదులను
మనుజుల తిను బలవంతుల స్థలముల
వెదకుడు రాముని ప్రియసతికొరకై
వెదకుడు దశరథు కోడలికొరకై

సంద్రపుదీవుల యందు వెదకుడు
సంద్రమధ్యమున యవద్వీపమును
స్వర్ణరూప్యమను దీవుల వెదకి
శిశిరపర్వతము-అడవుల వెదకుడు

అది దాటుగను ఎఱ్ఱని నీటితో
సంద్రముకావలి తీరమునందున
శోణనదమును వెతకుడు శ్రద్ధగ
సాగరమందలి దీర్ఘ కాయులు

ఆకలిగొనిన వరబలవంతులు
నీడలగని మరి మ్రింగజాలుదురు
మీరు తీరుగ రేవుమార్గమున
సాగుడు-మట్టు మార్గమైనను

ఎఱ్ఱనీళ్లుగల సంద్రముగాంచి
కొండబూరుగు తరులతో నిండి
బంగరు మణులతో విశ్వకర్మతను
గరుత్మంతుని సౌధము తీర్చెను

దానినిగాంచి-సాగిన, మీరు
కాంతురు ఆచట "మందేహులని"
సూర్యుని పట్టగ వచ్చెడిఅసురులు-
వేదవిదులు మరి విడుచు నర్ఘ్యముల

మంత్ర ప్రభావము అంతము చేయగ
గిట్టుచు తిరిగి పుట్టుచుందురు
అచ్చట తెల్లని పాలసముద్రము
అసాధ్యమయినది అందు వెదకుడు

క్షీరపయోనిధి నడుమ ప్రసిద్ధము
ఋషభ పర్వతము తెల్లగ వెలుగును
బంగరు ఛాయ తరువుల నిండి
ఖదలిక తీర్చుగ ఛాలిన కొలను.

॥శ్రీరఘురామః॥

"సుదర్శ" మను నౌక సరస్సుగలదు
తెల్లని కమలమ్ములతో నిండగ
జలకేళికి అట అచ్చర లొత్తురు
కిన్నర-చారణ-సురలు వత్తురు.

దాటగ-శుద్ధజలముల కడలిలో
"ఔర్వమహాఋషి" క్రోధమువలన
పుట్టిన అగ్ని-బడబాగ్ని అది
ప్రళయ కాలమున కాల్చులోకముల.

ఎంతటిబలము కలిగిన జంతువు
బడబాగ్నిని గని అరచుచుండును
అరపులు వినబడు వానరులారా!
అశ్వముఖముతో నుండును అగ్ని.

సంద్రముదాటి ఆవలపోగా
పదమూడైన యోజన విస్తృతి.
బంగరురాయి గిరిగలదయ్యా
చంద్రకాంతిలా చల్లగనుండి

భూమిని మోయుచునున్న అనంతుడు
పద్మనేత్రుడు నీలివర్ణమగు
వస్త్రముదాల్చి కనబడునయ్యా
అతని ధ్వజమది తాల వృక్షము.

మూడుతలలు గల బంగరు తాడి
అట శిఖరమున నుండును గనుడు-
దానిని తూర్పుకు సరిహద్దుగను
నిలపిరి సురలు తెలిసెన తీరుగ?

॥శ్రీరఘురాముని॥

అవల బంగరు తూర్పుకొండల
బంగరుమయమై నూరామడల
విస్తీర్ణమగు వేదిక కలదు
అచ్చటగలదు 'సౌమనసమ్ము'

సౌమనసమ్మను గిరి శిఖరమది-
వామనుడచట ఒక పాదమును
రెండవపాదము మేరుకూటమున-
నిలపెను అని, నే తెలిసితినయ్యా!

సూర్యకాంతిగల వాలఖిల్యులు
వైఖానసులు గలరు అచ్చట
తూర్పుకొండల అడవులయందు
ధరణిజ కొరకై వెదకుడు మీరు.

విరించి దానిని భూలోకమునకు-
మిగిలిన లోకములన్నిటికీను
ద్వారముగా మరి చేసెను దానిని—
సూర్యునిపయనము మొదలగునచట

దానిని అందురు పూర్వదిశయని
అందలి అడవుల-గుహలలో-ఏరుల
వెదకుడు మీరు సీతను కనగ
ఆ గిరిదాటిన దేవతలుందురు.

తూరుపుకొండల కద్దరి నింక
కాంతులులేని చీకటి కనుక
పోవనసాధ్యము నేను చెప్పిన
తావులెగాక అచ్చట మిగిలిన

ప్రతిస్థలమున మీరందరు వెదకుడు
నెలలోపల మరి తిరిగిరావలె
అటురాకున్న మరణదండనే
కార్యసిద్ధిగొని, సుఖములనందుడు.

41. హనుమంతుని, అంగదాదులను దక్షిణ దిశకు పంపుట.

దక్షిణదిశలో వెదకుటకొరకై
అగ్నికుమారుని-నీలుని వీరుని
హనుమంతుని మరి జాంబవంతుని
గజుని-సుహోత్రుని-గవయు-శరారిని-

శరగుల్మని మరి సుషేణువీరుని
ఋషభు-గవాక్షుని-మైంద-ద్వివిదుల
గంధమాదనుని-విజయుని మరియు
ఉల్కాముఖుని-అంగదు నెంచెను.

వారికి చెప్పెను వానరరాజు
దక్షిణదిశలో వివరములివి యని
వింధ్యపర్వతము వేయిశిఖరములు-
వెనువాములుగల నర్మదయున్నది.

విశాలగౌతమి తీరమందున
కృష్ణ-మహానది-వరద-మేఖల
ఉత్కల-దశార్ణ-అశ్వవంతులలో
అవంతి-విదర్భ-మహిష-ఋషికముల

వంగ-కళింగలు కాశీ రాజ్యము
అంగదేశముల కొండలు-గుహాలలో
దండకవనిలో గోదావరి తటి
నంతయు విడువక సీతను వెదకుడు

ఆంధ్రదేశము-చోళ-పాండ్యముల
పుండ్ర-కేరళప్రదేశములలో
పూనినచందన తరువులు చూడుడు
లోహగనులుగల సహ్యగిరినిగని

పుణ్యతీర్థమది కావేరినది
సాగరమ్మునకు పట్టపురాణి
సురస్త్రీలందరు పూజలు చేతురు
జలము కూర్చును-విశేష సుఖము

మలయపర్వతమునందు విశేషము
మహాతపస్వియు, దివ్యఋషియగు
అగస్త్యుడుండును-వందనమిడినచొ
కోరికతీరును-దీవనలంది

ముందుకు నడచి తామ్రపర్ణిని
తాబేళ్ళు, మొసళ్ళు-ఎండ్రకాయలతో-
చందనవనముల నిండినయట్టి
వివిధ ద్వీపములు కలిగియుండగా

తేత ప్రాయమున భర్తనుకలియగ
చేరుచున్నటు తామ్రపర్ణినది
కడలినిచేరును దానిని గనుడు
వెదకుడు సర్వము భూమిజకొరకై

॥శ్రీరఘురాముని॥

ఆవల దివ్యము-కొత్తముత్యముల
బంగరురేకుతో శోభిలునట్టి
పాండ్యనగరి తలవాకిలి చూడుడు
సంద్రముదాటెడి యోచన చేయుడు

సంద్రమునందు అగస్త్యమహాఋషి
మహేంద్రగిరిని నిలువబెట్టెను
నీటిలో మునిగి మునగనట్టుగ
కనవచ్చును అది బంగరుమయము

వివిధలతలతో విలసిల్లునది
దేవఋషులు సేవింతురు దానిని
యక్షులు-సిద్ధులు-సురస్త్రీలుందురు
పర్వస్నానమట సురపతి చేయును

కదలి మధ్యలో మనుజులకందని
నూరామడలు విస్తరించిన
ద్వీపముగలదు దానినిజేరి
సీతాదేవిని వెదకుడు శ్రద్ధగ

ఆ ద్వీపమున వధ్యుడు అయిన
దురాత్ముడయిన రాక్షసరాజు
సురపతి తేజముతో విలసిల్లుచు
సీతను చెరలో వుంచిన దుష్టుడు

రావణు పట్టణ మచ్చటగలదు
వానరులారా జాగరూకులై
కొంచెమైనను వదలక మీరు
వెదకుడు రాముని సతిని కాంచగ.

॥శ్రీరఘురామ॥

దక్షిణజలధిని అంగారకయను
రక్కసికలదు-ఆకసమందున
ఎగిరెడివారి నీడను బట్టును-
భక్షించును అది-శ్రద్ధగ వినుడు

ఆ ద్వీపములో అతి మెలకువతో
అవనిజకొరకై వెదకుడు మీరు
నిశ్చయమ్ముగా లేదని తెలిసిన-
నూరామడల దూరము పోయిన

సిద్ధ-చారణులు వసించునట్టి
రవి చంద్రుల కిరణమ్ముల పోలు
అందమైన గిరి "పుష్పిత" మున్నది
దాని బంగరు రజత శిఖరముల-

భానుడు బంగరు శిఖరము కొలుచును
రజత శిఖరమును చంద్రుడు కొలుచును
పరుల మేలు మరి మరచిన వారికి
నాస్తికులకును-వంచకులకును

దివ్యశిఖరమది కనబడదయ్యా!
మీరందరు ఆ శిఖరమ్మునకు
భక్తితో నమసులు చేసి ఆవల
పదునాల్గామడలున్నవి దాటగ

వైద్యుతమైన సూర్యవంతమను
గిరి కలదచట సుఖముగ విడిసి
ఫలములు-తేనెలు-చల్లగ త్రావి
ఆవల కుంజర పర్వతమును గని

ఆ పర్వతమున విశ్వకర్మ-తను
దివ్యరత్నముల శోభిలునట్టి
శ్రేష్ఠమైన సదనమ్మును కట్టి
అగస్త్యమునికి అందజేసెను

గృహమునుగాంచి గిరియందుననే
గొప్పదయినది-సర్పరక్షణలో
శోభిలు నగరము భోగవతి-యది
సర్పరాజగు వాసుకి నిలయము.

పాములనెలవు పావనికొరకై
పరీక్షగానట రహస్య స్థలముల
పరిశీలించి వృషభాకృతిగల
మణికాంతులతో వెలిగెడి గిరిని

"ఋషభ"మనెడి ఆ గిరిని గాంచుతు
సురసంబంధపు అగ్నికాంతితో
గోరోచనము దీప్తి కలిగినది
పద్మశ్యామలవర్ణ చందనము-

దొరకును గిరిపై తిరుగ చూడుడు
వాటిని తాకగవద్దు సుమా! అట
క్రూరులైన గంధర్వులు-మరియు
రోహితులున్న రక్షణ చేతురు

ప్రభు-శైలూషులు-శుక్ర-శిగ్రులు
గ్రామణి అను గంధర్వులైదుగురు
రవి చంద్రాగ్ని సమానశరీరులు
పుణ్యకర్ములు వసించియుందురు.

॥శ్రీరఘురామునికి॥

భూమికి అది పొలిమేర అగునయా!
అందు వసింతురు పాపరహితులు
దానిని దాటిన భయంకరమ్మగు
కాలుని లోకము కనబడుచుండును

యమపురి కేగ నసాధ్యము వినుడు!
భయంకరమ్మగు చీకటి నిండెను
వానరులారా! అంతవరకును
పోవచ్చును ఇక పోవీలుండదు.

నే చెప్పిన ఆ నెలవులందున
అట కనవచ్చిన స్థలములందున
ఏమరుపాటును వదలి వెదకుడు
హెచ్చరికతో మరి వెదకుడు సీతను

నెలదినములలో-సీతను గాంచితి
అని చెప్పిన వాడతి ప్రియతముడు-
నాతో సమమగు కీర్తితో వెలుగును
దోషములున్నను-బంధువు అగును

వానరులారా! అతి బలవంతులు
సద్వంశమున పుట్టినవీరులు
మంచిగుణములతో శోభిలువారు
ఘన ప్రయత్నమున వెదకుడు సీతను.

42. పశ్చిమదిశకు సుషేణుని వీరులతో పంపుట

హనుమదాదులను దక్షిణదిశకు
పంపినరాజు-పశ్చిమదిశకై
తార తండ్రియు తనకు మామయగు
సుషేణుగాంచి మ్రొక్కి పలికెను-

॥శ్రీరఘురామ॥

అతి పరాక్రముడు - ఇంద్రతేజుడు
పర్వతకాయుడు శౌర్యధనుడగు
మరీచి మహాఋషి కుమారుడయిన
మారీచుని - మరి మిగిలినవీరుల

పిలచి పలికెను సూర్యతనూజుడు
వానరులారా ! సీతను వెదుకగ
వేగమెపోవలె వెంటసహాయము
రెండు లక్షల కపులను గొనుడు

పశ్చిమదిశలో సురాష్ట్రమ్మును
బాహ్లీకమ్ము - శూరము - భీమము
గ్రామములున్న పల్లెలు వెదకుడు
పున్నాగమను అడవిని వెదకుడు

పొగడవనములు మొగిలి అడవులు
పడమరగా ప్రవహించు నదులును
మునులు వశించెడి అడవులు వెదకి
పశ్చిమసాగర తీరము చేరుడు

కడలి లోతయి మకరులు నిండెను
తీరమందుగల మొగిలివనముల
గానుగతోపుల కొబ్బరితోటల
సంతోషముగా సంచరించుడు

తీరమున్నందు శోధించి మరి -
దానిని దాటి ''మురభి'' పట్టణము
''జటీ'' పురమును - ''అవంతి'' నగరము
''అంగలోపను'' చూడుడు శ్రద్ధగ....

॥శ్రీరఘురాముని॥

తిరుగ వెదకి "సింధునది" అట
సంద్రముచేరెడి స్థలమును గాంచుడు
పెనుమ్రాకులతో-పలుశిఖరమ్ముల
హేమగిరిని మీరందరు గాంచుడు

ఆ గిరియందు ఎగురు సింహములు
ఏనుగులను మరి ఎత్తుకుపోయి
భక్షించును అట గూండ్లలో నుంచుకు-
అచట మదించిన గజములు కలవు-

పాపరహితులగు వానరులారా!
నూరామడలు ముందుకుసాగిన
చూడ నసాధ్యము అయిన శిఖరము
"పారియాత్రగిరి" శిఖరముగాంచుడు

ఆ గిరియందు అతి బలవంతులు
కామరూపులు అనల సన్నిభులు
ఇరువదినాలుగు కోట్ల సంఖ్యలో
సింహబలులు, గంధర్వులు గలరు

ఆ గంధర్వులు గర్వాంధులయి
అచటి ఫలములను రక్షణ చేతురు
వారి సమీపము పోవలదు సుమా!
శోధించుడు అట అవనిజ కొరకై

పోవలదంటిని వెదుకమంటినని-
ఆలోచించగ పనియేలేదు
కోతులు మీరు-వనచరులయితిరి
కావున మిమ్ముల బాధించరయా!

॥శ్రీరఘురాముని॥

దాటగ నచట ''వజ్రధర''మను
వజ్రమ్ములతో కూడినట్టిదగు
వైడూర్యముల కాంతితో వెలుగు
లతలతో శోభిలు గిరి కలదయ్యా!

అందు చిత్రమగు నూరామడలు
విశాలమైన చదరపు నేల
దానికావల గుహలు వెదకుచు
కడలికి-నాల్గవ భాగమునందు

చక్రవంతమను గిరికలదయ్యా!
విశ్వకర్మచే నిర్మితమయిన
''సహస్రార''మను చక్రము గలదు
దానిని రక్షణ చేయుచుండెడి

హయగ్రీవుని, పంచజనులను
శ్రీహరి చంపి-హయగ్రీవుని
చక్రముగొని ఆ పంచజన్యుదగు
శంఖమువంటి-వెన్నెముకనుగొనె

గిరుల-చరులలో గుహల యందున
సీతాన్వేషణ చేయుడు శ్రద్ధగ
ఆవల అరువది యోజనంబులతో
కడలిలో వరాహ పర్వతమున్నది

ఆ గిరి శిఖరము రజితమైనది-
విశాలమైన ఆ గిరియందున
''ప్రాగ్జోతిష''మను పట్టణమందు
నరకుడనియెడి రక్కసుడుండెను.

॥శ్రీరఘురామ॥

అందలి గుహలలో బంగరుమయమగు
''సర్వసౌవర్ణ'' గిరి కలదయ్యా!
అట సెలయేరుల పడెడి నీళ్ళతో
గజ-కేసరి-శార్దూల-సూకర

అరపుల ప్రతిధ్వని నీటిలో వినబడు
సురలందరును ఇంద్రుని-ఎచట
అభిషేకించిరో ఆ పర్వతమది
''మేఘవంతమని'' పేరున బరగెను

దానిని దాటిన అరువదివేల
కొండలు గలవు-అందు రమ్యమై
రవికిరణముల కాంతులు గలిగిన
బంగరుమయమగు తరువులు పూయును

''సావర్ణి మేరువు'' గిరి కలదచట
గిరిని గాంచిన భాస్కరదేవుడు
వరము నొసగె-ఆగిరిని కొలిచిన
పసిమివన్నెగల దేహము కలుగగ

గిరిని వసించు దేవసమూహము
గంధర్వులును, మనోహరమ్మగు
ఎఱ్ఱనిమేని కాంతితో నుందురు
సూర్యదేవునికొలుచుచుందురు

విశ్వే వసువులు-ఆదిత్యులును
మరుత్తులనబడు సురసమూహములు
సూర్యుని కొలవగ వత్తురు కొండకు
అస్తగిరికి నట సూర్యుడు వచ్చును

॥శ్రీరఘురామ॥

అస్తగిరికి అట భానుడు చేరగ
లోకము చీకటిమయమై పోవును
ఒక్క ఘడియలో పదివేల యామడలు
సాగును-భానుడు ఆ గిరి చేరును-

గిరి శిఖరమున సూర్యకాంతితో
విశ్వకర్మచే నిర్మితమయిన
దివ్యసౌధము-వరుణుని గృహము
వెలుగుచుండునట కన్నుల విందుగ

అస్తగిరికిని-మేరువు గిరికిని
మధ్యన బంగరు వేదిక గలదు
పది తలలతో నొక తాలవృక్షమట
కనబడు కన్నుల పండువుగాను

తీవ్రతపస్సును చేయు మునీంద్రుడు
బ్రహ్మసమానుడు ''మేరుసావర్ణి''
అందు గలడు మీరందరు మ్రొక్కి
వినయముగా మీ కార్యము తెలుపుడు

ఆవలనున్నది తెలియదు మనకు
సూర్యరశ్మి అట కనుపించదయా-
కావున మీరు అంతవరకును
శ్రద్ధగ వెదకుడు రామపత్నికై

నెలలోపల మీరందరు రావలె
ఆవల వచ్చిన అసువులుండవు
మామ ''సుషేణుని'' ఆజ్ఞమీరక
మహాబలులు మీరందరు వెదకుడు.

॥శ్రీరఘురామ॥

మామను పెద్దగ ఎంచుకు మీరు
విజయవంతులై తిరిగివచ్చిన
రామకార్యమును నిర్వహించిన
కీర్తికలుగును మనకందరకు.

43. ఉత్తరదిశకు శతవలిని వీరులతో పంపుట

ఉత్తరదిక్కుకు ''శతవలి'' నంపెను
తీరుగ వివరములిటు చెప్పుచును
నూరువేలగు యమతనూజులగు
వానరవీరుల సాయము గొనుము

ఉత్తరదిక్కున హిమగిరి గలదు
సీతను వెదకిన కీర్తి కలుగును
ప్రత్యుపకారము చేసినట్లగు
జన్మనెత్తిన ఫలము దక్కును

నిర్మలహృదయులు-నాకు హితులయా !
నేర్పుగ మీరు రామకార్యమును
తీర్చుట ధర్మము-రామచంద్రుడు
జగతికంతయు పూజనీయుడు

పుణ్యపురుషుడు-పురాణమూర్తి
రిపుల పాలిటి రుద్రుడె రాముడు
మిత్రులయందు దయగలవాడు
మాతను వెదకుడు శక్తియుక్తుల

మ్లేచ్ఛదేశము. శూరసేనము
పుళింద-ప్రస్థల-మద్రక-భరత
కాంభోజ-యవన-శకదేశంబుల
''ఆరట్టక''యు-బాహ్లిక-పౌరవ

॥శ్రీ రఘురాముని॥

కుంతణ-ఉత్తర కురుభూములును
ఋషికము-చీనయు-పరమచీనము
విహార-దరద ప్రదేశమ్ముల
హిమవత్పర్వత ప్రాంతమునందలి

దేవదారులు-లొద్దుగ వనముల
పద్మకాష్టవన ప్రదేశములలో
దుష్టుడు రావణు నెలవును-గాంచుడు
సీతాన్వేషణ చేయుడు శ్రద్ధగ

సోమాశ్రమము-కాళపర్వతము
దాటుడు-యేటి తటముల వెదకుడు
ఆవలగిరిని ''సుదర్శనమ్మను''
గడచిన-కననగు ''దేవసఖాద్రి''

దానిని దాటిన నూరామడలు
ప్రాణులుండని ప్రదేశమున్నది
దానిని త్వరగా దాటిన వెనుక
కనబడు మీకు కైలాసగిరి-

గిరిని గాంచిన బడలిక తీరును
అందుగలదు బంగారు సౌధమది
కుబేరుడుండెడి దివ్యసౌధమును
విశ్వకర్మ నిర్మించి యిచ్చెను

కల్హారములు-నల్లకలువలు
తెల్లకలువలు-కమలమ్ములతో
హంసలు నిండి-సురస్త్రీలందరు
సేవించెడిదగు కొలనుగలదట.

॥శ్రీరఘురామ.ని॥

"వసొవ్వతసారము" అను-ఆ కొలనులో
ధనపతి సంతోషము నిండగను
క్రీడల తేలును-ఆ ప్రదేశముల
సీతాన్వేషణ జరుపుడు శ్రద్ధగ

అవల క్రౌంచ పర్వతమున్నది
అందు కుమారస్వామి మున్ను-తను
శక్తి ప్రయోగము చేయగ వెలసిన
బిలము కలదట-ఆ మార్గమున

హంసలు మానస సరసును చేరును
సులభము కాదు బిలమున సాగగ
మెలకువగా నట సాగుడు మీరు
దేవఋషులు మహాఋషులు గలరట

కొండలు-గుహలు-నేలను వెదకుడు
"అవృక్షము" మరి "కామశైలము"
"మానస" మనియెడి గిరులు కలవట
అందు మానసము అనెడి పర్వతము

దేవ-దానవులు చొరనసాధ్యము
కావున దాని ప్రక్కల వెదకుడు
క్రౌంచపర్వతము దాటిన వెనుక
మైనాకమను గిరి కలదయ్యా!

దానవశ్రేష్ఠుడు మయుడు స్వయముగా
తన నెలవుగను తీర్చిదిద్దిన
దివ్యసౌధము కలదా గిరిలో
అందలి నెలవులు వెదకుడు మీరు.

॥శ్రీరఘురామ॥

అశ్వముఖులను జాతి వారివగు
స్త్రీల గృహములు గలవు-వాటిని
వడిగా దాటిన వాలఖిల్యులు
సిద్ధులు తపస్సు చేయుచుందురు

పుణ్యవర్తనులు-పాపరహితులు
వారలగాంచి వందనమిడుడు
సీతాదేవి వివరము వారిని
వినయముగా మరి అడుగుడు మీరు

సిద్ధులుండు ఆ ప్రదేశమ్మున
బంగరు కమలమ్ములతో నిండిన
''వైఖానసము''ను సరస్సు గలదు
బాలసూర్యుని తేజము గలిగిన

హంసలు అచ్చటి సరసున గలవు
ఆ కొలనుకు మరి ''సార్వభౌమ'' మను
ఏనుగు-కుబేరు ప్రియవాహనము
ఆడుదంతులతో వచ్చుచుండును

సరసుకావల సూర్యచంద్రుల
తారాకాంతులు కనబడవయ్యా!
నింగి శబ్దము లేకయుండును
అచటి మునులు మరి సూర్యతేజులు

ఆ ప్రదేశము దాటిన వెనుక
శైలోదమను-శిలాసరస్సు-
అందడుగిడిన శిలలై పోదురు
కావున దానిని దాటగవలెను.

॥శ్రీరఘురాముని॥

వెదురుపొదలట వెలసియున్నవి
వాటిసాయమున దాటగవలెను
సిద్ధులకే మరి సాధ్యమయినది-
ఆవల ఉత్తరకురుభూములవి

ఆ ప్రదేశములు పుణ్యపురుషులకు
సుఖములనెలవులు అయివున్నవయా!
అందు అనేక నదులు నిలచినవి
దివ్యకమలములు గలవు అచ్చట

అచటి సరస్సులు అతిరమ్యములు-
అచటి కలువలు బంగరుశోభలు-
ఆణిముత్యములు-రతనమ్ములతో
అందమైనవట ఇసుకతిన్నెలు

సర్వకాలముల, పూలు-ఫలముల
కోర్కెలు తీర్చుచు తరువులుండును
వేలకొలదిగా శుక-సారణములు
వెలసియుండు నా దివ్యతరువుల

అచటి తరువులు కోరినయట్టి
వస్త్రములిచ్చును స్త్రీ-పురుషులకు
అన్ని ఋతువులలో సేవింపదగు
యోగ్యములయినవి-ఆ ప్రదేశములు

కోరిన ఫలముల నొసగుచుండును
రత్నములున్న వెలగల సొమ్ములు
ఇచ్చును- ఉత్తరకురుభూములవి
అచటి గిరులు అతి చిత్రమైనవి.

॥శ్రీరఘురాముని॥

ఆసనమ్ములు - మృదుతల్పములు
భక్ష్య - పానములు - పూలరసములు
ఇచ్చెడి గిరులు, తరువులుగలవు
సుగుణరాసులగు స్త్రీలనొసగును.

గంధర్వులు - సిద్ధులు - విద్యాధరులు
కిన్నర - నాగ సమూహములన్నియు -
జంతులు - సుఖముల తేలియుందురు
పుణ్యకర్మలను చేయుచుందురు

చిరునగవులు - మఱి సంగీతధ్వని
చిత్తశాంతిని కలుగజేయును
ఉత్తరకురుభూములు - అచ్చటను
మచ్చుకైనను - దుఃఖము లేదు

విశ్వస్వరూపుడు - విష్ణుదేవుడు
మదనాంతకుడౌ - మహాదేవుడు
జగతి సృజించిన బ్రహ్మదేవుడు
కాపురముండెడి దివ్యప్రదేశము

ఆ కురుభూముల కుత్తర దిక్కుగ
పోవలదయ్యా! ''సోమపర్వతము''
దూరమునుంచే దర్శించుకొని
మరలిరావలె మతిమంతులయి

ఆవలి దేశపు కట్టుబాటులు
తెలియనివయ్యా! సూర్యునికాంతి -
కనబడదచట అచ్చటినుండి
మరలి రండు - ఇక ముందుకు పోక.

॥శ్రీరఘురామముని॥

నే చెప్పిన ప్రతి వెలవునందున
అటగాంచిన ప్రతి స్థలమునందున
అనల సన్నిభులు-అతి బలశాలులు
అవనిజకొరకై అన్వేషించుడు
సీతనుగాంచి పుణ్యమూర్తులై
రామచంద్రునికి-నాకును మిక్కిలి
ప్రీతిపాత్రులై బంధుల హితులతో
సుఖముల తేలుచు స్వేచ్ఛగ నుండుడు.

44. హనుమంతుని, రాజు ప్రశంసించుట-రాముడు మారుతికి అంగుళీయకము నిచ్చుట.

వానరనాథుడు ఆ విధినుడివి
వాయుపుత్రుని హనుమంతునిగని
కార్యసాధకుడు అని తలపోసి
పలికెను తిరుగ పావనితోను

"ఓ హనుమంతా-అతిబలవంతా
నింగీ-నేలను-నిప్పుల-నీటిలో
స్వర్గములో నీ గమనము సాధ్యము
నీ కాటంకము ఎందునలేదు.

సురాసురులును గంధర్వులతో
సర్పమ్ములతో మనుజులతోను
గిరులు-తరులతో-సాగరమ్ములతో
నిండిన నేల నీకు తెలియును.

వేగమునందు తేజమునందు
లాఘవమ్ముగా ఎగురుటయందు
బలాతిశయమున-వాయునందనా!
నీ జనకునితో సమమగువాడవు.

॥శ్రీరఘురాముని॥

నీకు సరిపడు ప్రాణి ఎచ్చట ?
భూలోకములో కనబడదయ్యా !
బలమున-బుద్ధిని-పరాక్రమమున
గుణ దోషముల విచారణయందు.

దేశకాలములు తీరుగ తెలిసిన
ధీమంతుడవు ఓ హనుమంతా!
సర్వసుగుణములు-శౌర్యధైర్యముల
నెలవు నీవు-విను వానరపుంగవ.

కావున హనుమా ! వినుమా నీవు
రాఘవు రాణిని తేగల మార్గము
వెదకుము నీవు, నిన్ను మించిన
కార్యసాధకులు ఎందునులేరు.

వానరపతి అటు పలుకుచుండగా
యోచన చేసెను జానకీపతి-
సర్వము తెలిసిన వానరరాజు
వాయుపుత్రుని సామర్థ్యముగని

పలుకుచుండెను కావున ఇతడు
రాజు నమ్మినబంటు కావలె-
విశ్వాసముగల వీరుడు గావలె-
కావున కార్యము కావలె నితనితో-

అనుకొని మదిలో సంతోషముతో
బంగరు ఉంగరమంతట తీసి
రామనామముతో శోభిలు దానిని
వాయునందనుని చేతికి ఇచ్చి

॥శ్రీరఘురాముని॥

"వానరశ్రేష్ఠా ! ఈ యుంగరము
సీతకు జూపిన-నమ్మను నిన్ను
నీతో పలుకును భయమును వీడి
నా దూతవని తెలియును తీరుగ.

కార్యము తీర్చగ చాలిన వాడవు
నీవేయని-నా మనసుకు తోచెను
కావున నిచ్చితి అంగుళీయకము.
కాగల కార్యము తీర్చుము నీవు.

బలవిక్రమ సంపన్నుడవీవు
విస్తరించి అవి వృద్ధినొందినవి
రాజు-నిన్ను మరి నియోగించెను
అన్నియు చూడగ-తగుదువు నీవె.

అతిబలవంతా-అంజని నందన
అల్ప కార్యమని అలుసు చూపక
ఏ ప్రయత్నమున సీతాదేవిని
చూడగలమొ-మరి అటు చేయుమయా !

నీ బలమును నే నాశ్రయించితిని"
అనుచు రాఘవుడు పలుకుచునపుడు
అనుగ్రహించిన ఆ యుంగరమును
పొంగిన భక్తితొ దోసిట గైకొనె.

ఆంజనేయుడు అంగుళీయకము
అతి భక్తిగను శిరమున నుంచుక
అంజలి నిడుకొని రామచంద్రుని
పాదపద్మముల నమస్సులుంచెను.

॥శ్రీరఘురాముని॥

45. వానర వీరుల ఉత్సాహము

వానరనాథుడు-సూర్య తనూజుడు
వానరులందర కావిధముగను
సీతాన్వేషణ జరుపుడు అనగా
వినయము, భక్తి నిండిన వీరులు.

మిడుతలదండు అన్నటు వారు-
భూమినిండిన వానర వీరులు
రాజు ఆనతిని అవనిజ సీతను
వెదుకగసాగిరి-వేగము నిండి.

వీరుల పంపిన వానరేంద్రుడు
కార్యారంభ-సంతోషముగొనె
నెల దినములు మరి గడచుట ఎట్లని-
చింతలో మునిగిరి దాశరథులట.

సీతను తెచ్చెద నేనే అనుచు
రావణు త్రుంచెద నిపుడే అనుచు
అరపులు, బొబ్బలు, అట్టహాసముల
సాగిరి వీరులు అంబర వీధిని.

సింహనాదములు చేయుచుండిరి
తోకతో నేలను బాదుచుండిరి
పండ్లు పటపట కొరికిరి కొందరు
పరుగులు తీసిరి వానర యోధులు.

నేనొక్కడనే చాలుదునసలు
ఆగుడు-అందరు మీరిచ్చటనే
అనుచు పలికె నొక వానర యోధుడు-
తరులగిరుల నే త్రోసెదననెను.

॥శ్రీ రఘురాముని॥

కొండలనూచెద - జలధియందలి
నీటిని నేను ఎంతగట్టెదను
భూమిని నేను శోధించెదను
భూమిజ నిచటుకు దెత్తును నేను.

నూరామడలు నే దాటుదనన-
అదియొక లెక్క నన్నడుగుమనె
భూమియందున-పాతాళమున
కొండల-కోనల-సంద్రము నందు.

అడ్డము లేక-నే వేగముగ
పోగలవాడను అని మరియొకడనె
ఆ విధముగను అతి బలవంతులు
బలగర్వముతో పలికిరి అచట.

46. సుగ్రీవుని భూప్రదక్షిణ వృత్తాంతము

రాముడు అడిగెను ఆశ్చర్యముగ
"వానరాజా! భూచక్రమిటు
సర్వము నీకు తెలిసిన దెట్లు?"
అంత, కపీంద్రుడు పలికె వినయముగ

"పురమునుండి నను తరిమెను వాలి
ప్రాణము హరింప చూచుచుండెను
మంత్రులతో, నే-ప్రాణభయమున
పరుగిడుచుండ వెంబడించెను.

కొరవికట్టెను త్రిప్పగనంత
చక్రమువలె అటు అగ్నితోచును
అటులే నేను అద్దములోవలె
చూచితి సర్వము-భూమండలమును.

॥ శ్రీరఘురామ ॥

తూర్పుదిక్కులో తరులు-సరస్సులు
కొండలు-నదులు-తూరుపుకొండలు
పాలసముద్రముజూచి మరలితి
వాలి తరుమగా ప్రాణభయమున

దక్షిణదిశలో వింధ్యగిరులలో
చందన తరువుల చూచితి రామా!
పశ్చిమదిశలో అస్తగిరిని గని
పరుగులుతీయుచు నుండెడివాడను.

ఉత్తరదిశలో హిమాద్రిగాంచి
మేరుగిరిని మరి సంద్రము జూచితి
ఎచ్చటకూడా తలదాచుకొను
స్థలముగానక తిరిగితి తిరిగితి.

అంతట హనుమ-సచివోత్తముడు
మతంగ శాపము నాకు తెలుపుచు
ఋష్యమూకము వాలి చేరినచో
వానితల అదివ్రక్కలు అగుననె

అచ్చట చేరి సుఖముగ నుంటిని
వాలి అచ్చట అడుగిడ లేడు
ఆనాడటుల వాలి తరుమగా
భూమంతయును తిరిగితి రామా!''

47. దక్షిణదిశకు పోయిన వీరులుతప్ప
మిగిలినవారు మరలివచ్చుట

సుగ్రీవునానతి నందిన కపులు
పగలంతయును దుర్గమమయిన
కొండలు-కోనలు-నదులు-పట్నములు
వెదకితిరిగి-మరి రాత్రియందున

॥శ్రీరఘురాముని॥

అందరు ఒకచో కలుసుకొనుచును
ఫలములు తినుచు బడలిక తీర్చుకు
తిరిగి ఉదయమే ఉత్సాహముగా
నెల దినములు వారందరు వెదకిరి

భూమిని వెదకి నెలదినములలో
సీతను గానక వచ్చి చేరిరి
తూరుపుదిశలో వినతుడు వచ్చెను-
ఉత్తరదిశలో శతవలివచ్చెను.

పడమటకేగిన సుషేణు డపుడు
వచ్చిచేరెను-తెలిపిరందరు
"రాజా! మేము నెలదినములవి
పల్లెలు-ఊళ్లూ-కొండలన్నియు

వనములు-గుహలు-దుర్గమస్థలముల
వెదకితిమయ్యా! భీకరమృగముల
చంపితి మచట ఎందు వెదకినా
నిజమిది! సీత కనరాదచట."

ధీరుడు - పావని, కులదీపకుడు
అద్రిచరేంద్ర రత్నము మారుతి
దక్షిణ దిశలో రామపత్నికై
వెదుకబోయెను శూరులతోను

రామపత్ని నా పుణ్యశీలుడే
ఏవిధినయినను గని వచ్చునను
ఆశతో నందరు వేచియుండిరి
ఆంజనేయుని శక్తిని తలచుచు

॥శ్రీరఘు రామునీ॥

48. దక్షిణదిశలో సీతాన్వేషణ.

అంగదాదులు తారునితోను
కూడిన వీరుడు ఆంజనేయుడు
రాజుచెప్పిన రీతిగ శ్రద్ధగ
వింధ్యగిరులలో వెదుక మొదలిడి

నగాగ్రమ్ముల- కానన సీమల
భూరివృక్షముల- భూమిజకొరకై
ఘోరభయంకర దుర్గదేశములు
ఓర్పుతో వెదకి సీతను గానక

తిరిగివారు అతి ధైర్యముతెచ్చుకు
గుహలునిండిన ప్రదేశములలో
అతికష్టములకు లోనయి వెదకుచు
కీకారణ్యము లన్నియు వెదకిరి

భయమునెరుగని ఆ వనచరులు
మోడులైన తరులున్న ప్రదేశము
ప్రాణికోటి అట మసలనినెలవు
అరణ్యశోభ అంతరించినది.

సత్యసంధుడు తపస్వి అయిన
"కండుడను" నొక మహాఋషి తన
పదునారేండ్ల కొమరుని గానక
అడవిలో తప్పిపోవుటచేతను

శాపమునిడెను కాననమంతయు
మృగములు-పక్షులు-లేకపోయెను
శాపవశమున కాననమంతయు
శోభలుచెరిగి శోకము నిండెను.

॥శ్రీరఘురాముని॥

పర్వతగుహలలో-నదులలో-అడవుల
వానరవీరులు వెదకి గానక
తిరిగి వెదకుచు నుండగ నచట
భయంకరముగ తీగలు-లతలు

శరీరమంతయు చుట్టుకునున్న
భీతిగొలుపునొక రాక్షసుడచట
కనబడినంతనె వానరవీరులు
యుద్ధముచేయగ సిద్ధముకాగా

"చచ్చిరిమీరు" అనుచు దానవుడు
పిడికిలిబిట్టి పోరగరాగా
వాడే రావణుడనుచు తలచిరి
అంగదుడపుడు తన అరచేతను

ఒక్కటివేసెను-పర్వతకాయుడు
రక్తముగ్రక్కుచు నేలను వ్రాలెను-
అచ్చట సీత ఉండుననుకొని
వెదకిరి శ్రద్ధగ వానరవీరులు

వెదకిరి-వెదకిరి-మరియొక అడవిని
తిరిగి వెదకిరి సీతనుగానక
శోకతప్తులై దీనవదనముల
చేరిరి వారొక తరువు క్రిందను.

49. హనుమదాదులు వింధ్యగిరులలో సీతను వెదకుట

బుద్ధిమంతుడు బలశాలినవాడు
వాలితనూజుడు అంగదుడపుడు
తనవలె అలసిన వానరవీరుల
శ్రమను తీర్చగ పలికెను తీరుగ

"దుర్గములందు కొండలగుహాలలో
పొదలు-నదులను-అడవుల వెదకిన
సురస్త్రీ సమమగు సీతనుగానక
దుష్ట రావణుని జాడతెలియక

సమయము చాలా గడచిపోయెను-
ఆనతి మీరిన బ్రతుకుట జరగదు
ఉత్సాహముతో జాగరూకులై
సోమరితనమును వదలి మనమిక

తిరిగివెదకవలె అవనిజకొరకై
విసుగులేక మరి వెదకవలయును
త్రోవ మనకుమరి కనరాకున్నను
మనసుతోనె మరిత్రోవనుగనవలె

పరితపించితిమి ఫలితముఏమి
కనులుమూసినా కాలము గడచును
తగదికమనకు జాగుచేయగ
రాజదండన తీక్షణమయినది.

రామచంద్రునికి-సుగ్రీవునకు-
భయపడవలెను-కోపించినచో
వారిద్దరును దండించెదరు
మీకు హితమును చెప్పితినేను.

నే నుడివినది సరిగాదన్నచో
వలయుకార్యము తెలుపుడు మీరు"
అనగా దాహము నిండినవాడై
గంధమాదనుడు పలికెను అపుడు

॥శ్రీరఘురాముని॥

"అంగదుపలుకులు ఉచితమైనవి
అందుకు తిరిగి వెదకుదమనగ"
అర్కసుతుడు తా చెప్పిన తావుల
అందరు వెదుకగ లేచిరి తిరిగి

వెదకుచుపోయి శరత్కాలమున
మేఘములన్నటు ఉన్న గుహలను
శిఖరములున్న తెల్లని గుహలలో
ఏడాకులుగల అరటివనముల

జయాభిలాషులు-ఆ కపివీరులు
తిరిగి తిరిగి ఆ గుహలలో వెదకి
అలసి అచ్చటే బడలికతీరగ
తిరిగి వింధ్యలో వెదకసాగిరి.

50. ఋక్ష బిల సందర్శనము

అంగదాదులు తారుడు రాగా
వెదకబోయిన ఆంజనేయుడు
పులులు-సింహములుగల ప్రదేశములు
ప్రవాహమ్ములు కొండలునిండిన

వింధ్యనగమున నైఋతిదిశలో
కపులతోనుండగ గడువది ఒక నెల
గడచిపోయినది-కపులందరట
హనుమచెంతకు అలసి చేరిరి

ఆకలిదప్పుల చిక్కినవారై
అంగద గజ-సుషేణ గవాక్ష
గవయు-శరభులు-గంధమాదన
వీరులందరును వచ్చిచేరిరి

దప్పికనిండి. నీటిని వెదుకగ
ఒకచో తీగల గుంపుల నిండిన
బిలమును గాంచిరి వారందరును
ఆశలంతట చిగురించినవి.

బిలమునుండి అట తడిసినరెక్కల
తామరపుప్పొడి నిండి-ఎఱ్ఱనగు
వన్నెతోనున్న చక్రవాకములు
వచ్చుటగాంచిరి వానరవీరులు

సుగంధశోభలు విరసియున్నను-
చొరగా శక్యగాని బిలమది
భయంకరమగు బిలమునుగాంచి
మనఃక్లేశమును బొందిరివారు

ఘనకోవిదుడు హావని పలికెను
''దక్షిణదేశ వనముల వెదకిన
కనబడలేదు సీతామాత
బడలిక-దప్పిక కలిగిన మనము

బిలమున వెదకిన జలములకొరకు
ఆశలుతీరును-చీకటి నిండిన
బిలమునసాగగ ధైర్యము తెచ్చుకు
నిలవగమీరు ముందుకుపోదము''

బిలము ముందర పులులు-సింహముల
గుంపుల గాంచిరి ఆశ్చర్యముగ
తేజముతగ్గి శౌర్యము చెదరి
కన్నులచూపు కనబడనట్టి.

॥శ్రీరఘురాముని॥

చీకటి-మార్గము-బిలము వెంబడి
వాయువేగమది-వ్యర్థముకాగా
చేతులుపుచ్చుకు వానరులందరు
సాగిరి-అలసి-అంధులమాదిరి

మనసు చెదరినది-బ్రతుకు-ఆశ అది
సన్నగిల్లినది-సీతనివెదకుచు
అమడసాగిరి అతికష్టముతో
అంతట వారికి వెలుతురు నిండిన

కాంతులుగతాగిన ప్రదేశమొకటి
కనవచ్చినది-అగ్నికాంతిగల
బంగరు వర్ణపు కర్ణికారములు
సాలతాలములు-చంపక తరువులు

నాగ-వంజుళ-కకుభ-పున్నాగ
తరువులు కనబడె-సంతసమొదవగ-
రజితకాంతితో పూలగుత్తులు
ఎఱ్ఱచిగుళ్లు-తీగలు-లతలు

బాలసూర్యుని ప్రభతో-వెలిగెడు
బంగరు తరువులు-బంగరుపుప్పొడి
వింతగు పక్షులు-బంగరు చేపలు
కూర్మమ్ములతో నిండిన కొలనులు

ముత్యమ్ములతో సందగించిన
స్వర్ణగవాక్షములున్న గృహములు
వెండి-బంగరు-మణిమయాద్యులచె
వెలుగుచున్నవట విచిత్రమ్ముగ

శ్రీరమురాము

పగడము వన్నెతో పూచిన చెట్లు
బంగరుతు మ్మెద-మణులచె నిండి
చిత్రశోభలతో పానుపులున్న
పల్లకీలు మరి-మేనాలున్నవి

బంగరు-వెండి-కంచుపాత్రలు
అగరు-చందన-సుగంధదినుసులు
భుజింపదగిన ఫలమూలములు
తియ్యని తేనెలు-దివ్యవస్త్రములు

కృష్ణాజినములు-దివ్యకంబళులు
అగ్నిహోత్రపు తేజమునిండిన
కాంచనరాసులు కాంచిరికపులు
అందువెదకగా ఆశ్చర్యముగా

నారచీరలతో కృష్ణాజినము
వస్త్రముగా మరి ధరించియుండి
తపసులోనున్న స్త్రీమూర్తినట
గాంచిరివారు దూరము నిలచిరి.

51. స్వయంప్రభ కపులను ఆదరించుట

ముదుసలి వనితను గాంచిన మారుతి
ముడిచిన కరముల భక్తినిండగా
అడిగెను "అమ్మా! ఎవ్వరవీవు
బంగరుబిలము మణులునిండిన

సుందర సదనము ఎవ్వరిదమ్మా!
మేమందరము ఆకలి దప్పితో
అంధకారమున కన్నులుగానని
బిలమునుగాంచి సాగియొచ్చుట

॥శ్రీరఘురాముని॥

ఆశ్చర్యముతో గాంచితి మిన్నలి
మరలిపోవగా దిక్కు తెలియక
వ్యధతోనుంటిమి దయామూర్తివి
ఎవరి మహిమతో-తపోయశముచే

సమకూరినవీ అసమానమగు
బంగరుతరువులు-భోజనాదులు
విమానమ్ములు-రజితగృహములు
నిర్మలజలములు-పరిమళసుమములు''

ఆంజనేయుడు అడగగనంత
సర్వప్రాణుల హితమును కోరు
సాధునిష్ఠయగు ఆ స్త్రీమూర్తి
పలికెను వినుమని ''ఈ ప్రదేశము

రాక్షసప్రభువు మయుడనువాడు
అద్భుత శక్తితొ నిర్మించెనయా!
రమ్యమైన ఈ బంగరు గృహమును
దానవశిల్పి విశ్వకర్మయగు

దనుజశ్రేష్ఠుడు వేయి ఏండ్లుగా
తపసునుచేసి విధాతవరమున
శుక్రుని సొత్తగు-శిల్పవిద్యను
నేర్చి-దీనిని-తీర్చి దిద్దుకొని

సుఖముగనిందు వసించియుండగ
దేవస్త్రీయగు ''హేమ''తొ మయుడు
దానవుడుండగ-సురపతి అంత
కోపమునిండి చంపెను మయుని.

॥శ్రీరఘురామ॥

అంతట మయుడు హేమకు ఈవని
ఇచ్చెను ఇందు సర్వసుఖములు
ఉండును నేను హేమకు సఖిని
ప్రేమపాత్రమగు స్నేహితురాలిని.

హేమనుండి ఈ వనిని వరముగ
పొందితి దీని రక్షణ చేతును
మేరుసావర్ణి పుత్రికనేను
"స్వయంప్రభ" యన పేరునబరగెద

వానరులారా! ఎవ్వరు మీరు?
ఎవరి నిమిత్తము తిరుగుచుంటిరి
ఎటుల గాంచిరీవనమును మీరు
మీరు వచ్చుటకు కారణమేమి?

ఫలమూలములు-పానీయములు
మహిత పదార్థములన్నియు కూడ
తృప్తిగ తిని మరి శ్రమతీరగను
మీ చరిత్రను తెలుపుడు తీరుగ."

52. మారుతి తన వృత్తాంతము స్వయంప్రభకు తెలుపుట.

తిరిగిపలికెను తపోరాసి అట
ఫలములుతిని మరి బడలిక తీరి
నే-వినదగినచో మీ వివరమును
తెలియబరచుడు అనగా మారుతి

ఉన్నది యంతయు పూసగ్రుచ్చినటు
ప్రారంభించెను వినయమునిండి
"ఇంద్ర-వరుణుల సమానమయిన
దశరథరాజ కుమారుడయిన

॥శ్రీరఘురామునీ॥

రామచంద్రుడు తన సోదరుడు
ప్రియసతి సీత జనకనందిని
తనను కొలువగా దండకాటవిలో
తిరుగు సమయమున దానవరాజు

రావణుడామెను బలవంతముగా
అపహరించుకొనిపోయెను వినుము
రామచంద్రుని మిత్రుడాతడు
వానరనాథుడు మా సుగ్రీవుడు

రాజు పంపగా మాతను వెదకుచు
దక్షిణదిశకు దనుజుని కొరకై
బయలుదేరితిమి అంతయు వెదకి
ఆకలి-దప్పుల నిండి అలసితిమి

మేమందరము అలసి సొలసి అట
తరువు-ఛాయలో పడి పోయితిమి
మెల్లగ వెదుకగ-బిలముగాంచితిమి
హంస-బెగ్గురులు-లకుముకులున్న

బిలము వెలికిమరి వచ్చుటగాంచి
శుభమది అనుచు రమ్మని నుడివితి
అంతట కపులు సరియనిబలికి
బిలముజొచ్చి ఆ కారుచీకటిలో

చేతులుపట్టుకు ప్రాకుతువచ్చి
నీ సమీపమున చేరితిమమ్మా!
ప్రాణములూడెడి సమయములోనువు
బ్రతికించితివి పుణ్యమూర్తివి.

॥శ్రీరఘురాముని॥

మేలుమరువము తెలుపుముతల్లీ!
మేముచేయదగు సాయము ఏది?''
అని హనుమంతుడు పలుకగ నపుడు
తిరిగి పలికెను ఆ స్వయంప్రభ

''మీ పలుకులతో సంతసమొదవెను
ధర్మ చరితను-మీవలనాకు
కాగలసాయము ఏదియులేదు''
అన-హనుమంతుడు తిరిగి పలికెను.

53. స్వయంప్రభ హనుమదాదులను సాగరతీరమున చేర్చుట

''వానరరాజు పెట్టిన గడువది
బిలముననుండగ గడచిపోయినది
బిలమునుండి మము భూమిమీదకు
చేర్చుముతల్లీ! కరుణామూర్తివి.

ధర్మచారిణీ! మా కర్తవ్యము
సీతను వెదకుట జరగకపోయెను
బిలమున చిక్కుపడిపోయితిమి
నిజము నుడివితిని నమ్ముము తల్లీ!''

అనగా పలికెను ఆ స్వయంప్రభ
''బిలము నుండి మరి తనువుతో మీరు
బయలువెడలగా సాధ్యము కాదు
తపోబలముచే మిముకాపాడెద.

కన్నులు మీరు మూసికొనినచో
బిలముదాటగా చేతును'' అనగా
చేతులతో ఆ వానరులందరు
కన్నులు గట్టిగ మూసికొనగను

॥శ్రీరఘురాముని॥

ఆశ్చర్యముగా బిల్లముకావల
అలలు పొంగెడి కడలి తీరమున
నిలిపి-వారిని-ఆ స్వయంప్రభ
వెడలిపోయెను శుభమని పలికి

భయంకరమగు అలలతోనున్న
వరుణుని స్థావరమానంద్రముగని
ఒడ్డుకానని కడలినిగాంచి
భయసంభ్రమములు నిండిరికపులు.

వింధ్యపర్వత ప్రదేశమందు
పూచిన తరువులు పూలతలన్నియు
గాంచినకపులు-వసంతమాయెను-
గడువుతీరినది అనుచువగచిరి.

సింహ-వృషభముల పోలుమూపుతో
బలసినభుజముల అంగదుడపుడు
వృద్ధుల-శిష్టుల-వానరవీరుల
చేర్చిపలికెను అనునయమ్ముగ

గడువుగడచెను బిలములోపడే
రాజశాసనమునంది వెడలితిమి
కాగలకార్యము ఆలోచించుడు
నీతికోవిదులు మీరందరును.

విశ్వాసముగల వీరులు మీరు
కార్యసాధకులు అనుచు పలికిన-
రాజు ఆనతిని తలనుధరించిరి
ముందు నన్ను మరి నిలబెట్టుకొని

॥శ్రీ రఘురాముని॥

బయలుదేరితిరి కార్యముకాదయె
తిరిగివెడలగ సుగ్రీవుడటు
తలలదునుముసు సందియమేల-
నియమితకాలము దాటిపోయినది

కావున బ్రతికి సుఖపడమింక
ప్రాయోపవేశము చేయుదమనుచు
అర్కసుతుడు అతి కఠినస్వభావుడు
రాజ్యమునేలెడి రాజు ఆతడు.

రాముని భార్య కనబడలేదన
చంపును మనలను మనమచ్చటకు
పోయిచచ్చుట-అవమానమగు
ఇచ్చట చచ్చుట-మేలగుమనకు

యువరాజైతిని రాముని చలవతో
భానుజు ప్రేమతో కానేకాదు
పాతవైరమున చంపును నన్ను
పుణ్యజలనిధి ఒడ్డున చత్తును.

వానరశ్రేష్ఠులు పలికిరి అపుడు
అంగదు మాటలు ఆమోదించిరి
రాముని ప్రీతి నందుటకొరకు
చంపుట తథ్యము వానరరాజు

అపరాధులు మరి రాజ దర్శనము
చేయగ తగరు కావున సీతను
వెదకి గాంచిన-పురము చేరుదము
లేదా మరి యమపురిని చేరుదము.

॥శ్రీరఘురాముని॥

వానరులచట భయముతో పలుకగ
తారుడుపలికెను వారితోనపుడు
"తిరిగి బిలమున సుఖముగనుందము
భయమనుమాట వినబడదచట

సుగ్రీవుడును సురనాయకుడు
అతనికి సమమగు రామచంద్రుడు
మనలనుచేరగ చాలరుకనుక
బిలమునచేరి సుఖముగ నుందము"

అంతట కపులు అంగదుమాటలు-
తారుని మాటలు వినినవారయి
కీడు కలుగని వీలగుమార్గము
ఆలోచించుడు చేయుదమనిరి.

హనుమంతుడు అంగదుని ఇంగితము తెలిసి కర్తవ్యము బోధించుట

తారానందను పలుకులకచట
తారుని పలుకులకచ్చటి కపులు
సరియనుమాట విని హనుమంతుడు
తలచెను మదితో అంగదుడిపుడు

వానరరాజ్యము అందగతగిన
పదునాల్గు గుణములు-ఎనిమిదంగములు
నాల్గు విధముల-బలము కలిగిన
వీరుడు అగునని-మదితలపోసి

శుక్లపక్షపు చంద్రునివోలె
వృద్ధిపొందెడి తేజమనుకొని
తండ్రికి తగిన బలవంతుడని
బుద్ధికాతడు బృహస్పతియని

॥శ్రీరఘురాముని॥

శుక్రనీతి విను-వాసవురీతిగ
"తారుని" మాటలు విన మనసున్న
సకలశాస్త్రముల నెరిగినవానిని
స్వామికార్యమున శ్రమపడినట్టి-

అంగదు విషయము తెలిసినవాడై
ఆంజనేయుడు పలికెను అచట-
భేదోపాయము కలిగించి అట
వారిలో వారికి వాదముగొలిపెను

అవునని కాదని పలుకుచుండగా
కోపము తెచ్చుకు నిలిచినవాడై
పలికెను మారుతి-బుద్ధిమంతుడు
అంగదుగాంచి-అనెను తీవ్రముగ

"యుద్ధమునందు తండ్రికి తగుదువు
కపిరాజ్యము నువు ఏలగ తగుదువు
అయినను వినుము-కపులగు వీరు
చపలచిత్తులు తెలియుము తీరుగ

భార్యల-బంధుల వదలివీరిట
కలకాలము నిన్నేల కొలుతురు ?
చెప్పెదవినుము స్పష్టముగాను
సుహోత్రుడు మరి జాంబవంతుడు

నేనును-నీలుడు సూర్యపుత్రుని
వదలము మేము నీవెటులయిన
సామ-దానము-భేద-దండముల
మమ్ముల నీతో కలపనసాధ్యము.

॥శ్రీరఘురాముని॥

బలహీనుడు తను బలవంతులతో
విరోధించి మరి బ్రదుకశక్యమా
బిలములో క్షేమము అనగా వింటిని
లక్ష్మణు శరముల కదియొకలెక్కా

సురనాయకుడు-వజ్రాయుధమున
కూల్చెను అసురుని-అనగా వింటిమి
లక్ష్మణు శరములు చుట్టినబిలమున
బ్రతుక శక్యమా ఎవరికయినను ?

సుమిత్ర తనయుని శరములు-వినుము
వజ్రాయుధమును-పిడుగుల పోలి
కులపర్వతముల చీల్చగ చాలును
నీస్నికపులు పీడుట తధ్యము

బిలమున దాగిన వారందరును
వెడలిన-ఒంటరివాడవగుదువు
భార్యాబిడ్డల వదలి ఇచ్చట
ఇడుములబడెడి వారెవరయ్యా !

వీరులు వీడగ-ఒంటరివైనను
తృణహీనముగా బ్రతుకుచుందువా !
బ్రతుకుట యెట్లు ! లక్ష్మణుశరములు
బలిగొనవా నిను? తెలియద నీకు.

ఓ యువరాజా ! కిష్కింధాపతి
నీ యెడ మిక్కిలి ప్రియతముడయ్యా !
నీపై పగ ఆ రాజుకు లేదు
నాతో రమ్ము కిష్కింధాపురి.

॥శ్రీరఘురామ॥

అంతియెగాక నీ తల్లి యెడ
అతి అనురాగము గలిగియుండెను
ఆమెకొరకు తను సర్వమునిడును
నీవు తప్ప మరి సంతతి యెవరు ?"

55. అంగదుని ప్రాయోపవేశ నిర్ణయము

అంజనేయుడు అణుకువతోను
రాజగౌరవము-ధర్మమునిండి
అర్కసుతునట ప్రశంసించగా
అంగదుడనెను రాజుగురించి

స్థైర్యము-ధైర్యము-దయ-దాక్షిణ్యము
ఋజుత్వమున్న-ఆత్మవికాసము
లేకపోవుటది-వింతకాదయా
అర్కసుతుడన నీకు తెలియదా ?

మాతృతుల్యయగు అగ్రజుభార్యను
అన్నయుండగా ఆలిగగొనెను
అంతటివాడు ఎంతటినీచుడొ
ఆలోచించుము అంజనినందన

వెలుపలినుండి కావలికాయుము
అనిపలికి తను పోరుకుపోగా
బిలద్వారమును మూసినతమ్ముడు
ధర్మమార్గము తెలిసినవాడా ?

చేయి కలిపెను చేసె ప్రమాణము
తనపని తీరిన తదుపరి అతడు
రామచంద్రుని మరచిపోయెను
కృతఘ్నతకిది నిదర్శనమ్ము.

॥శ్రీరఘురాముని॥

సీతను వెదుకగ వీరులనంపుట
సుమిత్ర తనయుని భయమువల్లనే
ధర్మభయమున ఆ కపిరాజు
వెదుకనంపగ లేదని తెలియుము.

చపలచిత్తుడు-స్మృతిహీనుడును
కలుషాత్ముడు మరి కృతఘ్నుడున్న
అయినవానిని-కలలోనయినా
నమ్మడు-సత్కుల వంశజుడెవడు.

గుణవంతుడును గుణరహితుడును
తనపుత్రునకే ధర నీయునుకద
వైరిపుత్రుడను-నన్నారాజు
బ్రతుకనిచ్చునా ప్రాణమ్ములతో

మదిలోనున్నది తెలియబరచితి
నేనపరాధము చేసినట్లుగు
దీనుడనేను అసహాయుడను
పురమునందు నే బ్రతుకుట ఎట్లు ?

క్రూరుడాతడు వంచకుడతడు
దయాదూరుడు ఆ సుగ్రీవుడు
రాజ్యకాంక్షతో బ్రతుకనీయడు
చెరలోనుంచుటో ? చంపుటొ తథ్యము

బంధింపబడి మడయుటకంటె
ప్రాయోపవేశము చేయుటమేలు
వానరులారా ! అనతినిడితిని
మీరికపొందు కిష్కింధాపురి

॥ శ్రీ రఘురామముని ॥

నేనికరాను వానరపురికి
దాశరథులకిదె నా వందనము
వానరరాజుకు అంజలినిడినటు
వారలకుశలము అడిగితిననుడు

జననిరుమాంబా దేవిని మీరు
సేమమాయని ప్రశ్నించుడయా
తల్లితారను-అనునయమ్ముగ
ఊరడించుడు దుఃఖముతీర్చుడు.

నన్నుగన్న నా తల్లి తార-అట
పతివియోగమున క్రుంగిపోయెను-
ఆపై నేను మడయుట వినినచొ
మాతబ్రతుకుటది అసాధ్యమైనది''.

పెద్దలందరకు ఆ విధి చెప్పి
దర్భలపరచుకు శోకమునిండి
నేలబరుండెను తారాసుతుడు
వానరులందరు దుఃఖమునిండిరి.

వానరులందరు ఆచమించిరి
జలధికి ఉత్తరదిశలోవారు
దక్షిణదిశలో కొనలుండునటు
దర్భల పరచుకు మరణోన్ముఖులై

రామచంద్రుని వనవాసమ్ము
దశరథరాజు మరణించుటయు
జనస్థానమున ఖరాది అసురుల
రామచంద్రుడు అంతముచేయుట.

సీతాపహరణము జటాయుమరణము
వాలిమడయుట రామునికోపము
వానరులందరు వ్యాకులమందుట
తలచి తలచి అటు ఏడ్చిరికపులు

పెద్దగరోదన కపులుచేయగా
మేఘములురిమిన ధ్వని కలిగినది
కొండగుహలలో వారి పలుకులు-
రోదనలన్నీ ప్రతిధ్వనించెను.

56. సంపాతి దర్శనము

ఎటువానరులు మడయనెంచిరో
అటు జటాయువుకన్న పెద్దయగు
సంపాతియను-పులుగు శ్రేష్ఠుడు
వారలగాంచి సంబరపడెను.

"ప్రాణులందరికి ఆహారమును
ఇచ్చి కాచును పరమేశ్వరుడు
వలయునట్టి ఆహారమంతయు
ముందుకు వచ్చి నిలచె విచిత్రము

రోజున కొక్క కపిని తిందునని"
అనిన మాటలు విని అంగదుడు
ఆంజనేయునితో పలికె తిరుగా
పక్షి రూపమగు యముడే అనెను

రాముని కార్యము చేయగలేదు
రాజు ఆజ్ఞ పాలించకపోతిమి
సీతాదేవికి మేలు చేయగ
నిలచి జటాయువు అంతమొందెను

॥శ్రీ ఘు — ము॥

ఎవరికి వారే ముందుగ నిలచి
తోడు కోసమై అన్వేషించక
రామచంద్రుని కార్యము తీర్చగ
ధర్మము-అటుల జటాయువు నిలచెను.

రామపత్నిని వెదకుట ధర్మము
వనముల వెదకి అలసిపోతిమి
మరణ సమయ మాసన్నమైనది
పక్షిచంపుననివంత ఏలయిక?

రావణునెదిరి అవనిజ కావగ
జటాయువచ్చట అసువులు బాసెను
ధన్యుడాతడు-మనమిచ్చటను
రాజుభయమున చావదలచితిమి.

దశరథు మృతియు సీతాపహరణము
జటాయు మరణము వలననె మనకు
ప్రాణాపాయము సంభవించినది
కైకవరములవి ప్రాణాంతకమయె

57. సంపాతియు, వానరులు-ఒకరి వివరములొకరు తెలుసుకొనుట.

వాలి కుమారుని పలుకులన్నియు
నేల బరుండిన కపులు వినుటయు
పులుగు శ్రేష్ఠుడు విని అట కరుణతొ
పలికెను తిరిగి "మీ పలుకులలో

జటాయు మరణము వింటిని నేను
నా హృది అంతయు జ్వలించుచుండెను
దండకాటవిని దశకంఠునితో
ఏల పోరు? మరి ఎటుల మడసెను?

॥శ్రీరఘురాముని॥

వానరశ్రేష్ఠా ! నీవెవ్వరవు
వివరములన్నీ తెలుపుడు మీరు
మంచి మనసుతో గిరిపై నుండి
భూమి మీదకు దింపుడు నన్ను

రవికిరణముల వేడిమిచేతను
రెక్కలు నావి కాలిపోయినవి
నేలకు దింపుడు వివరము తెలుపుదు
తమ్ముడు దశరథు సఖుడెట్లాయెను''

దుఃఖము పొరలుచు పక్షిపలికెన్ను
విని వానరులు నమ్మకపోయిరి
తీరా తెచ్చి దింపిన వెనుక
వంతుగ తినును అని తలపోసిరి.

కొందరు పలికిరి చచ్చుటకే మరి
సిద్ధపడితిమిక భయమది ఏల?
అనుచు పలుకుచు కొందరు పోయి
పక్షిని నేలకు దింపిరి అచట.

అంగదుడపుడు పలికెపులుగుతో
''బ్రహ్మ సమానుడు ఋక్షరజుడను
వానరశ్రేష్ఠుడు-అతనికిద్దరు
కుమారులుండిరి అతిబలవంతులు.

వాలి-సుగ్రీవులు వారి పేరులవి
అందు వాలి నా ప్రియజనకుడయా !
అద్భుత కార్యము లెన్నో చేసి
కీర్తి గడించెను వానరరాజు.

॥శ్రీరఘురాముని॥

దశరథ తనయుడు రఘువంశమున
ప్రసిద్ధి గాంచిన రామచంద్రుడు
తండ్రి ఆనతిని తన సతి సీతతో
తమ్ముడు లక్ష్మణమూర్తితో నంత

న్యాయ మార్గమున నడచురాముడు
కానన సీమల నడచుచునంత
దండకవనిలో చేరినయంత
పాపకర్ముడు రావణాసురుడు

రామునిసతిని వంచనతోను
జనస్థానమున అపహరించగా
దశరథరాజుకు సఖుడు జటాయువు
జానకిదేవిని రక్షించుటకై

వానితో పోరి రథమును విరచి
ధరణి మీద నిలబెట్టెను వానిని
పోరుసాగెను వృద్ధుడగుటచే
బడలి యుండగా-రెక్కలు తెగెను

రెక్కలు తెగిన పక్షిరాజుకు
మరణించగను రామచంద్రుడు
ఉత్తమగతిని కలిగించెను విను!
సుగ్రీవునితో నెయ్యము నెరపెను

సుగ్రీవునికి శత్రువు అయిన
వాలిని చంపి రామచంద్రుడు
వానరరాజ్యము రవిసుతుకిచ్చెను
సీతను వెదకగ రాజుపంపగా.

॥శ్రీరఘురాముని॥

వెదకితిమెంతో మెలకువతోను
నిశిలో సూర్యుడు కనబడనట్లే
కనబడలేదు సీతాదేవి
తిరిగి వెదకుచు నుండగమేము

తెలియకపోయి ఓ ధర్మజ్ఞా!
మయునిర్మితమగు బిలమునందున
చిక్కుకుంటిమి-గడువుతీరినది
రాజు ఆజ్ఞకు బద్ధులమయ్యా!

గడవుగడచెను కార్యముకాదయె
తిరిగిమేము మరి పురముచేరుటెటు?
మా ప్రాణములు దక్కవు కావున
ఇచ్చట చావగ నిర్ణయమైనది

రామచంద్రునికి సుగ్రీవునకు
లక్ష్మణమూర్తికి కోపమువచ్చిన
మా దేహమున అసువులుండవు
నిజమిదినమ్ముము-పక్షికులోత్తమ!''

58. సీతాదేవి వివరము సంపాతి చెప్పుట

ప్రాణపుతీపి వదలినకపులు
దుఃఖించుచును చెప్పగ వినిన
సంపాతపుడు పలికెను వారితో
''జటాయువాతడు నా సోదరుడు

అతని మరణము వింటిని నేను
రెక్కలులేక పడియుంటినిట
లేదా నే పగ సాధించెదను
వృత్రాసురుడు సురనాయకులకు

||శ్రీరఘురామునీ||

పోరు జరిగెడి సమయములోను
సోదరులము-మా వేగము తెలియుగ
పోటీపడి మరి నింగిని ఎగిరి
సూర్యమండలము చేరబోతిమి

సుడులు తిరుగుచు గగనవీధిలో
సాగుచుండగా అపరాహ్ణమున
సూర్యునివేడి నా సోదరుడు
భరించలేక బాధపడగను

ప్రేమగ అతనికి వేడి సోకనట్లు
రెక్కల నేను కప్పితినంత
ఆ వేడికి నా రెక్కలు కాలి
వింధ్యగిరిని నే పడిపోయితిని.

కావున తమ్ముని వివరము తెలియదు''
అనగ నంగదుడు పలికెను అపుడు
''నేనుడివినది వింటివిగనుక
రావణు నెలవు తెలిసిన తెల్పుము.''

సంపాతపుడు సంతోషముతో
పలికెను వారితో ''గ్రద్దను నేను
శౌర్యహీనుడను రెక్కలు లేక-
అయినను నుడివెద వినుడందరును.

రాముని కార్యము మొదటిది వినుడు
మాటసాయము చేయగచాలుదు
రావణు విషయము తెలియును నాకు
వితలాదిలోకముల నెరుగుదు నేను

॥శ్రీ రఘురామ॥

త్రివిక్రముడయి విష్ణుమూర్తి - తను
భూమినికొలుచుట తెలియును నాకు
దేవాసురుల పోరు తెలియును
అమృతమథనము తెలియును నాకు

రావణాసురుడు నింగినిగొనిపో
నిడువగుకన్నులు గలిగినయువతి
యౌవనవతియు భూషణయుతయు
శోకమునిండిన కోమలిఅపుడు

ఆభరణమ్ములు తీసివేయుచు
ఆక్రందించెడి త్రిలోకసుందరి-
స్త్రీనిగాంచితిని గిరిశిఖరమున
సూర్యకాంతియో మేఘమునందలి-

మెరుపుతీగయో అన ఆ జవ్వని
పట్టుచీర ఆ అసురునిపై బడ
రామా: లక్ష్మణా: అనుచు ఏడ్చెను
ఆ మానిని యగు రాముని సుందరి

రావణు వివరము చెప్పెదవినుడు
విశ్రవసునికి ఔరసపుత్రుడు
కుబేరునకును తమ్ముడాతడు
లంకానగరము నేలునువాడు.

సంద్రమునుండి నూరామడలలో
విశ్వకర్మ నిర్మించిన ద్వీపము
అదియే అసురుడు వసించుపురము
బంగరుసౌధములుండును శోభగ.

॥శ్రీరఘురాముని॥

రక్కసి వనితల కావలినడుమన
రక్కసు నంతఃపురము నందున
దుఃఖమునున్నది సీతాదేవి
ఫలసిద్ధిని మరి పొందుడుమీరు

త్వరగా సాగుడు జాగు చేయక
జ్ఞానదృష్టితో గాంచితినేను
కార్యము తప్పక తీర్తురుమీరు
విజయవంతులై మరలగలరయా!

దివ్యదృష్టి మాకున్నది వినుడు
ఆకసంబున ఏడుస్కంధములు
వాటిలో ఏడవస్కంధము వారము
వైనతేయుని సంతతిమాది

ఒకటవస్కంధము గింజలతినుచు
భూమినుండెడి పక్షిసంతతి
రెండవస్కంధము ఫలములుతినుచు
తరువులతిరుగును-ఇకమూడవది

క్రౌంచములున్న నీటికాకులు
నాల్గవస్కంధము డేగలుఅగును
అయిదవస్కంధము గ్రద్దలగునవి
హంసలుచేరును ఆరవస్కంధము

ఏడవగతి ఇకవైనతేయునిది
అందుజేరిన వారము మేము
నూరామడల దూరమయినను
తేలికగా మరి చూడగలమయా!

॥శ్రీరఘురాముని॥

దూరమునున్న ఆహారమును
వెదకి తినగను విధాత అంతటి
దృష్టినిచ్చెను-అంతటిపుష్టి
కలిగిన తిండి తిందుము మేము.

లోకనింద్యమగు కార్యము అసురుడు
చేసెను తగినటు మీ కార్యమది
చేసిన తమ్ముని చంపినదానికి
ప్రతిక్రియచేసిన వారలగుదురు

సంద్రముదాటగ యోచనచేయుడు
లంకనుజేరి సీతనుగాంచి
జైయని తిరిగి కిష్కింధాపురి
జేరి మిగిలిన కార్యముతీర్చుడు

తమ్మునికిపుడు జలతర్పణము
చేసెద సంద్రము తీరము చేర్చుడు''
అనిన వారలు అటులచేసిరి
సీతాదేవి వివరము తెలిసిరి.

59. జాంబవంతుడు అడుగగా-సంపాతి, మరింత వివరముగా సీతాపహరణము చెప్పుట

సంపాతి పలుకులు ప్రాణముపోయగ
వానరులందరు పొంగిపోయిరి
జాంబవంతుడు సంపాతినిగని
వివరములడిగెను వినయముగాను

''ఎచ్చటనున్నది ఆ సీతమ్మ
ఎవరు చూచిరా రామపత్నిని
హరించినట్టి అసురుడెవ్వడు
వివరము తెలిపి మము రక్షించుము

॥శ్రీరఘురాముని॥

రామచంద్రుని వజ్రశరముల
తాళిపడెడి ఆ మూఢు డెవ్వడు?''
అనగా పలికెను అట సంపాతి
వివరములన్నీ వినుడని తెలిపెను

''రెక్కలుపోయి నే పడియుంటిని
సుపార్శ్వుడనియెడి నాదుకుమారుడు
పితృభక్తిచే నిరతము అతడు
ఆహారమును తెచ్చియిచ్చును.

గంధర్వులకు కామము మెండు
కోపముమెండు పాముజాతికి
భయముమెండు మరి మృగములన్నిటికి
ఆకలిమెండు మాకందరికి

ఒకదినమున మరి చాలాసమయము
వేచియుంటిని-ఆకలినిండి
ఆహారమది లేకనె తనయుడు
చేరెను అతనిని నిందించితిని

శాంతవచనముల తనయుడుపలికెను
''మహేంద్ర పర్వతప్రాంతమునందు
జలజంతువులను అడ్డగించి-అట
వేచియుండగా ఆకాశమున

కాటుకకొండగు దేహమువాడు
సూర్యసమాన తేజమువాడు
స్త్రీనొక్కతెను గొనిపోచుండగ
అడ్డగించితిని ఆహారముకై.

॥శ్రీరఘురాముని॥

అంతట వాడు వినయమునిండి
ప్రార్థనచేసెను త్రోవయిమ్మని
సరి పొమ్మని నే పలికితి వానితో
శరణనగా మరి చంపుట తగదని

తన తేజముచే ఆకసమ్మునే
గొనిపోయెదునటు-వాడుసాగెను
అంబరవీధిని సంచరించెడి
పెద్దలు పలికిరి బ్రతికితివీవని.

వాడు నిన్ను మరి ఎదిరించకను
సాగెను గావున బ్రతికిపోతివి
అనగా నడిగితి వారినప్పుడు
అసురునివివరము వారు తెల్పినది

వాడు రావణుడు-రాక్షసనాధుడు
రాముపత్నిని అపహరించుకొని
భయముచె త్వరగా పోవుచుండెను
విలపించు వనితయె సీతాదేవి

అనుచు సమస్తము తెలిపెను తనయుడు
వినియును నేను అసహాయుడను
రెక్కలు విరిగిన పక్షినినేను
వాక్కు-బుద్ధియు చక్కగనున్నవి.

వానరులారా! రామకార్యమది
నా కార్యముగా తలతును నేను
బలవంతులును బుద్ధిమంతులు
సుగ్రీవునిచే పంపబడితిరి.

॥శ్రీరఘురాముని॥

సురలకైన మీరసాధ్యులయ్యా!
రామునిశరములు మూడులోకముల
పొడిపొడి చేయగ శక్తిమంతములు
రావణుడాతడు బలయుతుడయ్యును-

మీరు సమర్థులు మీకసాధ్యము
లేదు ఇంక మరి జాగుచేయక
వడిగా సాగుడు వెనుకచూడక
రామకార్యమది తీర్చుకురండు.''

60. నిశాకరమహర్షి వృత్తాంతము సంపాతి తెలుపుట

వానరవీరులు వినుచుండగను
తిరిగిపలికెను సంపాతపుడు
''సద్దుచేయక వినుడు శ్రద్ధగ
నేనిట నుండుట వివరించెదను

రెక్కలుకాలి రాలిపడితిని
తెలివితప్పినది తిరిగితేరుకొని
దక్షిణ సంద్రపు తీరమందుగల
వింధ్యయందు నే పడియుంటినని

పూర్వము యిచట ''నిశాకరు''డను
ఋషిపుంగవుడు తపముననుండెను
స్వర్గముచేరెను ఆ ఋషిశ్రేష్ఠుడు
ఎనుబదివేల ఏండ్లక్రిందట

మా సోదరులను ఆ ఋషి ప్రీతిగ
ఆదరించుచు నుండెడివాడు
అందుకొరకు నే ఋషిని చూడగ
చేరితి-గాంచితి తపోవంతుని.

॥శ్రీరఘురాముని॥

జలనిధి స్నానము తీర్చినమౌని
ముందునడువగా పులులు-సింహములు
పన్నగమ్ములు-చమరమృగమ్ములు
బ్రహ్మవెంబడి ప్రాణికోటులయి

వెంబడివచ్చి సాగనంపిరి
ముని ఆశ్రమమున అడుగుబెట్టి మరి
తిరిగివచ్చెను నన్నుగాంచి అట
పలికెను-"రెక్కలు లేకపోవగా

దేహమంత గాయమ్ములు నిండగ
గుర్తించకను పోతిని నేను
పూర్వమిచ్చట రెండుపులుగులు
అతివేగముగల పక్షులుండెను.

పులుగులు రెండు సోదరులగుదురు
కోరినరూపము దాల్చగలిగిన-
వారిలో నీవు సంపాతివికద
నీ అనుజుడు మరి జటాయువేనా?

మానవరూపము దాల్చుమునీవు
పాదసేవలు నాకుచేయుము
నీ రెక్కలవి ఎటులకాలినవి
నీకి హానిని చేసినదెవ్వరు?"

॥శ్రీరఘురామ॥

61. సంపాతి తన రెక్కలు కాలిన వివరము మహర్షికి తెలుపుట

""మునితో సర్వము చెప్పితినపుడు
ఆయాసముతో మాటలురాకయె
స్వామీ! వినుము పొగరున మేము
కైలాసగిరి శిఖరముచేరి

అచ్చటిమునుల సన్నిధిలోను
సోదరులము మా బలము తెలియగ
రవి అస్తాద్రిని చేరులోపల
రవినిచేరగా పందెము వేసుకు

నింగికెగిరితిమి ఎంతోసాగి
వేదస్వరములతో-సంగీతముతో
ఎట్టినివలువల శోభిలు స్త్రీలతొ
నిండిన తావును దాటి ఎగిరితిమి.

ఎత్తునుండి మరి నేలనుగాంచిన
చిన్నిచక్రములు నగరములాయెను
అడవులు-పచ్చిక పట్టుల పోలెను
గిరులు తోచెను గులక రాలవలె

హిమవత్ వింధ్య-మేరుగిరులవి
మడుగున పాముల వలె కనబడగ
కన్నులు తిరిగెను చెమటలుపోసెను
దిక్కులు తెలియక శూన్యమయ్యెను

ప్రళయకాలమున అగ్నిశిఖలచే
లయమగునట్టు లోకముకనబడె
బలవంతముగా చూడగనపుడు
ధరణియంత విస్తారదేహముతొ

॥శ్రీరఘురామాని॥

కనబడెనచట సూర్యదేవుడు
మాటరాక నా తమ్ముడు-నేలకు
రాలుచుండ నే నతనిని కావగ
రెక్కల నతనిని కప్పితిస్వామీ !

నా రెక్కలవి కాలిపోయినవి
జనస్థానమున తమ్ముడు పడినటు
ఊహించితిని రెక్కలు కాలి
రాలితినిచట మొద్దుమాదిరి

తోడు పోయెను రెక్కలు కాలెను
రాజ్యము పోయెను శక్తి తర్గెన్
అసహాయుడను అసువులునిలపను
కొండనుండి ఇక నేల బడుదును.''

62. సంపాతికి రెక్కలు వచ్చు విషయము

''మహాఋషి వినెను నేవిలపించుట
తపోబలమున చూచిచెప్పెను
నాకు రెక్కలు-బలము వచ్చునని
వినుడు మహాఋషి వాక్కులు నిజమగు

ఇక్ష్వాకువంశమున దశరథరాజుకు
రామచంద్రుడుదయించును ఆతడు
తండ్రియానతిని తన సోదరుడగు
లక్ష్మణమూర్తితో వనమున నుండగ

॥శ్రీ రఘురామమునిః॥

జనస్థానమున రామునిభార్యను
రాక్షసరాజు అపహరించును
ఆమె అచ్చట నిరాహారయై
అశకులొంగదు పతినే తలచును

సురలకు కూడ దుర్లభమయిన
అమృతమును దేవేంద్రుడు యివ్వగ
వాస్తవమ్మును తెలిసిన వనిత
పతివ్రతయగు పావనచరిత

అమృతమందు మొదటి భాగముగ
రామలక్ష్మణుల తలచి వారికై
భక్తితో భాగము భూమిని ఉంచును.
ఆమెను వెదుకగ వత్తురు కపులు

సీతాన్వేషణ చేసెడి కపులకు
ధరణిజ వివరము తెలుపుము నీవు
మేలుకలుగును కావుననీవు
వేచియుండుము వానరులను గన

దేశకాలములకెదురు చూచుచు
రామసేవకై నిలిచియుండుము
వివరముతెలిపిన వచ్చునురెక్కలు
నేను నీకు మరి రెక్కలుఇచ్చిన

ఎగురుచుండు నువు కపులను కాంతువ ?
ఒకచో నిలచిన జరుగును కార్యము
జగతికి మేలగు కార్యము వినుము
నీ నిమిత్తముగ జరుగవలయును.

॥శ్రీరఘురామ॥

సురాధిపతికి భూసురవరులకు
మునులకు, సురలకు రామచంద్రునికి
ప్రీతిగొలిపెడి కార్యమునీవు
చేయగవలెనని మునిపలుకుచును

మహితమూర్తులను రామలక్ష్మణుల
దర్శించగ నా మదిలో కలదు
అంతవరకు ఈ భువిలో తనువును
మోయగలేను పోయెద నేననె.''

63. సంపాతికి రెక్కలు వచ్చుట

''కాగలకార్యము తెలిపి మునీంద్రుడు
ఊరడించెనను, అంతటనేను
అతిప్రయాసతో ఈ గిరినెక్కితి
అహోరాత్రములు చూచుచుంటిని

ఎనిమిదివేల ఏండ్లు గడిచినవి
మునిమాటలు నే మదిలో నిలిపి
వేచియుంటిని ధైర్యముతోను
మునిపుంగవుడు నాకము చేరెను

చావగనెంచెద-మునిమాటలు మరి
మదిలో మెదలును ఆగిపోయెద
నా అజ్ఞాన తిమిరమ్మునకు
ముని మాటనియెడి వెలుగు తోచును

రావణునెదిరి పోరగలేదని
కొడుకును నేను ఆడిపోసెదను
దశరథునెయ్యము తెలిసియుండియు
సీతరక్షణ చేయకపోయెను.''

॥శ్రీరఘురాముని॥

వివరములటుల తెలుపుచుండగా
రెక్కలుమొలిచెను అట సంపాతికి
ఆనందముగా పులుగు పలికెను
మునుపటిబలము పొందితిననెను.

ఎన్నికష్టములు వచ్చినగాని
దీక్షతో సీతను వెదకుడు మీరు
నాకు రెక్కలు వచ్చుట చూడగ
ముని చెప్పినటు-సీతనుచూతురు

వెనుకటిమాదిరి వినువీధిని, నే
తిరగజాలుదును అని తెలియగను
పరీక్షించుకొన దలచితి నిపుడే
శలవునీయుడు నేపోయెదను.''

సంపాతి పలుకుల ధైర్యము కలిగెను
పౌరుషమెంతో వచ్చి చేరెను
అభిజిత్తను శుభలగ్నమునందు
సాగిరి పులుగు చూపిన దిశలో.

64. సముద్రలంఘనమునకు వానర వీరులను అంగదుడు ప్రోత్సహించుట

సంతోషముతో సాగిరి కపులు
పావని సీతను వెదకుట కొరకై
కడలి తీరము చేరిరి అంతట
జలనిధి గాంచి పలుకసాగిరి.

అలలచె నిండిన దీ పాథోనిధి
భీకర జంతువు లిందు వసించును
అనంతమయినది ఆకాశము వలె-
దాటుట ఎట్లు భీకర సంద్రము.

॥శ్రీరఘురాముని॥

దుఃఖము నిండి భయముతో నుండి
వారందరటు పలుకుట గాంచి
అంగదుడనెను ధైర్యము గొలుపుచు
విషాద మనునది కృద్ధపన్నగము

పరాక్రమమ్ము చూపు సమయమిది
దుఃఖితునకు మరి ధర్మార్థములు
కామ, మోక్షముల దొరకవేవియు
కావున కలతను వీడుడు మీరు

విచారమ్మును వదలిరి కపులు
యువరాజునటు కొలిచిరి వారు
సురల మధ్యలో వాసవురీతిగ
వెలిగెడివాడు యోచన చేసెను

జలధి దాటుట ఏ విధి సాధ్యము
వానర సేనను అదుపులోనుంచగ
చాలినవాడు వాయునందనుడు-
వానికి చాలుదు వాలి తనయుడ

వానరులందరి ఉత్సాహమును
వెలికి నెట్టగా యోచన చేసి
పలికెను అపుడు తారకుమారుడు
"సంద్రము దాటెడి వీరుడెవ్వడో

రాజు మాటను నిలుప సమర్థుడు
రామ కార్యమును చేయుధీరుడు
కపులకు ప్రాణ దానము చేయును
ఆలుబిడ్డలతో సుఖమును కూర్చును.

॥శ్రీరఘురాము ని॥

ఎవ్వని మహిమచె పురమునుచేరి
దాశరథులను వానర రాజును
చూచెడి భాగ్యము కలుగనున్నదో''
అనుచు అంగదుడు ప్రేరేపించగ.
వానరులెవ్వరు ముందుకురాక
మెదలక యుండుట గాంచిన వాడై
యువరాజపుడు తిరిగి పలికెను
''అతి బలవంతులు అడ్డము నెరుగరు.
గొప్ప వంశమున బుట్టిన మీరు
అసాధ్యమన్నది ఎరుగరు అసలు
అందరమొకటై పోగలుగుదుమా?
మీమీ శక్తిని తెలుపుడు ఇపుడు
ఎంత దూరము దాటగలరొమరి
తెలియబరచుడు మీ రందరును
అది తెలిసినచో ఆవల కార్యము
ఆలోచింతము'' అనెను అంగదుడు.

65. కపులు వారి వారి శక్తిని తెలుపుట-జాంబవంతుడు అంగదునికి ధైర్యము గొలిపి-సమర్థుని ప్రోత్సహించెదననుట.

కిచకిచలాడుచు కపులు లేచిరి
తమతమ శక్తిని తెలియబరచిరి
పది ఆమడలు గజుడు చెప్పెను
గవాక్షుడిరువది ఆమడలనెను
గవయుడు ముప్పది, శరభుడు నలువది
గంధమాదనుడు యేబది అనెను
మైందుడు అరువది ఆమడలనెను
ద్వివిదుడు డెబ్బది యోజనంబులనె.

॥శ్రీరఘురామునే॥

సుషేణుడేనుబది యోజనంబులు
నిస్సంశయముగ దాటెదననెను
అంతట వృద్ధుడు జాంబవంతుడు
పలికెను వారితో శక్తిని తెలుపుచు

పూర్వము కొంత శక్తి యుండెడిది
వృద్ధుడనైతిని పూర్వపు శక్తిని
తలచిన ఏమగు రామ కార్యమును
ఉపేక్షింపగ తగదు మనకిక

తొంబది ఆమడ లవలీలగను
దాటగలిగిన భుజ బలమున్నది
పూర్వము బలి తను యజ్ఞము చేయగ
విష్ణువు వెలసెను త్రివిక్రమునిగ.

ఆ మూర్తికి నే ప్రదక్షిణించితి
ఆ బలమప్పుడు కలిగియుంటిని
దానిని తలచిన ఫలితము ఏమి
తొంబదామడల శక్తి చాలదు''

అంతట అంగదు డనెను వీరునితో
జాంబవంతుని పొగడుచు పలికెను
''నూరు వరకు నే దాటగలుగుదును
తిరిగి వచ్చుటది సందేహము మరి.''

జాంబవంతుడు పలికెను అపుడు
''ఓ యువరాజా ! దాట సమర్థత
కలిగి యుంటివి-తిరిగి వత్తువు
అయినను నీవు పోతగదయ్యా !

॥శ్రీరఘురాముని॥

రాజు సర్వదా సేవించబడు
భృత్యులు రాజును పంపగతగదు
వానరకోటికి స్వామివి నీవు
నీ రక్షణ ధురి భృత్యుల విధియగు.

సేవకులచె మరి రాజు సర్వదా
రక్షింపబడి సేవలందవలె
లోకమర్యాద కావున అంగద
నిన్ను పంపుటది మాకు తగదయా!

ఈ కార్యమునకు మూలము నీవు
వేరు గట్టిగా నుండగ తరువు
వలయు ఫలములు పూలను ఇచ్చును
కావున నీవు పోవలదయ్యా!

దోషరహితుడా సుబుద్ధి వీవు
ప్రభు తనయుడవు మాకు ప్రభువువే
కావున నిన్ను ముందు నిడుకొని
కార్యము తీర్చగ యత్నము చేతుము''

అంగదుడనెను జాంబవంతునితో
''నే పోకున్నచో సమర్థుడెవరు
కావున తిరిగి మనకందరకు
తప్పదింక ప్రాయోపవేశము,

చావక తిరిగి పోయిన చచ్చుట''
అన విని అపుడు జాంబవంతుడనె
''రాజకుమారా! నీ కార్యమునకు
కొరత కలుగదు ఇపుడే నేను

కార్యసాధకుని ప్రోత్సహింతును''
అనుచు ఒంటరిగ కూర్చొని యున్న
వారిధి దాటగ చాలిన ఘనుని
వాయుపుత్రుని చెంత చేరెను.

66. సముద్రలంఘనమునకు జాంబవంతుడు ఆంజనేయుని ప్రోత్సహించుట

బుద్ధిశాలియగు జాంబవంతుడు
దీనవదనులగు కపులను గాంచెను
హనుమంతుని గని పలికెను తీరుగ
''వానర వీర వరేణ్యుడ ! హనుమా !

సకల శాస్త్రముల పారంగతుడవు
పవన నందనా ! ఉలుకక - పలుకక
ఒంటరివై నువు ఉంటివి ఏల
రామ లక్ష్మణ సుగ్రీవుల వలె

శక్తిమంతుడవు వినుమా హనుమా !
వినతా సూనుడు గరుత్మంతుని
రెక్కల సరియగు బలము నీదయా !
తేజము-బుద్ధి-ధైర్యము లందున

నిన్ను మించి మరి ఎవ్వరు హనుమా !
నిర్మల మనసు కలిగినవాడవు
నీ శక్తి మరి నీకు తెలియదు
నే నుడివెద విను వివరముగాను.

॥శ్రీరఘురాముని॥

అప్సరసలలో శ్రేష్ఠురాలగు
పుంజికస్థల, ప్రసిద్ధ సుందరి
శాపవశమున వానర స్త్రీయై
కుంజరుడను నొక వానర ప్రభువుకు

అంజనిదేవి అన్న పేరుతో
ఉదయించినది-కూతురై నది
కామ రూపమున తిరుగ జాలినది
కేసరి యను నొక కపి కుంజరునకు

అంజనిదేవి ఇల్లాలైనది
సౌందర్యవతి మనుజ రూపమున
సన్నని వలువల శోభగ వెలుగుచు
గిరి ప్రదేశమున విహరించగను,

కొండగాలికా తొయ్యలి పయ్యెద
జారగ-సొగసులు వెలికి వచ్చినవి
మన్మథు వశమున చిక్కిన యట్టి
పవనుడు ఆమెను కౌగలించుకొన

పతివ్రతనగు నాకు కీడును
చేయగ నెంచెను ఎవ్వడు అనగ
వాయుదేవుడు వివరము తెలిపి
కీర్తిమంతుడగు సుతుడు కలుగుననె

"ఈదుట యందు ఎగురుట యందు
నాతో ఈడగు తనయుడు కలుగును
వేగవంతుడు, విక్రమవంతుడు
బుద్ధిబలమది నిండిన వీరుడు

॥శ్రీరఘురాముని॥

ఉదయించుమనని" చెప్పి వెడలెను
అంజనిదేవి కన్నుల పంటగ
ఉదయించితివి పర్వత గుహలో
ఆంజనేయ! నువు అసమానుడవు

అడవిలో సూర్యోదయమును గాంచి
సూర్యుని ఫలముగ మదిలో ఎంచి
మూడు వందల యోజనమ్ములు
ఎగిరితి వయ్యా! రవినే మ్రింగగ

ఎండ వేడి అది బాధించినను
వదలవాయెను నీ ప్రయత్నము
అంతట సురపతి వజ్రాయుధమును
కోపము నిండి విసరెను నీపై

వజ్రాయుధము తగిలెను నీకు
ఎడమ చెంప అది గాయపడగను
హనుమంతుడను నామము కలిగెను
నీ బాధను గని వాయుదేవుడు.

కోపము నిండి కదలకనిలచెను
లోకములన్నీ గడగడలాడెను
సురలందరును కలతచెందిరి
త్వరగా వచ్చిరి కోపము తీర్చగ

శస్త్రమ్ములచే మరణము లేదని
వరము యిచ్చెను విరించి నీకు
వాసవు వరము వినుః హనుమంతా
స్వేచ్ఛామరణము ఓ మతిమంతా!

॥శ్రీ రఘురాముని॥

కేసరికీవు క్షేత్రజ్ఞుడవు
వాయుదేవుని ఔరస పుత్రుడ
తండ్రికి తగిన తనయుడవీవు
నమ్మము నాయన ! సత్యము నుడివితి.

మా ప్రాణములు పోవుచున్నవి
పుణ్యమతీ ! మము దయగనుమయ్యా !
వైనతేయునికి సాటి వత్తువు
పుణ్యమూర్తి ! నువు నిలబడవయ్యా !

గిరులు వనములతో నిండిన భూమిని
త్రివిక్రముడట అవతరించగ
ఇరువది ఒక్కమార్లు ప్రదక్షిణ
చేసితినయ్యా ! అప్పటి మాటది.

సంద్రము చిలికెడి సందర్భములో
సురలు కోరగా దివ్యౌషధులను
లతలను తెచ్చితి వాటి యందున
అమృత మప్పుడు ఉద్భవించినది

ముదుసలినైతిని అది అటులుంచుము
సద్గుణ యుతుడవు బలమున మేటివి
ప్రాణి కోటిలో నీతో సమముగ
సాగెడి వారు మరి యింకెవ్వరు ?

విజృంభించుము వీరవరేణ్యా !
లేచి నిలువుము పవన నందనా !
మాట నిలుపుము కేసరి తనయా !
అసువులు నిలుపుము అంజని నందన !

॥శ్రీరఘురాముని॥

నీ మహిత శక్తి ఓ! మంగళమూర్తీ!
ప్రత్యక్షముగా చూచెదమయ్యా!
వానరోత్తమా! వేగమె లెమ్మ
వారిధి దాటగ చూతుము లెమ్మ.

మిత్రులు నీదగు విక్రమమ్ముగన
వేచియుండిరి వాయునందనా!
విష్ణుమూర్తి అట త్రివిక్రమునిగా
వెలసినట్టుగా వెలయుము నీవు

రోమరోమమున రామనామమై
నామ జపముతో రామబాణమై
భీమబలుడవై స్వామి కార్యమున
రామదూత! నువు రయమున బొమ్మ.

నింగి తగులునటు నిలబడవయ్యా
పొంగి పోవు మా గుండెలన్నియు
అంగదాదుల వేదన తీర్చుము
ముంగిటనుండును లంకాపురము

జాంబవంతుడట ప్రోత్సహించగా
ఆంజనేయుడు విజృంభించెను-
సంతోషముతో వానరవీరులు
ముదమున చూడగ ఎదిగెను హనుమ.

॥శ్రీరఘురామ మునిః॥

67. రామకార్య నిర్వహణకై సమర్థుడై నిలచిన ఆంజనేయుని సందర్శనము.

నూరు యోజనములున్న వారిధి
దాటగ పావని ఎదుగుచుండగా
శోకము వదలి ఆ కపులందరు
ముదముగ స్తోత్రము చేసిరి హనుమను

త్రివిక్రమునిగా నిలచిన దేవుని
విష్ణుమూర్తిని లోకము లెల్ల
దర్శించినటు ఆంజనేయుని
దర్శించిరి అట ఆ కపివీరులు.

కొండ గుహలలో కేసరి మాదిరి
కేసరి తనయుడు నిండుగ ఎదుగగ
మేలు మేలు యని కపులు పొగడగా
దివ్యాకృతిని దాల్చెను పావని

నిప్పులకుప్పగ ముఖము ఒప్పెను
మేన వెంట్రుకలు లేచి నిలచెను
పెద్దలందరికి వందనముంచెను
కొండల చిమ్మగ చాలగ నిలచెను

సంతోషముతో పలికెను మారుతి
"నాతో దాటగ సములే లేరు
తండ్రికి తగిన తనయుడ నేను
మేరుగిరికి నే ప్రదక్షిణించెద

వేయిమార్లు నే ప్రదక్షిణించెద
సంద్రపు నీటిని చేతుల చిమ్ముచు
అడవులు-భూమిని నీటితో ముంచన
వేగముగా నే సాగు సమయమున.-

॥శ్రీరఘురాముని॥

పిక్కలవలన కలిగిన వేగము
మకరులునిండిన కడలిని నింగికి
చిమ్మ గలుగుదు గరుత్మంతునికి
వేయిమార్లు నే ప్రదక్షిణింతున-

సూర్యుని మించిన వేగము కలిగి
అస్తగిరికి రవి చేరులోపలే
ఆ గిరిచేరి అపరాహ్ణమునకు
ఎదురువత్తును సూర్యదేవునికి

అంతటి పయనము ఆగకుండగనె
అలుపులేక నే చేయ చాలుదును
వేగముగా నే సాగు సమయమున
కడలినడుచు నా తొడల వేగమున.

తునకలుకాగా భూమిని జీల్తున
సంద్రపు నీటిని ఎండ గట్టునా-
గిరులను పొడిపొడి చేతున-చేతుల
సాగగ నిలచితి రామ కార్యమున

ఆంజనేయుడన ఏమనుకొంటిరి
రివ్వున నింగికి ఎగరగనేను
నాతో ఎగిరి సాగెడి పూలతొ
మార్గము-తారల నింగిగ తోచును.

నింగి తాకునటు నేను నిలచిన
ప్రాణికోటి నను గాంచు ముదమున
పెద్ద మేఘమై నింగిని భ్రమింగుచు
సాగుచున్నటు చూతురు నన్ను.

॥శ్రీరఘురాముని॥

గిరులు వణకగా జలధి పొంగగా
నింగి మేఘముల త్రోయుచు నేను
మహా వేగమున పయనించెదను
గరుత్మంతుడే నా సరి యగును

సీతాదేవిని చూడలేదను
దుఃఖము వదలుడు సోదరులారా !
బుద్ధిబలముచే నే దర్శించెద
మాతకు వందనమిడి నే వచ్చెద

వాయు వేగము గరుడ వేగముల
వేయి యోజనములున్నా దాటెద
నూరు యోజన సంద్రము లెక్కా
నా భుజబలమున సుధ తేగలుగుదు.

ఇంద్రుని చేతిలో నున్నదయినను
బ్రహ్మదేవుని హస్తమునున్నను
అమృతమును నే తేగలుగుదును
పునాదితో ఆ లంకను తెత్తును''

ఆంజనేయుని పలుకులు వినిరి
ఆనందముతో పొంగిరి కపులు
జాంబవంతుడు మేలు మేలు యని
శుభములు దీవనలట కురిపించుచు

కడలిని దాటి మాతను గాంచిన
ఘన కీర్తిని నువు పొందుము హనుమా !
తాపసులందరి వానర వృద్ధుల
అనుగ్రహము ఆశీస్సులు నీవే.

॥శ్రీరఘురాముని॥

ఏక పాదమున ఓ హనుమంతా !
నిలచియుందుమిట వేగమెరమ్ము
అసువులు మావి-నీ యధీనము
అనుచు పలుకగా మారుతి పలికెను

''నిండుగ నిలచి సాగు వేగమును
భూమి సహింపగ చాలక పోవును
ఆ మహేంద్రగిరి అమరియున్నది
అనువుగనుండును బయలుదేరుటకు

సకల ధాతువులు పలు వృక్షమ్ముల
కఠినమైన శిలలున్న గిరి అది
నూరామడలు నే దాటుటకు
పదముల త్రొక్కిన కదలక నిలుచును.''

మదించినట్టి గజములు నిండిన
పక్షుల కోలాహలములు నిండిన
స్థలములందున పవననందనుడు
స్వేచ్ఛ మీరగా సంచరించెను

ఆంజనేయుని పదఘట్టనతో
సింహము చేతికి చిక్కిన కరివలె
తోచెను మహేంద్ర గిరి అచ్చటను
నీటి వంకలను క్రక్కెను శిలలు

మృగములు భీతిలె, పక్షులు ఎగిరెను
తరువులు కదలెను, ఫణులు దాగెను
పగము విప్పిన పాము పడగలతో
ధ్వజముతో నున్నటు ఆ గిరి తోచెను.

॥శ్రీరఘురామునీ॥

భయ వ్యాకులులు అయిన మునులకు
వడిగా వదలగ ఆ పర్వతమును
భయంకరమ్మగు అడవి యందున
తోడు లేని ఒక ఒంటరి అయినది

శత్రుహరణుడు దృఢనిశ్చయుడు
మహిమాన్వితుడు వానరశ్రేష్ఠుడు
రామకార్యమున లగ్నమయ్యెను
మనసెగిరినది-లంకానగరికి.

ఆ బలవంతుడు శ్రీహనుమంతుడు
అతిగుణవంతుడు ఆంజనేయుడు
బుద్ధి బలముల శ్రేష్ఠుడు వినుడు
బ్రోచు జగతిని వందనమనిన.

శ్రీరఘురాముని రమ్యచరితము
మారుతిరాముని సందర్శనము
సీతాసతికై అన్వేషణము
కపుల సేవ కిష్కింధ కాండము.

శుభమస్తు

లోకాస్సమస్తాస్సుఖినోభవన్తు.

ఫలశ్రుతి

* తెలుగుపలుకుల తేనెలొలకగ
తలపుల తలుపులు - మారుతి తీయగ
భక్తినిండి నీ సేవకోసమై
మనసునపూసిన మల్లెలుస్వామీ !

ACC NO- 2254

* జానకిరామా ! భక్తితోనేను -
శక్తికిమించిన కార్యముతలచితి
సఫలమగుటిది నీదయవలనని
తెలిపితివయ్యా జగదభిరామా !

Rs. 15-00

* భక్తిగ చదివిన వారందరికి
నీ పాదములు - సిరిసింపదలు
సుఖసౌఖ్యములు పుర్ణాయువును
దొరకును, మారుతి తోడుగ నిలచును.

294.592
KAD

మంగళం

మంగళం - మంగళం - వాయుపుత్ర - మంగళం
ఆంజనేయ - మంగళం - రామదూత - మగళం
రామచంద్ర - మంగళం - జనకసుత - మంగళం
సుమిత్రపుత్ర - మంగళం - భరత, శత్రుఘ్న - మంగళం
కొలువుతీరు రామునకు - కోదండధామునకు
ఎల్లగృహములందువుండి - చల్లగాను చూచేటి
రామచంద్రమూర్తికి - మంగళం - మంగళం
రామబంటు హనుమకు - మంగళం - మంగళం.

- శుభమస్తు -

అంకితం

ప్రక్కన-మాత శోభతోనుండి
ఇరుప్రక్కలను సోదరులుండి
కన్నులముందర నమ్మినబంటు
కొలువగు రాఘవ-కొలుతును నిన్నే.

సుందరరామా నీ ఆదేశము
దశరథాత్మజా నీ ప్రేరణ యిది
నే నన్నది-అసలేదీ లేదు
నాదన్నది నీ దయవున్నదని.

నీ పాదములను హృదిలోనుంచుకు
కొలుతును-భక్తుడు భరతుని రీతి
భక్తితో-నీకీ పుష్పము నుంచితి
స్వీకరించి ననుదరిజేర్చుమయా.

—శుభం—